నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సిఎంతో మాట్లాడి గుడిసెవాసులకు పట్టాలకు కృషి
చేనేత రంగానికి ప్రత్యేక స్థానం ఉంది
క్రిమినల్ గ్యాంగ్ నేరాలపై దృష్టి పెట్టండి
లోపలి పేజీల్లో

సంపుటి 28, సంచిక: 49 | శుక్రవారం | 8-08-2025 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00

## రైతు ప్రయోజనాలను పణంగా పెట్టబోం

ట్రంప్ సుంకాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందన



**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై భారీగా సుంకాలు విధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా స్పందించారు. గతంలో ఉన్న 25 శాతం సుంకాలకు అదనంగా మరో 25 శాతం టారిఫ్‌ను విధిస్తూ ట్రంప్ బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన విషయం తెలిసిందే. పెంచిన టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై తక్షణ ప్రభావం చూపనుంది. రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది. కాగా, ట్రంప్ సుంకాల మోతపై ప్రధాని మోదీ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. రైతుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రైతు ప్రయోజనాలను పణంగా మెట్టబోమని వ్యాఖ్యానించారు. దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఢిల్లీలో గురువారం ప్రారంభమైన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మోదీ మాట్లాడుతూ ట్రంప్ సుంకాల పెంపును పరోక్షంగా ప్రస్తావించారు. 'రైతుల సంక్షేమమే మాకు అత్యంత కీలకం. రైతులు, మత్స్యకారులు, పాడిరైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం' అన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యక్తిగతంగా ఎంతటి మూల్యాన్ని చెల్లించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. అమెరికా సుంకాలు పెంచినా, రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. రష్యా నుంచి

తరువాయి 2లో

# గెలుపు చోరీ!


- బిజెపితో కలిసి ఓట్ల దొంగతనం చేసిన ఇసి : రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- ఒకే అసెంబ్లీ స్థానంలోనే లక్ష దొంగ ఓట్లు
- వాటితోనే బిజెపి గెలుపు
- ఆధారాలతో బైటపెట్టిన కాంగ్రెస్ అగ్రనేత
- ఆరు నెలల పాటు కర్నాటకలో మహాదేవపుర ఓట్ల పరిశీలన
- బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలో గెలుపు తారుమారును వివరించిన ప్రతిపక్ష నేత
- 25 చోట్ల మోదీ ఇలాగే గెలిచారని విమర్శ

**న్యూఢిల్లీ :** ఎన్నికల అవకతవకలపై ఆటంబాంబు పేల్చుతానన్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆ పని చేశారు. ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో ఎన్నికల చోరీపై ఓటరు జాబితా, తదితర ఆధారాలతో ఆయన గురువారం నాడు ప్రజెంటేషన్ ఇచ్చారు. బిజెపితో కలిసి ఎన్నికల సంఘం ఎన్నికలను దొంగలిస్తోందని, ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన నేరం అని ఆయన ఆరోపించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని డేటాను విశ్లేషించినప్పుడు స్పష్టమైందన్నారు. ఆరు నెలలపాటు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఓట్ల చోరీకి సంబంధించిన కచ్చితమైన ఆధారాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల డేటాను విశ్లేషించినట్లు ఆయన తెలిపారు. ఆ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీకి 6,26,208 ఓట్లు రాగా, బిజెపికి 6,58,915 ఓట్లు వచ్చాయని, రెండు పార్టీల మధ్య తేడా 32,707 ఓట్లు అని, అక్కడ ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్ల చోరీ జరిగిందని ఆయన అన్నారు.

**ఐదు రకాలుగా ఓటు చోరీ**

కర్నాటక లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 16 స్థానాలు గెలుస్తుందని తమ అంతర్గత సర్వేలో తేలిందని, కానీ 9 చోట్ల మాత్రమే గెలిచామని, అందుకే ఓడిన ఏడు స్థానాలలో బెంగళూరు సెంట్రల్ నియోజవర్గంలో ఒక అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లను పరిశీలించామని రాహుల్‌గాంధీ తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందని,

తరువాయి 2లో




### మహాదేవ్‌పురలో దొంగ ఓట్ల లీలలు...

మహాదేవ్‌పుర నియోజకవర్గంలో షకున్‌రాణి అనే మహిళ రెండు సార్లు ఓటేసింది. ఆమెకు రెండు ఓటరు ఫోటో ఐడి కార్డులు ఉన్నాయి. పేరులో చిన్న చిన్న మార్పులతో వేర్వేరు ఓటరు కార్డులను సృష్టించి, ఆమె రెండు బూత్‌లలో ఓట్లేయగా, రెండు లెక్కింపు జరిగాయి. ఇది ఓటు చోరీకి నిదర్శనం. అలాగే ఆదిత్య శ్రీవాత్సవ అనే వ్యక్తి మూడు రాష్ట్రాలలో ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రలలో ఒక్కోసారి, కర్నాటకలో రెండు సార్లు ఓటు వేశారు. గురు కిరాత్‌సింగ్ అనే వ్యక్తి ఒకే నియోజకవర్గంలో 4 పోలింగ్ బూత్‌లలో నాలుగుసార్లు ఓటేశారు. అడ్రస్ లేని, లేదా ఇంటినెంబర్ : 0 ఉన్న ఓటర్లు 40మంది ఉన్నారు. వారు చెప్పిన ఇళ్ళకు వెళ్ళిన అక్కడ అలాంటి వారు లేరు. కానీ, వారంతా ఓట్లేశారు. ఫోటోలు లేకుండా లేదా గుర్తించలేనంత చిన్న ఫోటోలు ఉన్న ఓటర్లు 4వేలకు పైగా ఉన్నారు. ఇలా వేల సంఖ్యలో ఓట్లు నమోదయ్యాయి.

## 'సుంకాల' పెంపు.. భారత్ స్వయంప్రతిపత్తిపై దాడి

- తీవ్రంగా ఖండించిన సిపిఐ
- ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికే అమెరికా బెదిరింపు వ్యూహాలు

**న్యూఢిల్లీ :** రష్యాతో చమురు వాణిజ్యానికి ప్రతీకారంగా భారతదేశంపై 50శాతం శిక్షాత్మక సుంకాల విధింపు ద్వారా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపు వ్యూహాలకు పాల్పడటాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. వాణిజ్య సంబంధాలను అమెరికా ఇలా బహిరంగంగా దెబ్బతీయడం భారతదేశ స్వయం ప్రతిపత్తిపై దాడి చేయడమేనని సిపిఐ

తరువాయి 2లో

## హైదరాబాద్‌లో క్లౌడ్ బరస్ట్

- కుంభవృష్టి బీభత్సం
- రోడ్లన్నీ జలమయం
- నగరమంతటా భారీ ట్రాఫిక్ జామ్
- జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాపక్షం/హైదరాబాద్

భాగ్యనగరంలో గురువారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. క్లౌడ్ బరస్ట్ తరహాలో ఒకేసారి కుంభవృష్టి సంభవించింది. నగరం మొత్తాన్ని సాయంత్రం 3 గంటల నుంచే నల్లటి మబ్బులు కమ్మేశాయి. దాదాపు గంట పాటు రికార్డు స్థాయిలో కురిసిన ఈ వర్షం నగరంలో బీభత్సం సృష్టించింది. కుండపోత వర్షం కారణంగా నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఈ అకాల వర్షం కారణంగా నగర జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీరు

తరువాయి 2లో




### అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సిఎం రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు భారీ వర్ష సూచన ఉన్నందున అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగర ప్రజలు తమ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని సిఎం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ,డిజిపి జితేందర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్

తరువాయి 2లో

## భారత విదేశాంగ విధానం ధ్వంసం

- ట్రంప్ సుంకాల విధింపుపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శనాస్త్రాలు
- ఆ విపత్తును ఎలా ఎదుర్కోవాలనేది మోదీ ప్రభుత్వానికి తెలియదని ఎద్దేవా




**న్యూఢిల్లీ :** కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుపై గురువారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. భారతీయ వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడం 'ఇది ఒక విదేశీ విధానం విపత్తు' అని, ఆ విపత్తును ఎలా ఎదుర్కోవాలనేది మోదీ ప్రభుత్వానికి తెలియదని మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా చేశారు. రష్యా దేశ ం చమురును భారతదేశం కొనుగోలు చేసినందుకు ట్రంప్ మరొక 25 శాతం జరిమానా విధించిన ఒక రోజు తర్వాత ఖర్గే మాట్లాడుతూ మన దౌత్యం వినాశకరమైన రీతిలో దిగజారిపోతున్న సమయంలో ఈ నిర్ణయం వచ్చిందని ఖర్గే ఆరోపించారు. అనేక నెలలుగా చర్చలు జరుపుతున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికాలో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపడంలో విఫలం అయ్యారని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు ట్రంప్ మనలను 'బలవంతం చేయడమే కాకుండా బెదిరిస్తున్నారు' అని అన్నారు. 'ఎక్స్'లో చేసిన ఒక పోస్ట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 'భారతదేశ జాతీయప్రయోజనాలే అన్నింటికంటే గొప్పవి' అని పేర్కొన్నారు.'అలీనసిద్ధాంతంలో పొందుపరచబడిన మన కాల పరీక్షిత వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి విధానం కోసం భారతదేశాన్ని ఏకపక్షంగా శిక్షించే ఏ దేశమైనా భారతదేశం ఏ ఉక్కుచట్రంతో తయారు చేయబడిందో అర్థం చేసుకోలేని దేశమే' అని ఖర్గే అన్నారు.7వ నౌకాదళ బెదిరింపు నుండి

తరువాయి 2లో

## నోటిఫికేషన్ విడుదల

ఉపరాష్ట్రపతి ఎన్నికకు నామినేషన్ల మొదలు




**న్యూఢిల్లీ:** భారత ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రాజీనామాతో చేయడంతో, ఈ ఎన్నిక అనివార్యమైంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల నోఫిషికేష్‌లో నామినేషన్ల ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఒకవేళ ఎవరైనా అభ్యర్థిత్వం ఉపసంహరించుకోవాలనుకుంటే, 25వ తేదీ వరకు గడువు ఉంటుంది. అవసరమైతే, సెప్టెంబర్ 9న ఎన్నిక జరుగుతుంది. అదేరోజు ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. పార్లమెంటు సభ్యులు ఓటర్లుగా ఉంటారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తారు. ఏక బదిలీ ఓటు పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది. ఆరోగ్యం

తరువాయి 2లో

## బిసి రిజర్వేషన్లపై పార్టీలో చర్చించి నిర్ణయం

- న్యూఢిల్లీలో మీడియా సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి
- బిజెపికి బిఆర్‌ఎస్ 'బి' టీమ్‌గా మారిందని విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వకుండా బిజెపి అడ్డుపడుతోందని,రిజర్వేషన్ల విషయంలో బిఆర్‌ఎస్ శిఖండి పాత్రను పోషిస్తూ, బిజెపికి బిటీమ్‌గా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో భవిష్యత్ కార్యాచరణపై పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ (కాంగ్రెస్ పార్టీ పిఎసి), ప్రభుత్వపరంగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బిసి రిజర్వేషన్ల సాధనకు ఏ విధంగా ముందుకెళ్లాలి, చట్టపరంగా, న్యాయపరంగా ఎటువంటి ఒత్తిడి తీసుకురావాలి.?, ప్రజా క్షేత్రంలో తీసుకోవాల్సిన కార్యాచరణపైన ఒక నిర్ణయానికి వస్తామన్నారు. బిసిలపైన బిజెపికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే ఆ పార్టీ నేతలు చెబుతున్నట్టుగానే వారు కోరుకునే విధివిధానాలతోనే ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలోనే బిసిలకు రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెడితే చట్టం అవుతుందని, తద్వారా అన్ని రాష్ట్రాలలో అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది కదా? అని అన్నారు. న్యూఢిల్లీలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండాసురేఖ, అడ్లూరి లక్ష్మణ్, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్, ఎంపిలతోకలిసి సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించొద్దని బిజెపి, తెలంగాణ రాష్ట్రంలో 50 శాతం మించి రిజర్వేషన్లను

తరువాయి 2లో

## రిటైర్డ్ అయ్యాక ఐపిఎస్ హోదానా?

- ప్రభాకర్‌రావుకు మళ్ళీ అదే హోదా కల్పించే అధికారం రాష్ట్రానికి లేదంటున్న ఐపిఎస్ వర్గాలు
- ఆ జీఓ ఇవ్వడం నేరమే..!
- ఆయన నియామకం సిఫార్సులపై సంతకం పెట్టిన అప్పటి సిఎం కెసిఆర్‌పై కేసు నమోదు చేసేందుకు సిట్ అధికారుల కసరత్తు!

(బి.వాసుదేవరాజు)



దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన తెలంగాణలో 'ఫోన్ ట్యాపింగ్ కేసు'లో రోజుకో కొత్త విషయం బయటపడుతున్నది. తాజాగా ఎస్‌ఐబి ఐజిగా పదవీ విరమణ చేసిన ఐపిఎస్ అధికారి టి.ప్రభాకరరావును, తిరిగి అదే పోస్టులో (క్యాడర్ పోస్టులో) నియమించడం సరైంది కాదనే విషయం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు నేరపూరితమైనవని ఐపిఎస్ వర్గాలు, న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ఉత్తర్వులు జారీచేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం (డిఓపిటి) నిబంధనల ప్రకారం ఔట్ సోర్సింగ్, రీ రిక్రూట్‌మెంట్ కింద నాన్–క్యాడర్ పోస్టులో సలహాదారులుగా, చైర్మన్‌లుగా, ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒఎస్‌డి) లుగా నియమించుకునే అధికారం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది. అయితే, పదవీ విరమణ పొందిన ఐపిఎస్ అధికారిని, అదే క్యాడర్‌లో, హోదాలో తిరిగి నియమించేందుకు రాష్ట్రానికి స్వతంత్ర అధికారం లేదు. కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్ ప్రకారం ఐజి పోస్టు అనేది ఐపిఎస్ హోదాలోని క్యాడర్ పోస్టు. వీటి నియామకాలకు

తరువాయి 12లో

## జన నేతకు ఘన వీడ్కోలు

- కదిలిన పల్లెలు, బరువువెక్కిన గుండెలు
- అశ్రునయనాల మధ్య సిపిఐ నేత అయోధ్య అంతిమయాత్ర
- కదిలొచ్చిన జనం, కన్నీరుపెట్టిన నేతలు
- జనసంద్రమైన రామానుజవరం






ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

కమ్యూనిస్టు పోరాట యోధుడు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యకు అంతిమ వీడ్కోలు గురువారం అశృనయనాల నడుమ సాగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కలవేన శంకర్‌లు అయోధ్య భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి, పూల మాలలు వేసి జోహార్లు అర్పించారు. సూర్యాపేటలో బుధవారం వేకువ జామున ప్రమాదానికి గురై తుదిశ్వాస విడిచిన ఆయనను ముందుగా ఖమ్మం జిల్లా సిపిఐ కార్యాలయానికి, ఆతర్వాత కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యాలయానికి,

తరువాయి 12లో



## సినీరంగ కార్మికులకు వేతనాలు పెంచాల్సిందే

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సినీమా రంగ కార్మికులకు వేతనాలు పెంచాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ డిమాండ్ చేశారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు 30 శాతం, చిన్న చిత్రాలకు 15 శాతం వేతనాలు పెంచాల్సిందేనని స్పష్టం చేశారు. వారికి న్యాయం జరిగేవరకు సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని సినిమా కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ్మాతో కలిసి నారాయణ మీడియాతో

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## 76 ఏళ్ళ ఫ్రాన్స్ చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చు

హెలికాప్టర్లతో వాటర్ బాంబింగ్

**పారిస్:** దక్షిణఫ్రాన్స్‌లో గడచిన 76 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత ఉద్ధృత స్థాయిలో కార్చిచ్చు వ్యాపించింది. దాదాపు పారిస్ నగరానికంటే చాలా ఎక్కువ విస్తీర్ణంగల ప్రాంతంలో కార్చిచ్చు మంటలు వ్యాపించి తీవ్ర నష్టం కలిగించాయి. అనేక ఇళ్ళు దగ్ధమయ్యాయి. ఎంతోమంది నిరాశ్రయుల య్యారు. ఇప్పటికే ఒక మహిళ సజీవదహనం కాగా మరో ముగ్గురు జాడ తెలియడంలేదు. ఇప్పటివరకూ 62 చదరపు మైళ్ళ విస్తీర్ణం (16000 చదరపు హెక్టార్లు)లో కార్చిర్చు వ్యాపించింది. 2000 మంది అగ్నిమాపకదళ సిబ్బంది, మరో 500 అగ్నిమాపకదళ వాహనాలు మంటలను అదుపుచేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యాయి.

హెలికాప్టర్ల ద్వారా వాటర్ బాంబింగ్ చర్యలు చేపట్టారు.గవాతావరణ మార్పులకు, ఈ కార్చిచ్చుకు చాలా దగ్గర సంబంధం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరించారు.

### కాల్పుల విరమణపై 'ఏసియన్' పర్యవేక్షణ..
## థాయ్–కాంబోడియా అంగీకారం




**కౌలాలంపూర్:** ఇటీవల సరిహద్దు ఘర్షణలకు దిగిన థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలు ''ఏసియన్'' గ్రూపు (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) దేశాల ను కాల్పుల విరమణ పర్యవేక్షణకు అనుమతించేందుకు అంగీకరించాయి. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో రక్షణ అధికారులు మూడురోజులు జరిపిన చర్చలు గురువారం ఒక సం యుక్త ప్రకటనతో ముగిశాయి. చర్చల సందర్భంగా థాయ్–కాంబోడియా దేశాల రక్షణ అధికారులు ఈ ''ఏసియన్'' గ్రూపు దేశాల పర్యవేక్షణకు అంగీకారం తెలియజేశా యి. అంతర్జాతీయ మానవతావాద చట్టానికి కట్టుబడి ఉండేందుకు అంగీకరించాయి. ఈ అంగీకారం మేరకు పరస్పరం రెండు దేశాలవద్దా ఉన్న సైనికులపట్ల మానతాదృక్పథంతో వ్యవహరించాల్సి ఉంటుంది. రెండు దేశాలూ తమ వద్ద బందీలుగా ఉన్న సైనికులను ఇచ్చిపుచ్చుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు నాలుగో తేదీనాటి గణాంకాల ప్రకారం రాయల్ థాయ్‌లాండ్ ఆర్మీ వద్ద 18 మంది కాంబోడియా దేశ సైనికులు బందీలుగా ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు కాంబోడియా సైనికులను ఆగస్టు ఒకటో తేదీన థాయలాండ్ దేశం వారికి స్వాధీనం చేసింది. ఐతే ఎంతమంది థాయ్‌లాండ్ సైనికులు కాంబోడియావద్ద బందీలుగా ఉన్నరన్న విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఐతే థాయ్‌లాండ్, కాంబోడియా రెండు దేశాలు 'ఏసియన్' దేశాలకు చెందిన పర్యవేక్షక బృందాలను తమ తమ సరిహద్దుల్లో పర్యటనకు అనుమతిస్తాయి. ఈ రెండు దేశాలమధ్యా దాదాపు 1200 కి.మీ నిడివిగల సరిహద్దులు ఉన్నాయి. మీరంటే మీరే కాల్పులు మొదట ప్రారంభించి కయ్యానికి కాలు దువ్వారని ఈ రెండు దేశాలు పరస్పరం ఆరోపించుకుంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా మీరంటే మీరే ఉల్లంఘించాయని కూడా జులై 28 తర్వాత ఘర్షణ పడ్డాయి. ఈ పరిస్థితుల్లో 'ఏసియన్' దేశాల బృందాలు పర్యవేక్షకులుగా ఉండేందుకు థాయ్ – కాంబోడియాలు అంగీకరించాయి. ఈ రెండూ 'ఏసియన్' లో సభ్యదేశాలే. జులై 25 వ తేదీన ఈ రెండు దేశాలమధ్య సరిహద్దు ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఘర్షణల్లో రెండు దేశాల కు చెందిన 38 మంది సైనికులు, సరిహద్దుగ్రామాల ప్రజలు మరణించారు. ఈ కారణంగా రెండు వైపులా దాదాపు 3,00,000 మంది ప్రజ లు సరిహద్దు గ్రామాలు ఖాళీచేసి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. మలేసియా మధ్యవర్తిత్వం తో ఆ దేశ రాజధానిలో జులై 29 అర్ధరాత్రి నుండి కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. డోనాల్డ్ ట్రంప్ చొరవతో రెండు దేశాలమధ్యా మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం ఈ ఒప్పందం చేసినప్పటికీ మళ్ళీ కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు జరిగాయి. తర్వాత షాంఘై వేదికగా చైనా కూడా రెండు దేశాలమధ్య రాజీ కుదిర్చింది.

# 90 దేశాల్లో ట్రంప్ టారిఫ్‌లు అమలు

### అమెరికాకు లక్షలడాలర్లు వరద ప్రవాహం




**వాషింగ్టన్:** డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రకారం దాదాపు 90 దేశాలలో ఆగస్టు ఏడో తేదీ నుండీ (గురువారం) కొత్త టారిఫ్‌లు అమలులోకి వచ్చాయి. ఈ కొత్త టారిఫ్‌లతో అమెరికా ఆర్థికవ్యవస్థ వేగం పుంజుకునే అవకాశాలు ఉంటాయని ట్రంప్ అంచనావేస్తున్నారు. దిగుమతులపై కొత్త సుంకాలవల్ల లక్షల డాలర్లు వరద ప్రవాహంలా దేశంలోకి వస్తున్నాయని ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అమెరికా ఆర్థిక గణాంకాల ప్రకారం ఈ జూన్‌నెలలో దిగుమతులపై విధించిన కొత్త సుంకాలద్వారా 28 బిలియన్ డాలర్లు ఆదాయం లభించింది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే మూడురెట్లు ఆదాయం పెరిగింది. యాలే యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం గతనెల 28 నాటి లెక్కల ప్రకారం 1934 తర్వాత వివిధ దేశాలపై అమెరికా సగటున విధించిన సుంకాలు 18.2 శాతానికి పెరిగాయి.

ఇప్పటికే త్రైమాసిక ఫలితాల్లో ఆర్థికంగా పురోగతి సాధించామని ట్రంప్ ప్రభుత్వం చెప్పుకుంటున్నది. టారిఫ్‌లలో అసమానతలు తగ్గించడం ద్వారా అమెరికా ఆదాయం పెరుగుదలకు తమ ప్రభుత్వం దోహదం చేసిందని రిపబ్లికన్లతో ఇటీవల జరిగిన విందు కార్యక్రమంలో ట్రంప్ చెప్పారు. దేశంలోకి వరద ప్రవాహంలా వస్తున్న లక్షల డాలర్లను ఉద్యోగాలసృష్టికి, దేశం వెలుపల ఉన్న పరిశ్రమలకు తిరిగి అమెకాకు తీసుకువచ్చేందుకు ఉపయోగిస్తానని, 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ప్రణాళికలో భాగంగా దేశానికి పూర్వవైభవం తీసుకువస్తామని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అమెరికాలో మరిన్ని టెక్ కంపెనీలు చిప్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా అనేక బెదిరింపులు చేశారు. విదేశాలలో తయారై అమెరికాలోకి వచ్చే చిప్‌లపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించారు. భారత్‌పై కూడా 50 శాతం సుంకాలు విధించి బెదిరించారు. ఐతే ఒక్కొక్కదేశంపై ఒక్కొక్కరమైన సుంకాలను ట్రంప్ అమలు చేశారు. అనేక దేశాలు అమెరికాను దోచుకుంటున్నాయని, ఆ దేశాలతో అమెరికాకు మాత్రం విపరీతంగా వాణిజ్యలోటు ఉంటోందనీ, సమానస్థాయి సుంకాలు ఎక్కడా అమలులో లేవని, అందువల్ల సుంకాలను పెంచుతామని ఈ ఏడాది ఏప్రిల్ రెండో తేదీన ట్రంప్ ప్రకటన చేశారు. ఆ రోజును ఆయన లిబరేషన్ డే గా ప్రకటించారు. ఇక అప్పటినుండీ అనేక దేశాలతో వివిధస్థాయిల్లో ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాలలో బ్రెజిల్, భారత్ రెండు దేశాలపైన చాలా అత్యధికమైన సుంకాలను విధించారు.

అమెరికాకు మద్దతు ఇచ్చే కీలక దేశాలపై తక్కువ టారిఫ్‌లు విధించారు. యూరోపియన్ యూనియన్‌పై 15 శాతం టారిఫ్ వేశారు. పాకిస్థాన్‌పై 19 శాతం వేశారు. బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియాలపై గతంలో బెదిరించినట్లు కాకుండా చాలా తక్కువ టారిఫ్‌లు వేశారు. స్విట్జర్లాండ్‌పై 39 శాతం, కెనడాపై 35 శాతం అత్యధిక సుంకాలు విధించారు.

## క్లౌడ్ బరస్ట్ (మొదటి పేజీ తరువాయి)

చేరడంతో ట్రాఫిక్ స్తంభించింది. కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. హైదరాబాద్‌కి వాతావరణ కేంద్రం అధికారులు ఆరెంజ్ ఆలర్ట్ జారీ చేశారు. భారీ వర్షం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిపి, విపత్తుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిహెచ్ఎంసి కమిషనర్, హైడ్రా కమిషనర్, విద్యుత్ విభాగం అధికారులు, హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, ఈ వర్షం అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**తడిసిముద్దమైన భాగ్యనగరం..**

ఈ భారీ వర్షానికి భాగ్యనగరం తడిసిముద్దైంది. పలు బస్తీలు, కాలనీలు, రహదారులు చెరువులను తలపించాయి. రోడ్లపైకి భారీగా వరద నీరు చేరడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచి పోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో మోకాళ్ల లోతు నీళ్లు నిలిచిపోయాయి. వర్షాల కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట నుంచి గచ్చిబౌలి వరకు జూబ్లీహిల్స్ మీదుగా, ఖైరతాబాద్ నుంచి బేగంపేట్ వరకు, మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి వరకు, గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు, మలక్‌పేట్ నుంచి హయత్‌నగర్ వరకు, బషీర్‌బాగ్ నుంచి కోఠి మీదుగా మలక్‌పేట్ వరకు, ట్యాంక్ బండ్ నుంచి ఎస్‌పి రోడ్, ఆర్‌పి రోడ్ వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగం పల్లి, హైటెక్ సిటీ, మాదాపూర్, కుత్బుల్లాపూర్, నిజాంపేట్, మల్కాజ్‌గిరి, ఖైరతాబాద్, హిమా యత్ నగర్, సికింద్రాబాద్, నాంపల్లి, చార్మినార్, ఎల్.బి.నగర్, రాజేంద్రనగర్, ఐకియా, బయో డైవర్సిటీ, కొండాపూర్ జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఖైరతాబాద్ రాజ్‌భవన్ రహదారి నీట మునిగింది. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తిప్పలు పడ్డారు. సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, కాంచన్ బాగ్, షాలిబండ, ఛత్రినాక, సికింద్రాబాద్, కంటోన్మెంట్ వంటి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వాహనదారులు రోడ్ల పక్కన నిలిచిపోయారు. పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, ఐకియా వంటి రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా తలెత్తిన పరిస్థితులను ఎదుర్కొనేం దుకు జిహెచ్ ఎంసి, హైడ్రా, ఎస్‌డి ఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, సహాయక చర్యలు చేపట్టాయి. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

## స్వయంప్రతిపత్తిపై దాడి (మొదటి పేజీ తరువాయి)

ఆక్షేపించింది. యునైటెడ్ స్టేట్స్ నేతృత్వంలోని ప్రపంచ ఆదేశాన్ని అమలు చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఒక క్రూరమైన ప్రయత్నం అని సిపిఐ మండిపడింది. ఇటువంటి చర్యలు స్వతంత్ర దేశాలను లొంగదీసుకోవడానికి, సార్వభౌమ విదేశీ, ఆర్థిక విధానాలను అనుసరించే హక్కును దెబ్బతీయడానికి ఉద్దేశించబడినవని అభిప్రాయపడింది. ప్రపంచ విధాన రూపకల్పన ఏ ఒక్క దేశ నాయకత్వం ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ వంటి అస్థిర, శత్రు నాయకత్వం ఇష్టాలకు లొంగి ఉండటానికి అనుమతించకూడదని పేర్కొంది. బహుళ ధృవణతకు సంబంధించి తిరుగులేని పెరుగుదల, అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల అధికమవుతోన్న విశ్వాసం గురించి యునైటెడ్ స్టేట్స్ విధాన వర్గాలలో నెలకొన్న లోతైన అసంతృప్తిని ఇటీవల పరిణామాలు ప్రతిబింబిస్తున్నాయని సిపిఐ ఆందోళనవ్యక్తం చేసింది. ఈ వాస్తవాన్ని అంగీకరించని యునైటెడ్ స్టేట్స్ తన ప్రపంచ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి బెదిరింపులు, వాణిజ్య దురాక్రమణలను కొనసాగిస్తోందని ఆరోపించింది. ఈ విపత్కర పరిస్థితులలో భారతదేశం తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని దృఢంగా నొక్కిచెప్పాలని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో సహకారాన్ని పెంచుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం సూచించింది. ప్రజాస్వామ్య, బహుళ ధృ వ ప్రపంచ క్రమాన్ని నిర్మించడంలో భారత్ చురుకైన పాత్ర పోషించాలని కోరింది.

## నోటిఫికేషన్ విడుదల
(మొదటి పేజీ తరువాయి)

సహకరించడం లేదన్న కారణంగా ధన్కడ్ జులై 21వ తేదీన పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆయన పదవీకాలం 2027 ఆగస్టు వరకు ఉంది. కానీ, ఆయన రాజీనామా చేయడంతో, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఈ పదవికి వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ నిబంధనలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం ఎన్నిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ ఎన్నికల నిర్వహణ బాధ్యతను రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు రిటర్నింగ్ అధికారిగా అప్పగించారు. ఆయనకు సహాయంగా మరో ఇద్దరు అధికారులు నియమితులయ్యారు. ఈ ఎన్నికలో ఓటు వేసే అధికారం పార్లమెంటులోని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మాత్రమే ఉంటుంది. అయితే రాష్ట్రపతి ఎన్నికలా కాకుండా ఉపరాష్ట్రపతి ఎన్నికలో రాజ్యసభకు నామినేట్ అయిన సభ్యులు కూడా ఓటు వేయడానికి అర్హులు. ప్రస్తుతం రాజ్యసభలో మొత్తం 233 మంది ఎన్నికైన సభ్యులు, 12 మంది నామినేటెడ్ సభ్యులు ఉన్నారు. లోక్‌సభలో 543 మంది సభ్యులు ఉన్నారు. దీని ప్రకారం మొత్తం ఓటర్ల సంఖ్య 788. అయితే రాజ్యసభలో ఐదు స్థానాలు, లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉండటంతో ఈ ఎన్నికలో 782 మంది సభ్యులు ఓటు వేయనున్నారు. ఎన్నికల్లో గెలవాలంటే అభ్యర్థికి 392 ఓట్లు అవసరం.

## విధానం ధ్వంసం
(మొదటి పేజీ తరువాయి)

అణుపరీక్షల ఆంక్షల వరకు మేం అమెరికాతో మా సంబంధాన్ని ఆత్మగౌరవంతో నడిపించాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు మన సొంత దౌత్యం వినాశకరంగా దిగజారిపోతున్న తరుణంలో వచ్చింది అని ఆయన ఆరోపించారు. 'నరేంద్రమోదీజీ ట్రంప్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించారని చెప్పినప్పుడు మీరు మౌనంగా ఉన్నారు. ఆయన కనీసం 30సార్లు చెప్పారు. లెక్కిస్తున్నారు. 2024 నవంబర్ **30**న బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలను విధించనున్నట్లు బెదిరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్కడే కూర్చుని నవ్వుతున్నారు.

అదే సమయంలో 'బ్రిక్స్' చచ్చిపోయిందని ట్రంప్ ప్రకటించారు' అని ఖర్గే ఆరోపించారు. ట్రంప్ నెలల తరబడి 'పరస్పర సుంకాలను' ప్లాన్ చేస్తున్నారని రాజ్యసభలో ప్రతిపక్షనేత అయిన మల్లికార్జున్ ఖర్గే చెప్పారు. 'మనందరికీ దాని గురించి తెలుసు. వ్యవసాయం, ఎంఎస్‌ఎంఇ'లు, పలు పరిశ్రమలు, మన కీలకరంగాలను దెబ్బతీయడంపై మీరు కేంద్ర బడ్జెట్‌లో ఏమీ చేయలేదు. మీ మంత్రులు నెలలతరబడి అమెరికాలో వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరపాలని మాట్లాడుతూ ఉన్నారు. వారిలో కొందరు వాషింగ్టన్‌లో కొద్దిరోజులుగా మకాం వేశారు' అని ఆయన చెప్పారు. మీరు అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపేందుకు విఫలమయ్యారని ఖర్గే ధ్వజమెత్తారు. 'మీకు ఆరు నెలలకు పైగా సమయం ఉంది. ఇప్పుడు మిస్టర్ ట్రంప్ మమ్మల్ని బలవంతం చేస్తున్నారు. భయపెడుతున్నారని అంటున్నారు కానీ మౌనంగానే ఉంటున్నారు' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు. 'అమెరికాకు భారతదేశం ఎగుమతులు దాదాపు రూ. లక్ష కోట్లు (2024 సంవత్సరం)' అని పేర్కొంటూ 50 శాతం సుంకం అంటే రూ.3.75లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తెలిపారు.

**ఇది దౌత్య వైఫల్యం : టిఎంసి జాతీయ ప్రధానకార్యదర్శి అభిషేక్‌బెనర్జీ ధ్వజం**

భారతదేశ వస్తువులపై అమెరికా50శాతం సుంకం విధించడంపై తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) జాతీయ ప్రధానకార్యదర్శి అభిషేక్ బెనర్జీ గురువారం కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బిజెపి నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్థికవ్యవస్థను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నదని ఆయన మండిపడ్డారు. టిఎంసి జాతీయ ప్రధానకార్యదర్శి అభిషేక్ బెనర్జీ బిజెపిపై విమర్శలు గుప్పిస్తూ రాజకీయ నిందలు వేసే బదులు భారత్‌పై ఇంత ఎక్కువ సుంకాలను ఎందుకు విధించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

బెనర్జీ మాట్లాడుతూ 56అంగుళాల ఛాతీ అని గొప్పలు చెప్పుకున్న బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఇప్పుడు ఇతర దేశాలు ఎర్రటి కళ్లు చూపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. 'నేను ఒక ప్రతినిధి బృందంలో భాగంగా 5 దేశాలకు వెళ్లాను. కానీ 11దేశాలు కూడా పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన పాపాన పోలేదు' అని విమర్శించారు. 'భారత ఆర్థికవ్యవస్థ చనిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే నేను ట్రంప్ ప్రకటనతో ఏకీభవించను. కానీ, భారత ఆర్థికవ్యవస్థ చెడ్డ స్థితిలో ఉందని మాత్రమే నేను చెబుతాను' అని అభిషేక్ బెనర్జీ అన్నారు.

## గెలుపు చోరీ! (మొదటి పేజీ తరువాయి)

మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రం 1.14 లక్షల ఓట్ల తేడాతో వెనుకబడిందని చెప్పారు. ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఐదు రకాలుగా ఓట్ల చోరీ జరిగిందన్నారు. అవి డూప్లికేట్ (నకిలీ) ఓటర్లు, తప్పుడు చిరునామా ఓటర్లు, ఒకే చిరునామాపై పెద్ద సంఖ్యలో ఓటర్లు, సరైన ఫోటో లేని ఓటర్లు, ఫామ్ 6 దుర్వినియోగంతో కొత్త ఓటర్లు అని వివరించారు. వాటిలో 11,965 నకిలీ ఓటర్లు , తప్పుడు, చెల్లని చిరునామాలతో(ఇంటి నెంబర్:0 అని ఉంది, తండ్రి పేరు కూడా లేదు) 40,009 మంది ఓటర్లు, ఒకే చిరునామాపై 10,452 మంది ఓటర్లు, కనీకనిపించని ఫోటోలతో 4,132 మంది ఓటర్లు, కొత్త ఓటర్లకు సంబంధించిన ఫారం–6ను దుర్వినియోగం చేసి నమోదైన 33,692 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.ఇవన్నీ కలిపి ఆ నియోజకవర్గంలో 1,00,250 ఓట్ల చోరీ జరిగిందని ఆయన ఆరోపించారు. ఆ ఒక్క నియోజకవర్గంలో కాంగ్రెస్ 1.14 లక్షల ఓట్లుతో వెనుబడిందని, 1.02 ఓట్లు సృష్టించి బిజెపి ఆధిక్యత సాధించిందని, దాంతో ఎన్నికల చోరీ జరిగిందన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల్లో జనాభా కంటే ఎక్కువ మంది ఓటర్లు పెరిగారని తాము ముందే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసామని, అయినా పట్టించుకోలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన తమ కూటమి ఆరు నెలల్లోనే ఓడిపోవడం ఆశ్చర్యం కలిగించిందని, అందుకే ఆరు నెలల పాటు మహాదేవపు ఓట్ల పరిశోధన జరిపామన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, ఎన్నికల సంఘం ఇచ్చిన డేటా ఆధారంగానే చెబుతున్నట్లు తెలిపారు. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఓట్లు చోరీ జరిగిందన్నారు. ఇదే విధంగా మిగతా లోక్‌సభ స్థానాల్లో చేస్తే వాస్తవాలు తెలుస్తాయని, ఇది పక్కా క్రిమినల్ ఎవిడెన్స్ అని చెప్పారు.

25 సీట్లు దొంగలించారు

దేశవ్యాప్తంగా ఇదే జరుగుతోందని, ఇది భారత రాజ్యాంగం, భారత జెండాకు వ్యతిరేకంగా చేసిన నేరం అని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఎన్నికలను రక్షించే బాధ్యత ఎన్నికల సంఘానిదని కాంగ్రెస్ గుర్తు చేస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వల్ప మెజారిటీ ఉందని, అధికారంలో ఉండటానికి కేవలం 25 సీట్లు మాత్రమే దొంగిలించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో 33,000 కంటే తక్కువ ఓట్లతో బిజెపి 25 సీట్లు గెలిచిందని గాంధీ తెలిపారు.మన రాజ్యాంగం పునాది 'ఒక వ్యక్తికి ఒక ఓటు' అనే విషయం మీద ఆధారపడి ఉందని ఆయన అన్నారు. మనం ఎన్నికలను పరిశీలించినప్పుడు, 'ఒక వ్యక్తికి ఒక ఓటు' అనే ఆలోచనను ఎలా సురక్షితం చేయాలి అనేది ప్రాథమిక విషయమని, సరైన వ్యక్తులను ఓటు వేయడానికి అనుమతిస్తున్నారా? నకిలీ వ్యక్తులను చేరుస్తున్నారా? ఓటరు జాబితా నిజమేనా కాదా? అని ఆయన ప్రశ్నించారు.

**ఆధారాలను నాశనం చేయాలని చూస్తున్న ఇసి**

గత 10–15 సంవత్సరాలకు సంబంధించిన యంత్రాలు చదవగలిగిన సమాచారం, సిసిటివి ఫుటేజీలను ఎన్నికల సంఘం తమకు ఇవ్వకపోతే, ఇసి ఈ నేరంలో భాగస్వామి అవుతుందని రాహుల్ హెచ్చరించారు. సిసి ఫుటేజిని 45 రోజుల్లో నాశనం చేస్తున్నారని తెలిపారు. మనకు ఎంతగానో ఇష్టమైన ప్రజాస్వామ్యం ఇప్పుడు లేనందున న్యాయవ్యవస్థ ఇందులో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతకాలంగా ప్రజల్లో అనుమానం ఉంది. ప్రభుత్వ వ్యతిరేకత ప్రతి పార్టీని ప్రభావితం చేస్తుంది, కానీ ప్రజాస్వామ్య విధానంలో ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోని ఏకైక పార్టీ బిజెపి అని ఆయన ఎద్దేవా చేశారు. పోల్స్, అంతర్గత సర్వేలు ఒక మాదిరిగా, ఫలితాలు మరో మాదిరిగా ఉన్నాయని ఆయన అన్నారు. గతంలో తక్కువ సాంకేతిక పరిజ్ఞానంతో దేశంలో ఎన్నికలు ఒకేసారి నిర్వహించేవారని, కానీ ఈ రోజుల్లో ఎన్నికలు నెలల తరబడి సాగేలా చేయబడుతున్నాయని గాంధీ ఆరోపించారు. దేశం మొత్తం 'ఓట్ల చోరీకి' సంబంధించిన సాక్ష్యాలను ఎన్నికల సంఘం నాశనం చేయాలని చూస్తోందని ఆయన ఆరోపించారు.

## అప్రమత్తంగా ఉండాలి (మొదటి పేజీ తరువాయి)

రంగనాథ్‌తోపాటు విద్యుత్ ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి గురువారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు క్షేత్రస్థాయి పరిస్థితినిసిఎంకు వివరించారు. విపత్తు నిర్వహణ బృందాలను సంసిద్ధంగా ఉంచాలని సూచించారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని జిల్లా కలెక్టర్లను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిహెచ్ఎంసితో పాటు పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, విద్యుత్ అంతరాయం రాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని, వర్షాలు, వరదలతో ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు, ఎలాంటి సహాయమైనా అందించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని సిఎం స్పష్టం చేశారు.

## పణంగా పెట్టబోం (మొదటి పేజీ తరువాయి)

చమురు కొనుగోలు చేస్తున్నందుకు, వ్యవసాయ ఉత్పత్తులపై రాయితీలు ఇవ్వనందుకు భారత్‌పై అమెరికా సుంకాలు విపరీతంగా పెంచడం తెలిసిందే. ఇప్పటికే 25 శాతం టారిఫ్ సహా పెనాల్టీలు విధించిన అగ్రరాజ్యం, బుధవారం మరోసారి 25 శాతం సుంకాలను పెంచడంతో మొత్తం సుంకాల భారం 50 శాతానికి చేరింది. ఇప్పటి వరకూ అమెరికా విధిస్తున్న సుంకాలపై మౌనంగా ఉన్న ప్రధాని, నేరుగా కాకపోయినా, తొలిసారి స్పందించారు. దేశ ప్రయోజనాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. ఇలావుంటే, భారత్–అమెరికా మధ్య ఐదు రౌండ్ల వాణిజ్య చర్చలు విఫలమైన తర్వాత టారిఫ్ పెంపుదలపై ట్రంప్ ప్రకటనలు చేశారు.

అమెరికా తన వ్యవసాయ ఉత్పత్తులు, జన్యుపరంగా మార్పు చేసిన పంటలు వంటి వివిధ వస్తువులపై సుంకాల రాయితీలు ఇవ్వాలని భారత్‌ను డిమాండ్ చేసింది. అయితే ఈ రంగాలపై భారతదేశం ఆచితూచి వ్యవహరిస్తున్నది. భారత్‌లో వ్యవసాయం అనేది కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో నడిచే వ్యాపారంలా కాకుండా కోట్లాది మంది చిన్న రైతుల జీవనోపాధికి సంబంధించిన విషయం. మన దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉండడంతో, చిన్న రైతులను కాపాడటానికి, ఆహార భద్రతను నిర్ధారించడానికి సుంకాలు తప్పనిసరి అని భారత్ వాదించింది. అందుకు ప్రతీకారంగా అమెరికా కూడా టారిఫ్‌లను పెంచుకుంటూ పోతున్నది. ఈ వాణిజ్య యుద్ధానికి ఎప్పుడు తెరపడుతుందో చెప్పలేని పరిస్థితి.

**ఎగుమతులపై భారం :** అమెరికా విధించిన అదనపు టారిఫ్ కారణంగా భారత్ చేసే 86 బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రభావం పడనుంది. ట్రంప్ తాజా నిర్ణయం వల్ల భారత్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి సంక్షోభంలో పడనుంది. దుస్తులు, వజ్రాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు (రొయ్యలు), తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు సంబంధ ఉత్పత్తులు, రసాయనాలు, విద్యుత్ పరికరాలు, యంత్ర సామాగ్రి ఎగుమతులపై అదనపు టారిఫ్ భారం ఉండొచ్చని తెలుస్తోంది. అయితే, ఔషధాలు, ఇంధన ఉత్పత్తులైన క్రూడాయిల్, రిఫైన్డ్ ఇంధనం, సహజ వాయువు, బొగ్గు, విద్యుత్‌తో పాటు కీలక ఖనిజాలు, సెమీ కండక్టర్లు, కంప్యూటర్లు, ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు, డ్రైవ్‌లు, ప్యానల్ బోర్డులు, సర్క్యూట్లు తదితర వాటిపై ప్రస్తుతానికి ఉపశమనం ఉంటుందని తెలుస్తుంది.

## చర్చించి నిర్ణయం (మొదటి పేజీ తరువాయి)

అమలు చేయరాదని బిఆర్‌ఎస్ ఇలా ఆ రెండూ పార్టీలూ 'బిసి ద్రోహులుగా, వ్యతిరేకులుగా' తెలంగాణ సమాజం భావిస్తుందని, ఆ పార్టీలు తాత్కాలికంగా విజయం సాధించామని అనుకుంటున్నాయని, కానీ సమస్యను దీర్ఘకాలికంగా వాయిదా వేస్తే, ఆ సమస్యనే వారిని బలి తీసుకుంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బిసి బిల్లులను, ఆర్డినెన్స్‌ను ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లకు కేంద్రం నుంచి ఎటువంటి సహకారం అందలేదని, బిసిలకు బిఆర్‌ఎస్ నైతిక మద్దతు కూడా ఇవ్వలేదని,ఆ రెండు పార్టీల దుర్మార్గ మైన చర్యలను తెలంగాణ సమాజం గమనిస్తుందని, క్షేత్రస్థాయిలో వారికి గుణపాఠం చెప్పేవిధంగా, తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించే విధంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు.

**ముస్లిం రిజర్వేషన్లు ప్రతిపాదించినట్టు కిషన్ రెడ్డి చూపిస్తారా.. దేశంలో మైనార్టీలను ఉండనివ్వరా?. ?**

బిసి రిజర్వేషన్ల అంశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తొండి, వితండవాదనతో చేస్తున్నారని, తాము ప్రతిపాదించిన ఏ బిల్లులో ముస్లింలకు రిజర్వేషన్లను ప్రతిపాదించామో ఆయన చూపించాలని సిఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ఒక గల్లీ లీడర్లు మాట్లాడినట్టుగా చెట్టుకింద ప్లీడర్ తరహా ఊకదంపుడు ఉపన్యాసం చేయవద్దని సూచించారు. దేశంలో మైనార్టీలను ఉండనివ్వరా? , ముస్లింలకు తావు లేదా? అని సిఎం మండిపడ్డారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో బిజెపి విధానం ఏమిటో చెప్పి, స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని, ఈ విషయమై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు రాహుల్ గాంధీ ఎందుకు రాలేదని బిజెపి, బిఆర్‌ఎస్ అజ్ఞానులుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ ధర్నాకు 'మీరు' ఎందుకు రాలేదని, బిజెపికి ఏమైనా పెద్ద రోగం వచ్చిందా?, ఆ పార్టీని బిఆర్‌ఎస్ ఎందుకు అడగడం లేదని నిలదీశారు.

**'రాష్ట్రపతి అపాయింట్‌మెంట్' ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే**

బిసి రిజర్వేషన్ల బిల్లులు, ఆర్డినెన్స్ విషయంలో తెలంగాణ సిఎం, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడ ం దురదృష్టకరమని, ఇది తెలంగాణ ప్రజలకు అవమానకరమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ఢిల్లీలోనే ఉన్నదని, అయినప్పటికీ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దక్కకపోవడం బాధకరమని, ప్రధాని మోదీ, అమిత్‌షా రాష్ట్రపతిని కలిసిన తర్వాతనే తమకు అపాయింట్‌మెంట్ రాలేదని తమ మంత్రులు భావిస్తుందన్నారు. బలహీనవర్గాల హక్కులను కాలరాసేందుకు బిజెపి మొదటి నుంచి కుట్రలకు పాల్పడుతోందని, మండల్ కమిషన్ ద్వారా ఒబిసిలకు న్యాయం చేయాలని ప్రయత్నిస్తే, కమాండల్ కమిషన్‌ను తీసుకొచ్చారని, రథయాత్ర పేరుతో ఉద్రిక్తత పరిస్థితులను సృష్టించారని సిఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. కేంద్ర యూనివర్సిటీలలో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలనే నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ నిర్ణయం తీసుకుంటే, యూత్ ఫర్ ఇక్వాలిటీ పేరుతో బిజెపి అడ్డుకున్నదన్నారు.

**బిజెపి పాలిత రాష్ట్రాలలోనే ముస్లింలకు రిజర్వేషన్ల అమలు**

బిజెపి పాలిత రాష్ట్రాలలో ఒబిసి రిజర్వేషన్లలోనే ముస్లింలకు రిజర్వేషన్లను అనుమతినిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2017లో రాజస్థాన్‌లో అబ్దుల్ సత్తార్ ఒబిసి రిజర్వేషన్‌లోనే ఐఎఎస్ సాధించారన్నారు. 1971 నుంచి నూర్‌బాష, దూదేకులు ఇతర వివిధ వృత్తులు నిర్వహించే ముస్లిములకు చట్టంలో రిజర్వేషన్లను కల్పించారని, ఈ రిజర్వేషన్లు ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయమైన మహారాష్ట్ర, నరేంద్ర మోదీ జన్మించిన గుజరాత్‌లో కూడా ఉన్నాయని, ఉత్తర ప్రదేశ్‌లో అమలులో ఉన్నాయన్నారు. ఎన్ బ్లాక్ రిజర్వేషన్లు ఇవ్వాలని చట్టంలో ఉన్నదని, దీనిని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చదివారా? లేదా రాజకీయ ప్రేరేపిత లోచనతో చదవకుండానే కండ్లు మూసుకుని మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు.

**బిజెపికి అంటకాగుతున్న బిఆర్‌ఎస్**

బిజెపితోనే అంటకాగుతూ, కాంగ్రెస్ పార్టీ చేపట్టే ఏ మంచికీ సహకరించబోమని, విధ్వంసపూరితంగా వ్యవహరిస్తున్న బిజెపికి అండగా నిలబడేందుకు బిఆర్‌ఎస్ తయారైందని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బిజెపి తప్పిదాలను బిఆర్‌ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. బిఆర్‌ఎస్ రాజ్యాసభ సభ్యులు బిసి రిజర్వేషన్ల సాధనకు జరిగిన ధర్నాలో ఎందుకు పాల్గొనలేదని, పైగా తమ ధర్నాను అవహేళన చేస్తున్నారని, తాటిచెట్టు తరహా పెరిగితే సరిపోదని, అవగింజనైనా అవగాహన ఉండాలని సిఎం ఎద్దేవా చేశారు. తమను బలహీనం చేసేందుకు, తమ చేతులను కట్టేసేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందన్నారు.

**మోదీని ప్రధాని కుర్చీ నుంచి దింపేస్తాం..**

ఆర్‌ఎస్‌ఎస్ నేత మోహన్ భగవత్ కూడా మోదీని తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని, కానీ ఆయన (మోదీ) తప్పుకునే పరిస్థితి లేదని, రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే మోదీని కుర్చీ నుంచి దింపేస్తామని, ఎర్రకోటపైన మూడు రంగుల జెండాను ఎ గురవేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పదే పదే బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే దేశానికి నష్టం జరుగుతుందని , అందుకే బిహార్ ఎన్నికల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. మోదీని కుర్చీలో ఉన్నంత వరకు రకరాల విద్వేషాలు, గొడువలు జరుగుతుంటాయని,అందుకే ఆయనను గద్దె దింపడమే అన్ని సమస్యలకు పరిష్కారం అని అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైల్వేల అభివృద్ధిపై సిఎస్‌కు వివరణ : రైల్వే జిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రైల్వేల అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం రాష్ట్ర సచివాలయం లో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో సమావేశమై వివరించారు. భారత్ అమృత్ పథకం లో భాగంగా రూ.వేల కోట్లతో జరుగుతున్న ఆయా స్టేషన్‌ల అభివృద్ధి పనులను సిఎస్‌కు వివరించారు. ఇందులో కొన్ని స్టేషన్‌లలో పునరాభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, ఈ ఏడాది చివరి నాటికి అన్ని స్టేషన్‌లలో పునరాభివృద్ధి పనులు పూర్తవుతాయని తెలిపారు. అన్ని స్టేషన్‌లలో ప్రయాణీకుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలను కల్పిస్తున్నామని రైల్వే జిఎం సంజయ్‌కుమార్, సిఎస్ రామకృష్ణారావుతో అన్నారు. అలాగే రైల్వే భద్రత, ప్రయాణికుల భద్రత అంశాలపై కూడా వీరిద్దరు చర్చించారు. రైలు భోగీలలో ప్రయాణికుల భద్రత కోసం సిసి కెమెరాల ఏర్పాట్లను వివరించారు.

# సమరశీల ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కారం


### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న విద్యారంగాన్ని కాపాడాల్సిన పాలకులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.స్టాలిన్ అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఉద్యమాలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీ నుంచి 30 వరకు జరగనున్న ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. హిమాయత్ నగర్‌లోని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ. స్టాలిన్ మాట్లాడుతూ అందరికీ విద్య పేరు తో కొందరికే (కొనగలిగే వారికే) విద్యను పరిమితం చేసిన ఘనత మన పాలకులదని ఎద్దేవా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం–2020 పేరుతో విద్య కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయీకరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఉండడం విద్యారంగం పట్ల పాలకులకున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గురుకులాల్లో, ఆశ్రమ విద్యాసంస్థల్లో కలుషిత ఆహారంతో విద్యార్థులు అల్లాడుతున్నారని దీనికి కారణాలేమిటో ప్రభుత్వం బహిర్గతం చేయడంతో పాటు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న అధికారులను ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యారంగ సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్ అలుపెరగని పోరాటాలు చేయాలని సూచించారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్య్రం కావాలని, దేశ స్వాతంత్య్రమే లక్ష్యంగా దేశ స్వాతంత్య్రం మా జన్మహక్కు అని 1936, ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భవించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఈనెల 12తేదీ నాటికి 90వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ నెల 10 నుంచి 30 వరకు నిర్వహించనున్న 90వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ల లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.8500 స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యార నరేష్, బానోత్ రఘురాం, గ్యార క్రాంతి, సి.రాజు, కసోజ్ నాగజ్యోతి, జరిగెల వెంకటేష్, రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, మచ్చ రమేష్, మురళీ కృష్ణ, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, భాషబోయిన సంతోష్, అజిత్, చైతన్య యాదవ్, కుమ్మరి సాగర్, ప్రీతమ్, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

## సిఎంతో మాట్లాడి గుడిసెవాసులకు
# ఇళ్ల పట్టాలకోసం కృషి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు భరోసా



**ప్రజాపక్షం/హనుమకొండ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పలివెల్పుల భగత్ సింగ్ నగర్ వాసులకు ఇండ్ల పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. గత 17 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు జాప్యం చేస్తున్నందున వారి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ....జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని హరిత హోటల్లో బసచేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కాలనీవాసులు కలవడం జరిగింది. న్యాయమైన కాలనీ వాసుల సమస్యను సావధానంగా విన్న సాంబశివరావు చలించి పోయారు. అన్ని విధాలుగా అర్హులై ఉండి, పట్టాలు ఇవ్వడానికి ఎలాంటి ఆటంకం లేనప్పుడు, పైగా స్థానిక ఎమ్మెల్యే లు అందరూ పట్టాల కోసం హామీలు ఇచ్చి ఉన్నప్పుడు ఇంకా ఎందుకు జాప్యం జరుగుతుందో తెలుసుకుంటానన్నారు. ఇప్పటివరకు అసలు పైస్థాయిలో ప్రభుత్వం గానీ, అధికారులు కానీ సమస్యను పెద్దగా పట్టించుకున్నట్టు లేదని, అసలు వారికి ఈ సమాచారం ఉందో లేదో కూడా తెలియట్లేదని అందువల్ల తాను ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి రాగానే వీలైతే కాలనీవాసుల ప్రతినిధి బృందంతో వెళ్లి కలుస్తానని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేదాకా వెంట పడతానని కూడా కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. వారి సమస్య పట్ల సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని మాట ఇచ్చిన రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకి, రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుకు భగత్ సింగ్ నగర్ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టెపాక రవి, మండల సహాయ కార్యదర్శి అలవాల రాజు, మహిళా సమాఖ్య నాయకురాలు జూకంటి పద్మ, నాయకులు వీరలక్ష్మి , కుమార్, మొగిలి, ప్రవర్ధన్, శ్రవణ్ కుమార్, తదితరులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఎస్‌సిల సంక్షేమం కోసం నిధులు విడుదల

### కేంద్రాన్ని కోరిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సిల సంక్షేమం కోసం నిధులు విడుదల చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యూ ఢిల్లీ లో గురువారం కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేని కలిసి రాష్ట్రానికి సంబంధించిన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్రానికి కేంద్ర సహాయం తక్షణం విడుదల చేయాలని అడ్లూరి విజ్ఞప్తి చేశారు. పిసిఆర్, పిఒఎ చట్టాల చట్టాల అమలుకు రూ.232.68 కోట్లు (మును పటి బకాయిలతో కలిపి), పిఎం ఎజెఎవై పథకం కింద 2025–26 సం.కి రూ.82.20కోట్ల నుకేంద్రం నుండి విడుదల చేయాల్సి ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే రాష్ట్రం తన వాటాను చెల్లించిందని, కేంద్ర వాటా ఇప్పటివరకు రిలీజ్ కాలేదని మంత్రి తెలిపారు. ఈ నిధుల విడుదల వల్ల ఎస్‌సి వర్గాల న్యాయం, సాధికారత, అభివృద్ధి మరింత బలోపేతం అవుతుందని అన్నారు. 1,023 రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో సుమారు 650 అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని, ఇది విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని చెప్పారు. కేంద్ర మంత్రి ని కలిసిన వారిలో తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఉన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో ఒప్పందం

### అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము కూడా ఒప్పందం చేసుకుంటామని, స్కిల్డ్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగస్వాములుగా అవుతామని అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యారంగం అభివృద్ధికి తమ వంతుగా సేవలు అందిస్తామన్నారు. ఢిల్లీలోని తెలంగాణ సిఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమిటీ యూనివర్సిటీ ఛాన్సలర్ అతుల్ చౌహాన్ గురువారం కలిశారు. తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా బోధనతో అమిటీకి మంచి పేరు ఉన్నదని, తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషిచేస్తామని చౌహాన్ అన్నారు.

# చేనేత రంగానికి ప్రత్యేక స్థానం ఉంది

### చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత రంగానికి రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉందని, వారసత్వంగా వచ్చిన రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యవసాయం, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వస్త్రానిచ్చే నేతన్నకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనలో 100 పైగా స్టాల్స్ ను మంత్రి ప్రారంభించి, నేతన్నలు తయారుచేసిన చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. ముఖ్యంగా జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్లోని వస్త్రాలను మంత్రి పరిశీలించి అభినందించారు. అదేవిధంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత అవార్డులకు ఎన్నికైన వారు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించిన మంత్రి వారిని అభినందించారు. తెలంగాణ చేనేత లోగోతో పాటు త్రిలింగ పట్టు చీరలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఏ సమస్య వచ్చిన ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా అందిన హస్తకళ. ఈ కళను పరిరక్షించడం బాధ్యత మనందరి మీద ఉందన్నారు. (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రం చేనేతరంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని, గద్వాల, నారాయణపేట, పోచంపల్లి ఇక్కత్, సిద్దిపేట గొల్లభామ, వరంగల్ దర్రిస్, కరీంనగర్ బెడ్‌షీట్లు వంటి ఉత్పత్తులు అంతర్జాతీయంగా పేరుగాంచాయని పేర్కొన్నారు చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. అంతరించిన పోతున్న చేనేత కళలన్నింటికి పునర్వైభవం తెచ్చేలా ఈ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా స్టాల్స్‌తోఏర్పాటు చేసినచేనేత వస్త్ర ఎగ్జిబిషన్ ఈనెల 17వరకు కొనసాగనుంది. అన్ని ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే చేనేత వస్త్రాలు ఈ వస్త్ర ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఈకార్యక్రమంలో జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎల్.దశరథ్



**కామారెడ్డి :** సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఎల్. దశరథ్ ఎన్నికయ్యా రు. కామారెడ్డిలో జరిగిన మహాసభలో జిల్లా సహాయకార్యదర్శులుగా పి.బాలరాజ్, దుబాస్ రాములు, వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా వి.ఎల్. నరసింహారెడ్డి, గంగాధర్, రాజిరెడ్డి, శివ ప్రసాద్, ప్రవీణ్ సహా 21 మంది కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు.మహాసభకు 450మంది ప్రతినిధులు హాజరయ్యారని, వివిధ పార్టీల నుండి సిపిఐలో 30 మంది చేరారని జిల్లా కార్యదర్శి దశరథ్ తెలిపారు.

## సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బృంగి బాలకిషన్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బృంగి బాలకిషన్ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పా టు 8 మంది కార్యవర్గ సభ్యు లు, 19 మంది కౌన్సిల్ సభ్యులును జడ్చర్లలో జరిగిన జిల్లా మహాసభలో ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.పరమేశ్ గౌడ్, కొండపల్లి రాము, సురేష్, బాగి కృష్ణయ్య, ఆర్.అల్వాల్ రెడ్డి, గోవర్ధన్ , పద్మ ఎన్నికయ్యారు.

## బ్రౌన్‌షుగర్ స్వాధీనం : ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**పశ్చిమ బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు బ్రౌన్‌షుగర్ (హెరాయిన్)ను స్మగ్లింగ్ చేస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. ఈ మేరకు రూ.2.50 లక్షల విలువైన బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. శంషాబాద్ టిడిఎఫ్ సిఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు పూర్తి వివరా లు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎండి నూర్ అక్బర్, ఎండి అజిత్ మోహిన్ అనే ఇద్దరు యువకులు తరచుగా హైదరాబాద్‌కు బ్రౌన్ షుగర్ స్మగ్లింగ్ చేస్తు అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. శంషాబాద్ టిడిఎఫ్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు శ్రీకాంత్, గణేష్, మల్లేష్, కానిస్టేబుళ్లు నెహ్రూ సాయి శంకర్ లు గురువారం కాజాగూడ నుంచి నానక్‌రామ్ రోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పై ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వీరివద్ద నుంచి రూ.2.50లక్షల విలువైన బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్రౌన్ షుగర్ ని పట్టుకున్న డిటిఎఫ్ టీం ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షా నవాజ్ ఖాసీం, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియలు అభినందించారు.



# క్రిమినల్ గ్యాంగ్ నేరాలపై దృష్టి పెట్టండి

### రాష్ట్ర క్రైమ్ మీటింగ్‌లో డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రిమినల్ గ్యాంగ్ లు పాల్పడే నేరాలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ పోలీసు అధికారులకు సూచించారు. తొలి అర్ధ వార్షిక నేర సమీక్షా ముగింపు సమావేశం గురువారం డిజిపి కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధికారులను ఉద్దేశించి డిజిపి మాట్లాడుతూ.. క్రిమినల్ గ్యాంగ్ ల నేరాలను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయని వాటి ద్వారా ఆయా నేరాలను అరికట్టాల్సిన భాధ్యత పోలీస్ అధికారులపై ఉందని డిజిపి అన్నారు. క్రిమినల్ గ్యాంగ్ ల వారీ గానే కాక అందులో సభ్యు లై నేరాలకు పాల్పడిన వారు గత 20 సంవత్సరాలు గా జైళ్ల లో శిక్షలు అనుభవిస్తున్నారని డిజిపి అన్నారు. పోలీసు కమిషనర్లు, ఎస్‌పిలు వారి, వారి యూనిట్ల పరిధి లోని క్రిమినల్ గ్యాంగ్ ల పై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరాను , వినియోగాన్ని అరికట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ ఐపిఎస్ స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని తదనుగుణంగా కమీషనర్లు, ఎస్పీలు కఠినంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా, యువత డ్రగ్స్ బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ పై అవగాహన చర్యలు చేపట్టడం తో పాటు, తగ్గిన చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ పట్టుకున్న తరువాత అవి ఎక్కడి నుండి రాష్ట్రానికి వచ్చాయనే వివరాలు సేకరించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి డ్రగ్స్ సరఫరా జరుగుతున్నదని తెలిపారు. సమావేశంలో ముందుగా టి నాబ్ డైరెక్టర్ సందీప్ శాండి ల్యా మాట్లాడుతూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్లను అరెస్ట్ చేశామన్నారు. డ్రగ్స్ కంట్రోల్ , డైరెక్టర్ షా వనాజ్ ఖాసీం నకిలీ మందుల ను అరికట్టేందుకు స్థానిక పోలీసులు సమచారం అందించాలని కోరారు.

సిఐడి, డిఐజి నారాయణ నాయక్ కొత్త చట్టాల గురించి వివరించారు. మారిన సెక్షన్ లను వివరించారు. లీగల్ అడ్వైసర్ అజయ్ కుమార్, దర్యాప్తు లోని లోపాలను వివరించారు. టిజిపిఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ అకాడమీ లో చేపడుతున్న శిక్షణా కార్యక్రమాలను తెలియజేశారు. డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్ సాంబశివ రెడ్డి ఆర్గనైజ్డ్ నేరాలపై మాట్లాడారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ అనిత రామచంద్రన్ పిల్లల, మహిళల ల కోసం చేపడుతున్న మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ల ప్రాధాన్యత లను తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ కృపా ల సింగ్ దర్యాప్తు లో కీలకమైన ఫోరెన్సిక్ అంశాల గురించి వివరించారు. మెడికో లీగల్, పోస్ట్ మార్టం రిపోర్టింగ్ పై ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్, క్రిమినల్ గ్యాంగ్ ల నేరాల చట్టాల గురించి రిటైర్డ్ పి పి డాక్టర్ రాములు , ఖైదీల ఎస్కార్ట్ ల పై జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా, సిసిటిఎన్‌ఎస్ కెమెరాల పై అడిషనల్ డిజిపి వి వి శ్రీనివాస రావు , శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ మాట్లాడుతూ పార్ధీ గ్యాంగ్ ల తరహాలో చెడ్డి, భవేరియా వంటి గ్యాంగ్ లపై దృష్టి పెట్టాలని, నకిలీ విత్తనాల విషయంలో అవసరమైతే పి డి యాక్ట్ పెట్టాలన్నారు.

శాంతిభద్రతల కోసం, అదుపు చేసేందుకు కెమెరాలను అవసరమైన ప్రాంతాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేయడం ద్వారా నేరాల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.హోం గార్డు ల గురించి అడిషనల్ డిజిపి స్వాతి లక్రా తెలియజేశారు.హైదరాబాద్ ట్రాఫిక్ పై జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ వివరించారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, మల్టీ జోన్ ఐజిపి లు చంద్రశేఖర్ రెడ్డి, తఫ్సీర్ ఇక్బాల్, ఐజిపి లు ఎం. రమేష్, రమేశ్ నాయుడు, శ్రీనివాసులులతో పాటు కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్‌పిలు సమావేశంలో పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19 (1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25 (1) అనుసరించి కలెక్టర్ /అధనపు కలెక్టర్ /రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ (భూసేకరణ)

ఫారం- 7 (రూఢీ ప్రకటన)

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నం. జి/201/2025 తేది: 04.08.2025
రెవెన్యూ డివిజినల్ అధికారి ఫైల్ నం. ఎఫ్/537/2025 హుజూర్‌నగర్ తేది: 31.07.2025
గెజిట్ నెంబర్: 41/2025 తేది: 40.08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట, సూర్యాపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, కోమటికుంట గ్రామ శివారు లోని సర్వే నెంబర్ 23, 24, 25, 41, 43, 46 లలో విస్తీర్ణం **ఎ.1.06 గుంటలు** పట్టా భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా పాలకీడు మండలము, కోమటికుంట గ్రామము నుండి జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణా సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 (చాప్టర్ 2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం సెక్షన్ - 10A ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, కోమటికుంట గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 23, 24, 25, 41, 43, 46 లో విస్తీర్ణం **ఎ.1.06 గుంటలు** గల భూమి నుండి జాన్‌పహాడ్ బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: కోమటికుంట మండలం: పాలకవీడు జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | [illegible] | భూమి రకము | భూసేకరణకు విస్తీర్ణం | పట్టాదారు పేరు / ఆసక్తిగల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 23 | [illegible] | [illegible] | 0.01 1/2 | - | రోడ్డు | VB | 25 | 24 | 26 | [illegible] |
| 2 | 23/ఆ1 | [illegible] | [illegible] | 0.01 | కసిరెడ్డి అంతమ్మ భర్త శ్రీనివాసారెడ్డి | కసిరెడ్డి అంతమ్మ భర్త శ్రీనివాసారెడ్డి | VB | 25 | 24 | 26 | [illegible] |
| 3 | 23/ఈ | [illegible] | [illegible] | 0.02 1/2 | ఒంటెద్దు సైదిరెడ్డి తండ్రి వెంకటరెడ్డి | ఒంటెద్దు సైదిరెడ్డి తండ్రి వెంకటరెడ్డి | VB | 25 | 25 | 26 | [illegible] |
| 4 | 24 | [illegible] | [illegible] | 0.02 | - | మొడే పుష్పా భర్త సైదులు | VB | 41 | - | 23 | [illegible] |
| 5 | 24/ఆ2 /2 | [illegible] | [illegible] | 0.01 | మొడే ఉషా భర్త గోవిందు | మొడే గోవిందులు తండ్రి బిక్షమ్ | VB | 41 | - | 23 | [illegible] |
| 6 | 24/ఆ /2 | [illegible] | [illegible] | 0.01 | మొడే రామలింగమ్మ భర్త బిక్షమయ్య | మొడే రామలింగమ్మ భర్త బిక్షమయ్య | VB | 41 | - | 23 | [illegible] |
| 7 | 24/ఆ3 /2 | [illegible] | [illegible] | 0.01 | మొడే బాల కృష్ణ తండ్రి బిక్షం | మొడే బాల కృష్ణ తండ్రి బిక్షం | VB | 41 | - | 23 | [illegible] |
| 8 | 24/2 /1 | [illegible] | [illegible] | 0.01 | మొడే ఝాన్సీ భర్త బాలకృష్ణ | మొడే ఝాన్సీ భర్త బాలకృష్ణ | VB | 41 | - | 23 | [illegible] |
| 9 | 25/ఆ2 /1 | [illegible] | [illegible] | 0.01 1/4 | చింతలచెర్వు రమాదేవి భర్త గంగయ్య | చింతలచెర్వు రమాదేవి భర్త గంగయ్య | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 10 | 25/ఆ2 /1 | [illegible] | [illegible] | 0.01 1/4 | చింతలచెర్వు రమాదేవి భర్త గంగయ్య | చింతలచెర్వు గంగయ్య తండ్రి సైదులు | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 11 | 25 | [illegible] | [illegible] | 0.00 1/2 | - | ఎన్ఎస్‌పి కాలువ | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 12 | 25 | [illegible] | [illegible] | 0.04 1/2 | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 13 | 25/ఇ /2 | [illegible] | [illegible] | 0.00 1/2 | భూక్యా పంగి భర్త బాలు | భూక్యా పంగి భర్త ధంజ్యా | 23 | 41 | 41 | 26 | [illegible] |
| 14 | 41-1 | [illegible] | [illegible] | 0.04 | భూక్యా శాంతి భర్త కరుణ్‌నాయక్ | భూక్యా కరుణ్ నాయక్ తండ్రి ధంజ్యా | 25 | 43 | 41 | 40 | [illegible] |
| 15 | 41/2/2 | [illegible] | [illegible] | 0.01 1/2 | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | భూక్యా నాగేందర్ తండ్రి ధంజ్యా | 25 | 43 | 41 | 40 | [illegible] |
| 16 | 41/1 -23 | [illegible] | [illegible] | 0.05 1/2 | తోడేటి గంగమ్మ భర్త గంగయ్య | తోడేటి గంగమ్మ భర్త లింగయ్య | 25 | 43 | 41 | 40 | [illegible] |
| 17 | 43/1 | [illegible] | [illegible] | 0.05 | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | 41 | 46 | 42 | 40 | [illegible] |
| 18 | 46 | [illegible] | [illegible] | 0.04 1/2 | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | అవిరబోయిన మల్లయ్య తండ్రి సైదయ్య | 43 | VB | 46 | 40 | [illegible] |
| 19 | 46/5/1 | [illegible] | [illegible] | 0.00 1/2 | బొలగాని సోమయ్య తండ్రి రామచంద్రు | బొలగాని సోమయ్య తండ్రి రామచంద్రు | 43 | VB | 46 | 40 | [illegible] |
| 20 | 46/2 | [illegible] | [illegible] | 0.02 1/2 | జనిగా బచ్చమ్మ భర్త సైదయ్య | జనిగా బచ్చమ్మ భర్త సైదులు | 43 | VB | 46 | 40 | [illegible] |
| 21 | 46/1 | [illegible] | [illegible] | 0.00 1/2 | మొగిలి నారయ్య తండ్రి సైదయ్య | మొగిలి నారయ్య | 43 | VB | 46 | 40 | [illegible] |
| 22 | 46/ఆ2 /1 | [illegible] | [illegible] | 0.03 | తోడేటి లింగమ్మ భర్త నాగయ్య | తోడేటి లింగమ్మ భర్త నాగయ్య | 43 | VB | 46 | 40 | [illegible] |
| | మొత్తం | | | 1.06 | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుట లేదు.

భూ సేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూ సేకరణ చేయు భూములు యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజినల్ అధికారి హుజూర్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR RO NO. 452/LA/PP/Advt/Pub/2025-26



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

**NIT No. 23, పని పేరు:** జిహెచ్‌ఎంసి, రాజేంద్రనగర్ సర్కిల్-11లో 03 పనుల కొరకు సిసి రోడ్డు వేయడం, ఆర్‌సిసి ఎన్‌పి3 600mm డయా పైప్ లైన్ వేయడం మరియు డ్రైనేజీ కనెక్షన్లను అందించడం , **అంచనా వ్యయం:** రూ.23.50 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం:** 07.08.2025న మ.2.30గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 12.08.2025న మ.2.45గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, జిహెచ్‌ఎంసి. సెల్: 9989930608. ఇ-మెయిల్ ఐడి:eec11.ghmc2@gmail.com

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (ఆర్‌జెఎన్‌ఆర్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 6197-PP/CL/ADVT/1/2025-26, Date: 07-08-2025



పురపాలక సంఘు కార్యాలయము-దుబ్బాక, జిల్లా :: సిద్దిపేట

నెం. E1/62/15th FC/GF/2025, టెండర్ ప్రకటన తేది: 07.08.2025

దుబ్బాక పురపాలక సంఘం పరిధిలో, 15వ ఆర్థిక నిధుల ద్వారా **1.** ఆర్.ఒ. ప్లాంట్ ఏర్పాటు చేయుటకు రూ: 4.00 లక్షలు, **2.** DRCC & Vermi Compost Shed మిగులు పనులు చేయుటకు రూ: 6.00 లక్షలు, **3.** సాధారణ నిధుల నుండి LED లైట్స్ కొనుగోలు చేయుటకు రూ: 3.00 లక్షలు, **4.** విద్యుత్తు మరియు మంచినీటి సామాగ్రి కొనుగోలు చేయుటకు రూ: 10.00 లక్షలు మరియు ఫర్మేషన్ రోడ్డు ఏర్పాటు చేయుటకు రూ: 2.50 లక్షల చొప్పున, మొత్తం రూ: 25.50 లక్షలు, మంజూరీ కాబడినవి. ఇట్టి పనులు నిర్వహించుటకు పనులను చేపట్టుటకు ఈ ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్స్ ఆహ్వానిచనైనది.

| | | |
|---|---|---|
| 1. | బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేదీ: | 08.08.2025 11.00 A.M. |
| 2. | బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడింగ్ చివరి తేదీ: | 16.08.2025 4.00 P.M. |
| 3. | బిడ్ వాలిడిటీ పీరియడ్ | 90 Days |
| 4. | వివరములకు సంప్రదించు ఫోన్ నం. | 9390988378, 9391495430, |

పైన తెలిపినపనులకు ద్వారా టెండర్స్ ఆహ్వానిచనైనది. తదుపరి వివరాలకు ఈ ప్రొక్యూర్మెంట్ www.eprocurment.telangana.gov.in సంప్రదించగలరు.

సం/- కమీషనర్ పురపాలక సంఘం దుబ్బాక.

DIPR R.O. No. : 6207-PP/CL/ADVT/1/2025-26, Date: 07-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇందిరమ్మ ఇళ్ల మార్గదర్శకాలు భేష్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్సి, ఎస్టివర్గాలకు చెందిన ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో దోహదపడుతున్నదని, తెలంగాణ ఎస్సి,ఎస్టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకం అమలు కోసం రూపొందించిన విధివిదానాలు, మార్గదర్శకాలు చాలా పకడ్బందీగా ఉన్నాయని ఆయన అభినందించారు. హైదరాబాద్ లోని తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సి,ఎస్టిల రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై కమిషన్ సమీక్షించింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్సి,ఎస్టిలకు 43 శాతం కేటాయించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, మొత్తం కేటాయింపుల్లో 50 శాతం ఉంటే మంచిదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం ఇందిరమ్మ ఇళ్లకేటాయింపు అంశాన్ని వివరిస్తూ , ఇంతవరకు ఇళ్లు మంజూరైన 3.04 లక్షల లబ్ధిదారుల్లో 80,374 మంది ఎస్సిలు,53,734 మంది ఎస్టి ఉన్నారని ఇది మొత్తం లబ్ధిదారుల్లో 44 శాతం వరకు ఉంటుందని తెలిపారు.

## పెన్షనర్ల సమస్యలను ఆగస్టు 15లోగా పరిష్కరించాలి

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెన్షనర్ల సమస్యలను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.చంద్రశేఖర్‌లు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ ద్వారా నగదు రహిత వైద్య చికిత్సలను అమలు చేయడం, పెన్షర్లకు అత్యంత ముఖ్య సమస్య అనే పదే పదే ప్రభుత్వాన్ని కోరినప్పటికి, జూన్ 5న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపినట్లు ప్రకటించి, నేటి వరకు ఉత్తర్వులు జారీ చేయకపోవడం తగదన్నారు. వెంటనే ఈహెచ్‌ఎస్‌పై ఉత్తర్వులు విడుదల చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జెఎసి కూడా ప్రభుత్వానికి ఆగస్టు 15లోకగా సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వానికి తెలిపిందన్నారు. జెఎసిలో బాధ్యాతయుత భాగస్వామ్య సంఘంగా, ఆగస్టు 15 వరకు వేచి చూడాలని, తదుపరి జెఎసి ఉద్యమానికి పిలుపు ఇవ్వని పక్షంలో తమ సంఘం పక్షాన హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద వేలాది మంది పెన్షనర్లతో పెద్ద ఎత్తున నిరసన దీక్ష చేపడుతామని తెలిపారు. ఈనెల 11వ తేదీ రోజు పెన్షనర్ల సమన్వయ సంఘం పేరిట తలపెట్టిన రాష్ట్ర స్థాయి ధర్నాతో తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని దామోదర్ రెడ్డి, చంద్రశేఖర్ చెప్పారు.

## ఐపిఎస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా డిజిపి జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఐపిఎస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా డిజిపి డాక్టర్ జితేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిజిపి కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికలకు అదనపు డిజిపి మహేష్ భగవత్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు, కార్యదర్శిగా హైదరాబాద్ అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, సంయుక్త కార్యదర్శిగా డిఐజి తఫ్సీర్ ఇక్బాల్, కోశాధికారిగా హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్ జోయెల్ డేవిస్ కార్యవర్గ సభ్యులుగా మల్టీజోన్1 ఐజి ఎస్. చంద్ర శేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఎస్‌పి భాస్కరన్, మహబూబ్‌నగర్, నిర్మల్ ఎస్‌పిలు జానకి ధరావత్, జానకీ షర్మిల, హైదరాబాద్ డిసిపి స్నేహామెహ్రాలు ఎన్నికయ్యారు.

## తెలుగు చలనచిత్ర కార్మికుల సమ్మెకు సిపిఐ(ఎం) పూర్తి మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లోని చలనచిత్ర కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. వేలాది కార్మికులకు సంబంధించిన వేతనాల పెంపు విషయంలో చలనచిత్ర రంగంలోని నిర్మాతలు మొండి పట్టుదలకు పోకుండా వారితో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సిపిఐ(ఎం)విజ్ఞప్తి చేస్తుందన్నారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారని, 2022 సంవత్సరంలో జరిగిన ఒప్పందం ప్రకారమే వేతనాలు పెంచాల్సి ఉన్నా గత మూడేళ్ల నుండి పెంచలేదన్నారు. గతంలోనే వేతన ఒప్పందం సందర్భంగా 30శాతం పెంచేందుకు హామి ఇచ్చారని ఆమేరకు పెంచాల్సిందేనని జాన్‌వెస్లీ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

## హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాది గుండెపోటుతో మృతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైకోర్టు ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం విషాద ఘటన చోటుచేసుకుంది. సీనియర్ న్యాయవాది పర్సా అనంత నాగేశ్వర్‌రావు (47) కోర్టు కారిడార్‌లో గుండెపోటుతో మృతి చెందారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కూర్చుని ఉన్న ఆయన, పక్కనే ఉన్న ఫైల్స్‌పై తలవాల్చిన అనంతరం కుర్చీలోనే కూలిపోయారు. అక్కడే ఉన్నవారు వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించినా, అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్డియాక్ అరెస్టే కారణమని వైద్యులు తెలిపారు. నాగేశ్వర్‌రావు లా పూర్తి చేసి ప్రాక్టీస్ ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది వై. రామరావు వద్ద జూనియర్‌గా పనిచేరు. అనంతరం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, ప్రభుత్వ న్యాయవాది, స్పెషల్ జీపీగా సేవలందించారు. మృతదేహాన్ని షేక్‌పేట్‌లోని నివాసానికి తరలించగా, హైకోర్టు న్యాయమూర్తి పుల్లా కార్తీక్, న్యాయవాదులు, అడ్వొకేట్ క్లర్కులు నివాళులు అర్పించారు.

## రేవంత్‌రెడ్డికి హైకోర్టు నుంచి హాజరు మినహాయింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో 2016 జూన్‌లో నమోదైన క్రిమినల్ కేసులో సీఎం ఎ. రేవంత్‌రెడ్డికి హైకోర్టు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు మంజూరు చేసింది. ఈ కేసును విచారిస్తున్న కింది కోర్టు హాజరు అవసరమని ఆదేశిస్తే , హాజరుకావాలని స్పష్టం చేసింది. కేసును సవాల్ చేస్తూ రేవంత్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె. లక్ష్మ ణ్ గురువారం విచారించారు. ప్రతివాదులైన పోలీసులకు నోటీసులు జారీ చేసిన కోర్టు, కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన తెలంగాణ జనజాతర బహిరంగ సభలో నాటి ఎంపీగా పాల్గొన్న రేవంత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌంటర్ దాఖలు చేస్తామని తెలియజేయడంతో, విచారణ సెప్టెంబర్ 1కి వాయిదా పడింది.

## తెలుగు ద్వితీయ భాష అమలుపై ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు భాషను ద్వితీయ భాషగా దశలవారీగా అమలు చేయడంపై హైకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతున్న తీరును వివరించే ప్రణాళికను రెండు వారాల్లో సమర్పించాలింది. తెలుగు భాషను తప్పనిసరి చేస్తూ 2023 డిసెంబరులో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రమీలా పాఠక్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది తెలుగును తప్పనిసరి చేయడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధమని వాదించారు. హిందీ, సంస్కృతం వంటి ఇతర భాషలు చదువుతున్న విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నగర జనాభాలో 42 శాతం ఉర్దూ మాట్లాడే వారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనల ప్రకారం, ప్రస్తుతం 1 నుంచి 8వ తరగతి వరకు తెలుగు ద్వితీయ భాషగా అమలవుతోంది. 9, 10 తరగతులకు మినహాయింపు కొనసాగుతోందని తెలిపారు. ధర్మాసనం వాదనలు పరిశీలించి, పూర్తి కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.



## రాహుల్ నివాసంలో ఇండియా కూటమి భేటీ

**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలోని తన నివాసంలో గురువారం రాత్రి జరిగిన ఇండియా కూటమి సమావేశంలో ఓట్ల చోరీ వ్యవహారాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వివరించారు. ఈ సమావేశానికి సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే(కాంగ్రెస్), అఖిలేశ్ యాదవ్(ఎస్‌పి), తెలంగాణ సిఎం ఎ.రేవంత్ రెడ్డి, డి.రాజా(సిపిఐ), ఎం.ఎ.బేబి(సిపిఐ(ఎం)), దీపాంకర్ భట్టాచార్య(సిపిఐ(ఎంఎల్) లిబరేషన్), శరద్‌పవార్ (ఎన్‌సిపి(ఎస్‌పి)), ఉద్ధవ్ ఠాక్రే(యుబిటి శివసేన),మహబూబాముఫ్తీ (పిడిపి), డెరిక్ ఒబ్రాయిన్(టిఎంసి), తిరుచ్చి శివ(డిఎంకె) తదితరులు హాజరయ్యారు.

## రోడ్ల అభివృద్ధికి పెండింగ్ అనుమతులు తక్షణమే మంజూరు

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్ల నిర్మాణాలకు సంబంధించి వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను తక్షణమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చైర్మన్‌గా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ మొదటి సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎన్‌హెచ్‌ఎఐ, ఎంఒఆర్‌టిహెచ్ ప్రాజెక్టులకు సంబంధించి పనుల పురోగతి, విద్యుత్ లైన్ షిఫ్టింగ్,వాటర్ యుటిలిటీ, ఫారెస్ట్ క్లియరెన్స్ సంబంధిత అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పెషల్ సి.ఎస్ వికాస్ రాజ్, పిఆర్ అండ ఆర్ డి,మైనింగ్ శాఖల సెక్రటరీ ఎన్ శ్రీధర్, సిసిఎల్‌ఎ కమిషనర్ లోకేష్ కుమార్, విద్యుత్ శాఖ అధికారి ముషారఫ్ అలీ,అటవీ శాఖ అధికారి శరవణన్,ఎన్‌హెచ్ఎఐ, ఎంఒఆర్‌టిహెచ్ రీజినల్ ఆఫీసర్స్ కృష్ణప్రసాద్,శివ శంకర్,నీటిపారుదల శాఖ సి.ఈ లు హరనాథ రావు, శ్రీనివాసరెడ్డి,ఆర్ అండ బి ఈఎన్సి జయ భారతి,సి.ఈలు,పలువురు అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను, అనుమతులు తదితర అంశాలను అధికారులు మంత్రికి వివరించారు. దీంతో ఆయా శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అనుమతులను మంజూరు సంబంధింత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ నెల 18న మరోసారి సమావేశం కావాలని ఈ సమావేశానికి అన్ని జిల్లాల కలెక్టర్లు హాజరయ్యేలా చూడాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి, అనుసంధానం ఉండాలనే ఉద్దేశంతో ఎన్‌హెచ్‌ఎఐ, ఎంఒఆర్‌టిహెచ్ ప్రాజెక్టులకు సంబంధించి పనులు వేగంగా పూర్తి చేసేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు.సరైన ప్రణాళికలతో వెళ్లేందుకు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు టాస్క్ ఫోర్స్ కమిటీ పని చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రాజెక్టుల క్లియరెన్స్ కోసం త్వరలో ప్రధాని మోదీని కలుస్తామన్నారు.

**వారంలో హామ్ రోడ్లకు టెండర్లు : కోమటిరెడ్డి**

రోడ్ల మరమ్మతులకు సంబంధించి తొలిదశ కింద రానున్న మూడేళ్ళలోరూ.6 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయనున్నామని,దీనికి సంబంధించి వచ్చే వారం 'హామ్ రోడ్ల ' టెండర్లను ఆహ్వానిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తనను కలిసిన జర్నలిస్టులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల బిల్లును అమోదించాలని ఢిల్లీలో నిర్వహించిన ధర్నా విజయవంతమైందన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో అధికారులు, రాజకీయ నాయకుల పేర్లను మాజీ మంత్రి కెటిఆర్ తన డైరీలో రాసుకుంటున్నామని బెదిరిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ అభివృద్ధి తన లక్ష్యమన్నారు. సమ్మె చేస్తున్న సినీ కార్మికులను ఆహ్వానించి మాట్లాడాలని చలనచిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ దిల్‌రాజుకు సూచించినట్లు ఆయన తెలిపారు.

## పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రణాళికలు

### సిఎస్ రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఉపయోగించి రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను తగ్గించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టులలో కేసుల పెండింగ్ తగ్గించడంతో పాటు డిజిటల్ రికార్డుల నిర్వహణ, సిసిఎంఎస్ (సిసిఎంఎస్) ద్వారా కోర్టు కేసుల పురోగతిని నిరంతరం మానిటరింగ్ చేయడం, సమాచార వ్యవస్థలో పారదర్శకతను పాటించడం, కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆస్కారముంటుందని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టుతో పాటు బీహార్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలో అమల్లో ఉన్న మానిటరింగ్ వ్యవస్థను అధ్యయనం చేసి తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేసేందుకు తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించడంతోపాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోని సుపరిపాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన రైజింగ్ తెలంగాణ2047 లక్ష్య సాధనకు ఈ సాంకేతిక వ్యవస్థ ఉపకరిస్తుందని అన్నారు. ముఖ్యంగా న్యాయశాఖ, రెవెన్యూశాఖ, హోంశాఖ విభాగాల అధికారులు ఎన్‌ఐసితో సంప్రదించి ఆ మేరకు కార్యాచరణను వారంరోజుల్లోగా రూపొందించి నివేదికను సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్‌రాజ్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్యకార్యదర్శి శేషాద్రి, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, జిఎడి కార్యదర్శి బి.ఎం.డి. ఎక్కా, సిసిఎల్‌ఎ కార్యదర్శి మకరంద, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇడి చట్టపరిధికే కట్టుబడాలి

# ఒకవైపు మొగ్గుచూపకూడదు

### పనితీరు మెరుగుపరుచుకోండి : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ డి) ఒకవైపు మొగ్గుచూపకూడదని చట్టపరిధికే కట్టుబడి వ్యవహరించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఇప్పటివరకూ చేపట్టిన కేసులలో దోషులుగా తేల్చి శిక్షలు విధించిన కేసుల నిష్పత్తి చాలా తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు గురువారంనాడు పైవిధంగా వ్యాఖ్యానించింది. ''ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ప్రజల్లో ఉన్న ప్రతిష్ఠ గురించి కూడా మేం ఎంతో ఆందోళన చెందుతున్నాం, నిందితులు ఐదారేళ్ళపాటు జ్యుడీషియల్ కస్టడీలో కొనసాగిన తర్వాత వారు తప్పు చేయలేదని తేలితే ఎవరు మూల్యం చెల్లిస్తారు?'' అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్,జస్టిస్ ఎన్.కోటీశ్వర్ లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పిఎంఎల్‌ఎ (లెక్కల్లో చూపని సొమ్ము అక్రమ తరలింపు నియంత్రణ చట్టం) చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కున్న అరెస్టులు చేసే అధికారాన్ని సమర్థిస్తూ 2022లో ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం, ఇ డి ల తరపున ధర్మాసనం ఎదుట హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు ఈ రివ్యూ పిటిషన్ల చెల్లుబాటును ప్రశ్నించారు. చాలా పేరు ప్రతిష్ఠలు కలిగిన నిందితులు కేసులను నీరుగార్చడంకోసం జాప్యంచేసేందుకు అనుసరించే మాయోపాయాలవల్ల మాత్రమే ఎక్కువమంది దోషులకు శిక్షలు పడటం లేదని, అందువల్లనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన కేసులలో దోషులు తప్పించుకుంటున్నారని ఎస్.వి.రాజు విమర్శించారు. ''చాలా పేరు ప్రతిష్ఠలున్న ప్రభావశీలురైన నిందితులు కపటబుద్ధితో అనేక ఉపాయాలు అనుసరిస్తున్నారు, వారు అనేకమంది న్యాయవాదులను నియమించుకుంటున్నారు, వివిధ దశల్లో కేసు విచారణ సందర్భంగా విచారణ ప్రక్రియను సాగదీయడంకోసం దరఖాస్తులమీద, దరఖాస్తులు కోర్టులో దాఖలు చేస్తూ ఉంటారు, దీనివల్ల దర్యాప్తు అధికారులు తమ సమయాన్ని కేసు దర్యాప్తుమీద దృష్టిసారించి దర్యాప్తుకోసమే తమ సమయాన్ని కేటాయించడానికి వీల్లేకుండా కోర్టు చుట్టూ వారిని తిప్పిస్తున్నారు''అని సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు ధర్మాసనం ఎదుట వాదించారు. ఐతే జస్టిస్ భూయాన్ గతంలో తాను ఒక కేసులో ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించారు. గడచిన ఐదు సంవత్సరాలుగా ఇ డి ఐదు వేల కేసులు దాఖలు చేసిందనీ, ఈ కేసులలో కనీసం 10 శాతం కంటే తక్కుమందికి శిక్షలు పడ్డాయి, పార్లమెంటులో సంబంధిత మంత్రి కూడా ఈ వాస్తవ ప్రకటనను సమర్థించారని గుర్తుచేశారు. ''మీరు ఒకరివైపు మొగ్గుచూపించి నీతి లేకుండా, కపటబుద్ధితో అయోగ్యుడిలా వ్యవహరించకూడదు, చట్టం పరిధిలోనే వ్యవహరించాలి, చట్టం నలుమూలల పరిధిలో పలే వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలి తప్ప ఆ పరిధి దాటి వ్యవహరించకూడదు, నేను ఇచ్చిన తీర్పుల్లో ఒక తీర్పును నేను పరిశీలించాను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గడచిన ఐదు సంవత్సరాలలో 5,000 కేసులు రిజిస్టర్ చేసింది, కానీ ఇన్ని కేసులో నిందితులను దోషులుగా తేల్చిన నిష్పత్తి పదీశాతం కంటే తక్కువగా ఉంది, అందువల్లనే మేం మిమ్మల్ని మీ పనితీరును మెరుగుపరచుకోమని నిర్భదిస్తున్నాం, కేసులను దర్యాప్తు చేసేటప్పుడు మీ పనితీరును మెరుగుపరచుకోండి, వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు మీకు స్వేచ్ఛ ఉంది, ఈ స్వేచ్ఛతో దర్యాప్తు చేసేటప్పుడు పనితీరు మెరుగుపరచుకోండి,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రతిష్ఠ గురించి మేం ఆందోళన చెందుతున్నాం,నిందితులకు ఐదు లేదా ఆరు సంవత్సరాలపాటు జ్యుడీషియల్ కస్టడీ ముగిసిన తర్వాత వారు దోషులు కాదని, ఏ తప్పు చేయలేదని కోర్టు తీర్పులో తేలితే ఎవరు మూల్యం చెల్లిస్తారు? '' అని జస్టిస్ భూయాన్ ప్రశ్నించారు. జస్టిస్ కాంత్ మాట్లాడుతూ, వీటన్నింటికీ ఒకేఒక్క సమాధానం ఉంది, టాడా, పోటాలకు అంకితమైన న్యాయస్థానాలు, పిఎంఎల్‌ఎ కేసులను పరిశీలించి విచారించే న్యాయస్థానాలూ రోజువారీ విచారణ కార్యకలాపాలను చేపట్టాలి, దీనివల్ల కేసులు సత్వరం పరిష్కారం అవుతాయి'' అని చెప్పారు. ''నిజమే, ప్రభావశీలవంతమైన, పేరు ప్రతిష్ఠలున్న నిందితులు ఇప్పటికీ కోర్టుల్లో అనేక కేసులు నమోదు చేస్తున్నారు, వాళ్ళు, వాళ్ల తరపు న్యాయవాదులూ అలాంటి పనులు చేయడానికే అంకితమైపోయారు, కేసుల విచారణలను రోజువారీ ప్రాతిపదికపై కొనసాగించాలని ఆ న్యాయవాదులకు తెలుసు, న్యాయమూర్తులు వాటిని సమీక్షించాలి, వెంటనే మరునాడే నిర్ణయం తీసుకోవాలి, సమయం తక్కువగా ఉన్నప్పుడు వారు ఏమీ చేయలేరు, ఒక మెజిస్ట్రేటు ఒక్కరోజులో 49 కేసులు చూడాలి, పదీ లేదా 20 పేజీల ఉత్తర్వులు జారీ చేయాలి, ప్రతి కేసులోనూ ఇలాగే జరుగుతుంది, వారు చెయ్యలేరు, మెజిస్ట్రేటు ఎంత ఒత్తిడికి గురవుతారో మాకు తెలుసు'' అన్నారు. పేరు ప్రతిష్ఠలు గలవారు వేరే వేరే దేశాలకు పారిపోతూ ఉంటే ఇ డి ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోతోందని, దీనివల్ల కేసుల విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోందని సొలిసిటర్ జనరల్ రాజు అన్నారు.

## తెలంగాణ ట్రాన్స్‌కో ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వాలి

### కేంద్రాన్ని కోరిన డిప్యూటీ సిఎం మల్లు భట్టి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రీన్ ఎనర్జీ కారిడార్ ద్వారా తెలంగాణ ట్రాన్స్‌కో ప్రతిపాదనలకు అనుమతి ఇవ్వాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. టిఇఎ ట్రాన్స్‌కో సంస్థ గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడవ దశలో భాగంగా సమర్పించిన రాష్ట్రాంతర విద్యుత్ సరఫరా వ్యవస్థ ప్రతిపాదనలకు సంబంధించి అనుమతులు ఇవ్వాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను భట్టి న్యూఢిల్లీలో గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ దశలో సౌర విద్యుత్ సంస్థ మొదట తెలంగాణ రాష్ట్రంలోని ఐదు జిల్లాలలో మొత్తం 13.5 గిగావాట్ల సామర్థ్యం గ్రీన్ పవర్ జోన్లను గుర్తించింది. తద్వారా విండ్, సోలార్,పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఎగుమతి చేయాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క కేంద్ర మంత్రికి వివరించారు. ఎస్ఇసిఐ, టిజి రెడ్‌కోలతో విస్తృతంగా చర్చించిన అనంతరం, భూమి లభ్యత,పునర్వినియోగ విద్యుత్ సాధ్యతను పరిగణనలోకి తీసుకుని, ఈ ఆర్ఇ జోన్ల సామర్థ్యం 19 గిగావాట్లకు పెంచినట్లు వివరించారు. ఇది రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలను కవర్ చేస్తుందని, ఈ సవరణకు అనుగుణంగా, టిజి ట్రాన్స్‌కో మొత్తం 19 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన 8 ట్రాన్స్‌మిషన్ పథకాలతో కూడిన సమగ్ర ప్రతిపాదనను తయారు చేసి, దీని అంచనా వ్యయం రూ. 6,895 కోట్లుగా ప్రతిపాదిస్తూ కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థకు సమర్పించిన విషయాన్ని భట్టి తెలిపారు. 19 గిగావాట్ల విద్యుత్ వికాసానికి సంబంధించిన ప్రతిపాదనను వీలైనంత త్వరగా ఆమోదించాలని కేంద్ర మంత్రిని కోరారు.



## 'ఆపరేషన్ అమానత్' సక్సెస్

### సత్తా చాటిన ఆర్‌పిఎఫ్ సైబర్ సెల్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చోరీకి గురైన మొబైల్ ఫోన్ లను గుర్తించి 'ఆపరేషన్ అమానత్'లో భాగంగా ఆర్‌పిఎఫ్ సైబర్‌లు పోలీసులు సెల్‌ఫోన్‌లను రికవరీ చేశారు తమ సత్తా చాటుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేలోని రైల్వే రక్షణ దళం ప్రయాణీకులకు సేవలను అందించే దిశలో భాగంగా 'ఆపరేషన్ అమానత్' కింద కోల్పోయిన మొబైల్ ఫోన్లను కనుగొని తిరిగి పొందడానికి డిజిటల్ సాధనాలను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సిఇఐఆర్) పోర్టల్ ద్వారా, ఆర్‌పిఎఫ్ సైబర్ సెల్ జోన్ వ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్పష్టమైన ఫలితాలు పొందే చర్యల్లో భాగంగా రికవరీ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. రైలు మదద్ ద్వారా కంప్లయింట్ నమోదు చేసినప్పుడు మాత్రమే కోల్పోయిన పరికరాలను రికవరీ చేయడానికి ఆర్‌పిఎఫ్ కు అధికారం ఉంది.ఆర్‌పిఎఫ్ ప్రత్యేక సైబర్ సెల్ జోన్ వ్యాప్తంగా రికవరీ ఆపరేషన్లను చేపడుతున్నది. ఆర్.పి.ఎఫ్ సైబర్ సెల్ జూలై2025 మాసంలో దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల నుండి వచ్చిన మొత్తం 169 ఫిర్యాదులను అందుకుంది.ఈ ఫిర్యాదులలో, సైబర్ సెల్ 139 మొబైల్ ఫోన్‌లను బ్లాక్ చేసింది, 52 పరికరాల జాడను గుర్తించడం జరిగింది, 21 మొబైల్ ఫోన్‌లను విజయవంతంగా స్వాధీనం చేసుకొని , వాటిలో 09 ఫోన్‌లను ఇప్పటికే యజమానులకు తిరిగి అందించడం జరిగింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ రైలు ప్రయాణికులకు సేవ చేయడంలో దక్షిణ మధ్య రైల్వేలోని రైల్వే రక్షణ దళం చేస్తున్న కృషి, అంకితభావాన్ని ప్రశంసించారు.




## 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' దిశగా అడుగులు

### సెప్టెంబర్ నాటికి రోడ్ మ్యాప్ రెడీ

### స్టేక్ హోల్డర్ల సమావేశంలో స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగిల్ విండో వ్యవస్థలో అన్ని సినిమా షూటింగ్ అవసరాల కోసం 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' పోర్టల్ అభివృద్ధిని 'వన్ స్టాప్ షాప్'గా అభివృద్ధి చేయడంతో సహ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. సినిమా షూటింగ్‌లకు తెలంగాణను అత్యంత స్నేహపూర్వక, తక్కువ పెట్టుబడులతో అత్యంత లాభదాయకమైన గమ్యస్థానంగా మార్చే అవకాశాలపై జయేష్ రంజన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎంఐసిఇ, ఫిల్మ్ పర్యాటక రంగాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రోత్సహించడానికి స్టేక్ హోల్డర్ల ప్రత్యేక సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఫిల్మ్ ఇన్ తెలంగాణ, వన్ స్టాప్ షాప్ అంశంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూట్‌మ్యాప్‌ను సెప్టెంబర్‌లోపు ప్రకటించడం జరుగుతుందని జయేష్ రంజన్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికల ద్వారా తెలంగాణను ప్రధాన ఎంఐసిఇ పర్యాటక కేంద్రంగా మార్చడంపై దృష్టి సారించేందుకు గాను ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఫిల్మ్ స్టూడియోలు, సినిమాటోగ్రాఫర్స్ అసోసియేషన్, ఫారెస్ట్, ఎండోమెంట్స్ ,హెరిటేజ్ తెలంగాణ వంటి ప్రభుత్వ విభాగాల నుండి దాదాపు ఇరవై మంది ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం నుండి మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న ఉత్తమ పాలసీలపై చర్చించారు. ఈ సమావేశంలో మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్‌లు, ఎగ్జిబిషన్‌లు ఈవెంట్ వేదికలు, ట్రావెల్, హాస్పిటాలిటీ, ఏవియేషన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాల నుండి దాదాపు 40 మంది కీలక స్టేక్ హోల్డర్లు, పరిశ్రమ ల ప్రతినిధులు సమావేశమై రాష్ట్ర ఎంఐసిఇ పర్యాటక ప్రొఫైల్ అభివృద్ధికి సమగ్ర రోడ్‌మ్యాప్‌పై చర్చించారు. పరిశ్రమ స్టేక్ హోల్డర్లతో పాటు, ఈ సమావేశంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ , టిజిటిడిసి ఎండి వల్లూరు క్రాంతి, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక లు కూడా పాల్గొన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో కలిసి ఫిల్మ్ టూరిజం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటిహెచ్‌ఎం) గచ్చిబౌలి కు సంబంధించి స్టేక్ హోల్డర్ల సమావేశాన్ని కూడా నిర్వహించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లోయలోకి దూసుకెళ్లిన సిఆర్‌పిఎఫ్ వాహనం : ముగ్గురు జవాన్లు మృతి

**ఉధంపూర్:** జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. కద్వా బసంత్‌గఢ్ ప్రాంతంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) సిబ్బందిని తీసుకెళ్తున్న వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న లోయలోకి దూసుకెళ్లింది. అధికారుల సమాచారం మేరకు, ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మరణించగా, 15 మంది గాయపడ్డారు. 187వ బెటాలియన్‌కు చెందిన జవాన్ల బృందం బసంత్ ఘర్ నుండి తిరిగి వస్తుండగా ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటినా సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పుతిన్ భారత పర్యటన

### తేదీలు ఖరారు కాలేదు!
### విశ్వసనీయ వర్గాల స్పష్టీకరణ

**న్యూఢిల్లీ:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈనెలాఖరులో భారత్ పర్యటనకు వస్తున్నారన్న వార్త నిరాధారమైనవని తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం, పుతిన్ పర్యటన ఈ ఏడాది ఉండవచ్చు. కానీ, ఈనెలాఖరున పర్యటించబోతున్నారని వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదు. ఆయన పర్యటనకు తేదీలను ఖరారు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రష్యా పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపుతున్నారు. రష్యాతో వాణిజ్య సంబంధాలు, ముడి చమురు కొనుగోళ్లు, అమెరికా విధిస్తున్న అదనపు టారిఫ్‌లు వంటి అంశాలపై రష్యా నేతలతో ధోవల్ చర్చిస్తారని సమాచారం. అదే విధంగా రెండు దేశాల మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యం అంశాలపై కూడా ఇరు దేశాలు దృష్టి పెట్టాయని తెలుస్తోంది. ఎస్400 సిస్టమ్స్ అంశంలో రష్యాతో ఆయన చర్చించనున్నారు. ప్రస్తుతం ఇండియా వద్ద మూడు ఎస్400 డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. ఇలావుంటే, అమెరికా అధ్య



క్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలోనే పుతిన్ కూడా భేటీ కానున్నారు. ఆ ఇద్దరి భేటీకి వేదికను ఖరారు చేసినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. భేటీకి సంబంధించిన వేదికను రెండు దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల మాస్కోలో పర్యటించారు. ఆయన పర్యటన తర్వాత ఇద్దరు అగ్రనేతలకు చెందిన మీటింగ్‌పై అంగీకారం కుదిరినట్టు చెప్తున్నారు. ఈ భేటీకి ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీని కూడా ఆహ్వానించాలని అమెరికా భావిస్తున్నది. కానీ, ఈ వార్తపై రష్యా స్పందించలేదు.

## మోదీ చైనా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

**న్యూఢిల్లీ:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాకు వెళ్లనుండడంపై సర్వత్రా ఆసక్తి వ్యక్తమవుతున్నది. ఈనెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరిగే ఎస్‌సిఒ సమావేశాల్లో ప్రధాని పాల్గొంటారు. 2019 తర్వాత ప్రధాని చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. 2020లో గల్వాన్ లోయలో ఘర్షణ తర్వాత మొదటిసారిగా చైనా పర్యటనకు భారత ప్రధాని వెళ్లడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మోదీ చైనాలోని తియాంజిన్‌ను సందర్శిస్తారు. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ దేశాలను లక్ష్యంగా చేసుకొని భారీగా సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో చైనా పర్యటనలో ఏఏ అంశాలు ప్రస్తావనకు వస్తాయన్నది కూడా ఉత్కంఠ రేపుతున్నది. ఎస్‌సిఒ సదస్సుకు హాజరయ్యేముందు మోదీ ఈనెల 30న జపాన్‌ను సందర్శించనున్నారు. టోక్యోలో జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిడాతో కలిసి. భారత – జపాన్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి ఆయన నేరుగా చైనా వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.

## చీనాబ్, అంజి వంతెనల నిర్మాణంలో పర్యావరణానికి హాని కలిగించకుండ జాగ్రత్తలు

**న్యూఢిల్లీ :** చీనాబ్, అంజి వంతెనల నిర్మాణంలో హిమాలయ పర్యావరణానికి స్వల్ప స్థాయిలోనే భంగం కలిగించేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. హిమాలయ పర్యావరణానికి కనీస భంగం కలిగించడానికి, వాలు స్థిరీకరణకు తగిన జాగ్రత్తలు తీసుకున్నారని, ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్, చీనాబ్ , అంజి వంతెనల నిర్మాణం కోసం అత్యుత్తమ సంస్థలను రంగంలోకి దించినట్లు బుధవారం లోక్‌సభకు తెలిపారు. పెళుసుగా ఉండే హిమాలయ ప్రాంతాల్లో చీనాబ్ , అంజి ఖాద్ వంతెనల పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికలను ప్రభుత్వం నిర్వహించిందా అని అడిగిన ప్రశ్నలకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావిత అంచనా నివేదికలపై విస్తృతమైన సమాధానం ఇచ్చారు. మొత్తం 272 కిలోమీటర్ల పొడవు గల ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్ట్ ఇటీవల ప్రారంభమైందని, ఇది జమ్మూ మరియు కాశ్మీర్లోని ఉధంపూర్, రియాసి, రాంబన్, శ్రీనగర్, అనంతనాగ్, పుల్వామా, బుద్గాం ,బారాముల్లా జిల్లాలను కలుపుతుందని వైష్ణవ్ తెలిపారు.

### సర్‌పై పార్లమెంటు ఆవరణలో
# వరుసగా 12వ రోజు నిరసన

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సహా ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపిలు పార్లమెంట్ భవన సముదాయంలో వరుసగా 12వ రోజు కూడా నిరసనలు కొనసాగించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్‌ఐఆర్)కు వ్యతిరేకంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన సాగరిక ఘోష్, అలాగే ఇతర విపక్ష పార్టీల ఎంపీలు బ్యానర్లు, పోస్టర్లు చేతబట్టి పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద గురువారం నినాదాలు చేస్తూ సర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### ఓటర్ల ప్రజాస్వామిక హక్కును నిరాకరించడం ద్వారా...
# 'ఇసి' సిగ్గులేని పాత్ర పోషిస్తోంది

### లోక్‌సభలో టిఎంసి నేత
### అభిషేక్ బెనర్జీ ధ్వజం

**కోల్‌కతా :** లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ గురువారం ఎన్నికల సంఘం(ఇసి)పై తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమబెంగాల్‌లో నిజమైన ఓటర్ల ఓటు హక్కును తొలగించడంలో ఇసి రాజ్యాంగ తటస్థతను రాజీపడిందని, సిగ్గులేని పాత్రను పోషిస్తోందని ఆరోపించారు. ఆయన కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ నివాసంలో విందులో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్లడానికి ముందు ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ఓటర్ల జాబితాపై చర్చించి, ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయమై చర్చించే అవకాశం ఉన్నదని తెలియజేశారు. బిజెపికి రాజకీయ ప్రయోజనం చేకూర్చేందుకు ఎన్నికల సంఘం తన రాజ్యాంగ సరిహద్దులను అతిక్రమించిందని బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం ఒక నిష్పాక్షికమైన సంస్థ అనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలని, పక్షపాతం లేని సంస్థ అనే విషయాన్ని ఎన్నికల సంఘం తప్పక గ్రహించాలని, అది రాజ్యాంగ పరిధిలో పనిచేయాలని అభిషేక్ బెనర్జీ హితవుపలికారు. ఎన్నికల సంఘం బిజెపి చేతిలో ఒక సాధనంగా మారిందని మండిపడ్డారు. ఇప్పుడు ఇసి సిగ్గులేని పాత్రను పోషించి గత మూడు నెలల కాలం నుంచే నిజమైన ఓటర్ల ఓటు హక్కును లాక్కునే పనిలో నిమగ్నమై, వారు పనిచేసే ప్రభుత్వాన్ని పనిచేయనివ్వరనే విషయం స్పష్టమవుతున్నదని చెప్పారు. పశ్చిమబెంగాల్ ఎన్నికలు ఇంకా 10 నుంచి 11నెలల సమయం ఉందనగానే ఇసి అతిగా ఆలోచిస్తున్నదని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లోని నిజమైన బెంగాలీలు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా ఉండటానికి



ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వంపై బెనర్జీ నిప్పులు చెరిగారు. ఇటీవలి వివాదంపై అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ 'నిన్న బిహార్‌లో డొనాల్డ్ ట్రంప్ పేరుతో ఒక నివాస ధృవీకరణ పత్రం జారీచేయబడిందనే ఒక నివేదిక నేను చూశాను.. మీరు మాపై ప్రశ్నలు వేయడానికి బదులుగా ఎన్నికల సంఘాన్ని అడగాలి' అని టిఎంసి నేత అభిషేక్ బెనర్జీ విలేకరులకు సూచించారు.

# అమెరికావి ద్వంద్వ ప్రమాణాలు

### మనం కూడా 50 శాతం సుంకం విధించాలి
### కాంగ్రెస్ ఎంపి శశిథరూర్

**న్యూఢిల్లీ:** రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నారంటూ భారత్‌పై అమెరికా 50 శాతం సుంకం విధించడం దారుణమని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ అన్నారు. టారిఫ్‌ల విషయంలో అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నదని విమర్శించారు. డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి సమాధానంగా, భారత్ కూడా అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 50 శాతం అదనపు సుంకాలు విధించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్టులో గుర్తుచేశారు. ఉదాహరణకు భారత్ కంటే చైనా ఎక్కువగా రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నదని పేర్కొన్నారు. అయితే, చైనాకు మినహాయింపులిచ్చిన అమెరికా, భారత్‌పై మాత్రం సుంకాలు విధిస్తునే ఉందని అన్నారు. టంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలో భారతీయ ఉత్పత్తుల కొనుగోళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం కూడా అమెరికా దిగుమతులపై ప్రతీకార చర్యలు తీసుకోవాలని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. మన దేశం దాదాపు 90 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నదని, అలాంటి సమయంలో అధిక దిగుమతి సుంకాలు విధిస్తే, మన ఉత్పత్తులను కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపరని శశి థరూర్ వివరించారు. అలాంటి పరిణామం తప్పనిసరిగా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని



అన్నారు. భారత్ కూడా తగిన రీతిలో స్పందించి, అమెరికాకు దీటైన సమాధానం ఇవ్వాలని అన్నారు.

## ఒడిశా మాజీ మంత్రి బిభూతి భూషణ్ సింగ్ మృతి

**భువనేశ్వర్ :** ఒడిశా మాజీ మంత్రి, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్ (70) మరణించారు. ఆయన కుటుంబం ఈ విషయాన్ని వెల్లడించింది. 70సంవత్సరాల వయసున్న బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పూర్వ ఖండపాడ రాజకుటుంబానికి చెందిన మర్దరాజ్ గురువారం మధ్యాహ్నం 1230గంటలకు ఇక్కడి ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమయంలో తుదిశ్వాస విడిచారు. బిభూతి భూషణ్ సింగ్ మర్దరాజ్ మృతిపట్ల ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ తన తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. 'మాజీ ఒడిశా మంత్రి, ఒడిశా అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన బిభూతి భూషణ్‌సింగ్ మర్దరాజ్ మృతి విచారకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పూరీ జగన్నాథుడిని నేను ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తున్నాను. 'ఓంశాంతి' అని మాఝీ తన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఖండపాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిభూతి భూషణ్‌సింగ్ మర్దరాజ్ 1980,1985,1995లో మూడుసార్లు శాసనసభ్యుడుగా ఎన్నికయ్యారు.ఒడిశా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా 1996 నుంచి 2000వరకు కొనసాగారు. ఆయన కుమారుడు సిద్ధార్థ్ శేఖర్ సింగ్ కూడా ఒడిశా రాష్ట్ర శాసనసభకు 2009లో బిజెడి పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఎన్నికయ్యారు. కాగా మర్దరాజ్‌ను కడసారి సందర్శించుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు హాస్పిటల్‌కు తండోపతండాలుగా తరలివచ్చి నివాళులు అర్పించారు.

## జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో ఇడి సోదాలు

న్యూఢిల్లీ : జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలలో రూ. 750 కోట్ల విలువైన జిఎస్‌టి 'నకిలీ' ఇన్‌వాయిస్‌ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కొత్తగా సోదాలు నిర్వహించిందని అధికార వర్గాలు తెలిపాయి. మూడు రాష్ట్రాల్లోని డజనుకు పైగా ప్రదేశాలలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద దాడులు నిర్వహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి.ఈ కేసు జార్ఖండ్‌లో షెల్ కంపెనీలు, అనధికార ఆర్థిక మార్గాల ద్వారా రూ. 750 కోట్ల 'నకిలీ' ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)లను సృష్టించిన దానికి సంబంధించినది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి శివ కుమార్ దేవరా అరెస్టు తర్వాత డి దర్యాప్తు మొదలైంది. ఆయనను మే 2025లో అరెస్టు చేయగా, గత నెలలో చార్జిషీట్ దాఖలు చేశారని ఇడి వర్గాలు తెలిపాయి.

## గతంలో పార్లమెంటు చర్చించింది

### ఇసి వ్యవహారంలో రిజుజు తప్పుదోవ పట్టిస్తున్నారు: గొగోయ్

**న్యూఢిల్లీ:** ఎన్నికల సంస్కరణలు, ఈసీ పనితీరుపై చర్చించే చరిత్ర పార్లమెంటుకు ఉందని కాంగ్రెస్ గుర్తు చేసింది. ఎన్నికల సంఘం పనితీరు వంటి అంశాలను చట్టసభల్లో చర్చించే అనుమతి లేదంటూ తప్పుదోవ పట్టించేలా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజుజు మాట్లాడరని పేర్కొంది. ఎస్‌ఐఆర్‌పై పార్లమెంటులో చర్చకు డిమాండ్ చేస్తూ ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు గురువారం పార్లమెంటు మకర ద్వారం వద్ద ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ లోక్‌సభ డిప్యూటీ నాయకుడు గౌరవ్ గొగోయ్ విలేకరులతో మాట్లాడుతూ ఈసీ వ్యవహారంలో పార్లమెంటును, దేశ ప్రజలను రిజుజు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. 19502012 మధ్య కాలంలో ఎన్నికలకు సంబంధించిన అనేక అంశాలపై చట్టసభల్లో చర్చలు జరిగాయని తెలిపారు. ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల సంఘం పని తీరును చర్చించే దీర్ఘకాలిక, ద్వైపాక్షిక చరిత్రను పార్లమెంటు కలిగివుందని చెప్పారు. ప్రశ్నలకు ఈసీ సమాధానం ఇవ్వలేదని, ఇది ఏ మంత్రిత్వశాఖ పరిధిలోకి రాదు కాబట్టి ఏ మంత్రి సమాధానం ఇస్తారంటూ గత కొన్ని రోజులుగా ప్రభుత్వం వాదిస్తోందని గొగోయ్ అన్నారు. ఇలాంటి చర్చ జరిగినప్పుడు న్యాయ మంత్రి సమాధానం ఇచ్చిన సందర్భాలు గతంలో చాలానే ఉన్నాయన్నారు. 1957లో, 1979లో, 1981లో, 2005లో, 2015లో చట్టసభల్లో ఎన్నికల అంశాలపై చర్చలు జరిగినట్లు గొగోయ్ తెలిపారు.




## జస్టిస్ వర్మకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ: తన ఇంట్లో భారీ మొత్తంలో నోట్లకట్టలు బయటపడిన కేసులో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదికను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. భారీ మొత్తంలో నగదు బయటపడటంతో ఆయనను తొలగించాలని ఆ నివేదిక సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ వర్మ పక్షాన వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి హాజరయ్యారు. తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయంతో పార్లమెంట్‌లో ఆయనపై అభిశంసన చేపట్టేందుకు మార్గం సుగమమైంది. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని నాటి సీజేఐ సంజీవ్‌ఖన్నా రాష్ట్రపతి, ప్రధానికి సిఫార్స్ చేశారు. తాజాగా జస్టిస్ వర్మ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వాదనలు విన్నది. అనంతరం జస్టిస్ వర్మ పిటిషన్‌ను సమర్థించలేమని తేల్చిచెప్పింది. ఆయన అంతర్గత కమిటీ విచారణలో పాల్గొన్న తీరు, ఆ తర్వాత కమిటీ సామర్థ్యాన్ని ప్రశ్నించడాన్ని తాము పరిగణనలోకి తీసుకొన్నట్లు పేర్కొంది. ఆయన రిట్ పిటిషనే విచారణకు అనర్హమని తేల్చింది. నాటి భారత ప్రధాన న్యాయమూర్తి, ఆయన ఏర్పాటుచేసిన అంతర్గత కమిటీ ఫొటోలు, వీడియోల అప్‌లోడ్ విషయంలో తప్పించి... మిగిలిన అంశాల్లో చట్టాన్ని పూర్తిగా అనుసరించిందని తేల్చిచెప్పింది. ఫొటోలు, వీడియోల విషయాన్ని జస్టిస్ వర్మ పిటిషన్ అభ్యంతరం చెప్పకపోవడంతో... దానిని పట్టించుకోమని ధర్మాసనం పేర్కొంది.

# ఓటర్ల హక్కులు హరిస్తున్న ఇసి

### ఎస్‌ఐఆర్ ముసుగులో ఎన్‌ఆర్‌సీకి కుట్ర
### అధికారుల తొలగింపు తగదు : మమతా బెనర్జీ

**కోల్‌కతా:** ఎన్నికల సంఘం నిసిగ్గుగా ఓటర్ల ప్రజాస్వామిక హక్కులను హరిరిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. ఎస్‌ఐఆర్ ముసుగులో ఎన్‌ఆర్‌సీ అమలునకు కుట్ర జరుగుతోందని ఆరోపించింది. రాజ్యాంగబద్ధ తటస్థతతో రాజీ పడుతూ బెంగాల్ ప్రజల న్యాయమైన హక్కు నిరాకరిస్తోందని పేర్కొంది. తన పరిధికి మించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని దుయ్యబట్టింది. బెంగాల్ 2026లో ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. అయితే విధుల నిర్వహణలో వైఫల్యం, రెండు జిల్లాల్లో ఓటర్ల జాబితాలలో లోపాలను చూపుతూ నలుగురు అధికారులను ఈసీ తొలగించడాన్ని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, అధికారులందరికీ తమ ప్రభుత్వ అండ ఉంటుందన్నారు. ఎన్నికల తేదీ ప్రకటించినప్పటి నుంచి చర్యలు తీసుకునే అధికారం ఈసీకి ఉంటుందని, అందుకు ఇంకా చాలా సమయం ఉందని అన్నారు. మమత గురువారం రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికల సంఘం తీరును తప్పుపట్టారు. రాజ్యాంగంలోని ఏ నిబంధన ప్రకారం అధికారులను సస్పెండ్ చేశారని ఈసీని నిలదీశారు. ఎన్‌ఆర్‌సీ పేరిట ఎవరిపైనైనా చర్యలు తీసుకోగలమని అనుకుంటున్నారా అంటూ మండిపడ్డారు. ఎస్‌ఐఆర్ ముసుగులో ఎన్‌ఆర్‌సీని గుట్టుగా అమలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల జాబితాల నుంచి ఓటర్ల పేర్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని, ప్రతి ఒక్కరు తమ పేర్లు మళ్లీ నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. 'నా లాంటి చాలా మంది వద్ద జనన ధ్రువీకరణ పత్రాలు ఉండవు. అనేక మంది ఇళ్లలోనే పురుడు పోసుకుంటారు. లేదంటే ప్రకృతి విపత్తుల్లో ధ్రువీకరణ పత్రాలను కోల్పోయి ఉండవచ్చు. వీరిందరి పత్రాలు చట్టాలు రూపొందించే వారి వద్ద ఉంటాయా' అని మమత వ్యాఖ్యానించారు. మాతృభాష అనేది ప్రతి ఒక్కరికి గర్వకారణమని, బెంగాలీ మాట్లాడుతున్న కారణంగా తమ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు ఇతర రాష్ట్రాల్లో వేధింపులను ఎదుర్కొంటున్నారని, రెండు వేలకు పైగా మందిని స్వస్థలాలకు చేర్చినట్లు తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడేవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, కొందరు ంగ్లాదేశ్‌లోకి నెట్టబడుతున్నారని, మైన్మార్ నుంచి వచ్చిన రొహింగ్యాలుగా ముద్ర వేయబడుతున్నారని, ఇదంతా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కుట్ర అంటూ హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో పరిస్థితిని ఆక్షేపించారు.



దేశ జాతీయ గీతం 'జగ గణ మణ'ను బెంగాలీలోనే రాశారని, ఇప్పుడు ఇదే భాష ఉనికి ప్రశ్నార్థకమైందని అన్నారు. మాతృభాషలో మాట్లాడటం నేరమా? అక్రమ చొరబాటుదారులు ఉంటే తిప్పి పంచవచ్చు కానీ ఆ నెపంతో భారత పౌరులను వేధించడం సమంజసమా? అని ప్రశ్నించారు. పనితనాన్ని బట్టే బెంగాల్ కార్మికులకు ఇతర రాష్ట్రాల్లో ఉపాధి లభిస్తోందని, తమ రాష్ట్రంలో ఉన్న ఇతర రాష్ట్రాలకు చెందిన 1.5 కోట్ల మంది కార్మికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఉత్తర బెంగాల్ వాసులకు అసోం ప్రభుత్వం నుంచి నోటీసులు అందాయని, ఇలాంటివి సహించేది లేదని తేల్చిచెప్పారు.

## బాధితుల చెంతకు రూ.23 వేల కోట్ల హవాలా సొమ్ము

### సుప్రీంకు తెలిపిన కేంద్రం

**న్యూఢిల్లీ:** మనీలాండరింగ్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఇప్పటివరకు రూ.23 వేల కోట్ల హవాలా సొమ్మును స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తాన్ని ఆర్థిక నేరాల బాధితులకు చెల్లించినట్టు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. దివాలా తీసిన భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్ (బీపీఎస్‌ఎల్) ఆస్తుల విక్రయానికి అనుమతినిస్తూ ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీన్ని సమీక్షించాలని అభ్యర్థనలు రావడంతో రివ్యూ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం విచారణ జరుగుతుండగా... ఓ న్యాయవాది మాట్లాడుతూ బీపీఎస్‌ఎల్‌పై ఈడీ కేసు గురించి ప్రస్తావించారు. దీనికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ బదులిస్తూ 'ఇక్కడ కూడా ఈడీ ఉందా' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ 'ఇక్కడో వాస్తవం చెప్పాలి. ఈ విషయాన్ని ఇంతవరకూ మేం ఏ కోర్టులోనూ చెప్పలేదు. ఇప్పటివరకు ఈడీ మనీలాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా రూ.23 వేల కోట్లను స్వాధీనం చేసుకుంది. ఆ మొత్తం దేశ ఖజానాలో ఉండదు. దాన్ని బాధితులకు ఈడీ చెల్లించింది' అని వివరించారు. అయితే, ఈ కేసుల్లో శిక్షల రేటు ఎలా ఉందని సీజేఐ అడగ్గా... శిక్షలు పడిన సందర్భాలు తక్కువే అని ఎస్‌జీ కోర్టుకు తెలిపారు. 'దోషులుగా తేలకపోయినా... విచారణ పేరుతో సంవత్సరాల పాటు మీరు వారికి శిక్ష వేస్తున్నారు కదా' అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X SCRailwayIndia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండరు నోటీసు నెం.GNT/SG/36/343. తేదీ: 04.08.2025 PUB/0950

క్రింద పేర్కొన్న పనుల కోసం కింది సంతకందారు తేది: 26.08.2025న 16:00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానించడమైనది.

ID. నం. 344, పని పేరు: గుంటూరు డివిజన్‌లోని NRDP- VLG మధ్య LC నం.13 @ కి.మీ.27/3-4 వద్ద మిడ్-సెక్షన్ LC గేట్ యొక్క ప్రతిపాదిత ఇంటర్‌లాకింగ్‌కు సంబంధించి సిగ్నలింగ్ ఏర్పాట్లు, ప్రకటించిన టెండర్ విలువ (రూ.): 63,57,588.60, ఇఎండి/బిడ్-సెక్యూరిటీ (రూ.): 1,27,200.00, టెండర్ డాక్యుమెంట్ ధర (రూ.): లేదు

1. టెండర్లు తెరిచే తేదీ తరువాత సెలవు దినంగా ప్రకటించబడితే, టెండర్లు తదుపరి పని దినాన నిర్ణీత సమయంలో తెరవబడతాయి.

2. ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీలు: 26.08.2025 నుండి 16:00 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి.

3. ఏదైనా తదుపరి కమ్యూనికేషన్ / దిద్దుబాటు ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / గుంటూరు

ఇ-టెండరు నోటీసు నెం. 470/DRM/W/GNT PUB/0951

క్రింద పేర్కొన్న పనుల కోసం 04.09.2025న 15:30 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నది.

క్ర.సం. 1, టెండర్ ఐడి: 2804, సీనియర్ డిఇఎం / డిఇఎం: కో-ఆర్డినేషన్, పని వివరణ: గుంటూరు డివిజన్ 5 సంవత్సరాల పాటు ఏజెన్సీ (RDSO ఆమోదించబడిన సంస్థ మాత్రమే) ద్వారా 164 వంపులలో (ఎలక్ట్రానిక్ రకం) ట్రాక్ మౌంటెడ్ ఆటోమేటిక్ గేజ్ ఫేస్ లూబ్రికేటర్ల సరఫరా, సంస్థాపన, కమిషన్ మరియు నిర్వహణ., సుమారు విలువ (రూ.): 22,41,85,442.00, బిడ్ సెక్యూరిటీ (రూ.): 12,70,900.00

1. ఆన్‌లైన్‌లో ఇ-బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ: 04.09.2025న 15:30 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వండి.

2. ఏవైనా తదుపరి సమాచారం / సవరణలు ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడతాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్)/గుంటూరు

ఇ-టెండరు నోటీసు నెం. 17-2025-26 _Sr.DEE_Tr_HYB, తేదీ:06.08.2025 PUB/0952

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ DEE/TR/HYB, టెండర్ నంబర్: 17-2025-26_Sr_DEE_Tr_HYB, తేదీ: 06.08.2025, ముగింపు తేదీ: 28.08.2025, 15:00 గంటలకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు తమ అసలు/సవరించిన బిడ్లను ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు వ్యతిరేకంగా మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడిన ఏవైనా విస్మరించబడతాయి.

క్ర.సం. 1, పని వివరణ: టెండర్ నెం. 17-2025-26_Sr_DEE_Tr_HYB: హైదరాబాద్ డివిజన్: MBNR-GWD, GWD-DHNE & MOB-MUE విభాగంలో SCADA వ్యవస్థల కోసం సైబర్ భద్రతా ఫీచర్ ఏర్పాటు., సుమారు ధర (రూ.): 1,93,93,080.00, ఇఎండి (రూ.): 2,47,000.00, పూర్తి వ్యవధి: 06 నెలలు, ముగింపు తేదీ: 28.08.2025

టెండర్ యొక్క పూర్తి వివరాలను చూడగలిగే నోటీసు బోర్డు స్థానం: సీనియర్ DEE/Tr/HYB, కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్ - 500025.

మరిన్ని వివరాల కోసం మా వెబ్సైట్ www.ireps.gov.in ని సందర్శించండి

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ట్రాక్షన్)/ సికింద్రాబాద్
A1178

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రజాపక్షం
శుక్రవారం, 08 ఆగస్టు

# తదుపరి ఏమిటి ?

తెలంగాణలోని వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో, (పంచాయతీరాజ్, పురపాలక సంస్థలు) (రాజకీయ పదవుల్లో) 42శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న విశ్వప్రయత్నం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ సహాయనిరాకరణ కారణంగా ముందుకు సాగటం లేదు. మరోవైపు సెప్టెంబర్ నెలాఖరులోపు పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశం వెనుక నుంచి తరుముతోంది. ఈ ఎన్నికలు ఇప్పటికే దాదాపు రెండు సంవత్సరాలు ఆలస్యం అయినాయి. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామీణాభివృద్ధి సజావుగా సాగటంలేదు. రెండు, ఎన్నికైన పాలక వర్గాలు లేనందున గ్రామీణాభివృద్ధికి కేంద్రం ఇచ్చే ప్రణాళికా సంఘం నిధుల విడుదల నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిల రిజర్వేషన్‌ల పెంపుదలకు అవసరమైన ఆధారనీయ గణాంక సమాచారం కోసం శాస్త్రీయంగా 'కులగణన' నిర్వహించింది. ఆ గణాంకాల ప్రకారం బిసి రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కోసం తెలంగాణ బిసిలు, (గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో సీట్ల రిజర్వేషన్) 'బిల్లు, 2025' 'తెలంగాణ బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు (విద్యాసంస్థల్లో, రాష్ట్ర ఉద్యోగాల్లో నియామకాల్లో రిజర్వేషన్) బిల్లు, 2025లను శాసనసభల్లో 'ఏకగ్రీవం'గా (బిఆర్ఎ స్, బిజెపి కూడా బలపరిచాయి) ఆమోదించి, వాటిని 9 షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరుతూ గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అలాగే స్థానిక సంస్థల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి రాజకీయ రిజర్వేషన్‌లను 50శాతానికి పరిమితం చేస్తూ గతంలో కెసిఆర్ ప్రభుత్వం ఆమోదించిన చట్టం బిసిలకు రిజర్వేషన్‌ల పెంపుదలకు ఆటంకంగా ఉన్నందున, బిసి రిజర్వేషన్‌ను 42శాతానికి పెంచేందుకు ఆ చట్టాన్ని సవరిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆ మోదం కోసం పంపగా, ఆయన దాన్ని కూడా రాష్ట్రపతి పరిశీలన ఆమోదం కోసం పంపారు. మోదీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. రాష్ట్రపతి స్వయంగా చేయగలిగిందేమి కాదు. అందువల్లనే కావచ్చు రేవంత్‌రెడ్డి ప్రతినిధివర్గానికి కలిసే అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రప్రభుత్వం తమ సమస్యను దేశం దృష్టికి తెచ్చేందు కు, తమ బిల్లుల క్లియరెన్స్‌కై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో 'పోరుబాట' పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో పాటు ఇండియా కూటమి నుంచి దాదాపు 70 మంది ఎంపిలు సంఘీభా వం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరుల ప్రసంగాలు, మాటలు తూటాలు అలా ఉంచితే, ఈ సమస్య బిజెపి– కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరాటం రూపం తీసుకుందని, అందువల్ల ఇప్పట్లో పరిష్కారం లభించబోదని సులభంగానే అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు అడ్డుపడటమే పనిగాపెట్టుకున్న బిఆర్ఎస్, బిజెపిలు ఇతర విషయాలతో పాటు ప్రభుత్వం 'కులగణన' చేపట్టిన నాటి నుంచీ పైకి బలపరుస్తున్నట్టే నటిస్తూ ఏదోక వంక పెడుతూనే ఆరోపణలు సంధిస్తున్నాయి. తమ వెనుకనున్న బిసి లు కాంగ్రెస్ వెంట పోతారేమోనని బిఆర్ఎస్‌కు భయం. కుల గణనను జాతీయ నాయక త్వం వ్యతిరేకిస్తున్నందున ఇక్కడ బిజెపి నాయకులకు ఏం మాట్లాడాలన్నా బెదురు. దేశవ్యాప్తంగా ఒత్తిడి మూలంగా మోదీ ప్రభుత్వం 2026 జనగణనతో పాటు కులగణన చేబడతామని ప్రకటించటంతో రాష్ట్ర బిజెపి నాయకులకు నోరులేచింది. బిసి రిజర్వేషన్‌కు తాము అనుకూలమే అని చెబుతూ ముస్లిం వ్యతిరేక కార్డును బయటకు తీసి అడ్డుపడుతున్నారు. గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ముస్లిం బిసిలకు రిజర్వేషన్‌లు ఉన్నాయి కదా అనే ప్రశ్నకు సమాధానం చెప్పరు. బిసిలను దగా చేసేందుకు శాసన సభలో బిసి రిజర్వేషన్ బిల్లులను బలపరిచారు. బయటనేమో ప్రతిరోజు కుశంకల విషం కక్కుతూనే ఉన్నారు.ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు 10శాతం రిజర్వేషన్‌ను సుప్రీ కోర్టు సమర్థించాక, లోగడ విధించిన 50శాతం లక్ష్మ ణరేఖ చెరిగిపోయి రిజర్వేషన్‌లు 60 శాతానికి చేరాయి. ఆ రేఖ కారణంగానే మండల్ కమిషన్ రిజర్వేషన్‌లను 27శాతానికి పరిమితం చేసింది. మోదీ ప్రభుత్వం విజ్ఞతారహితంగా ఇప్పుడు తెలంగాణ బిసి రిజర్వేషన్‌లకు మోకాలడ్డినా, రేపు దేశవ్యాప్తంగా కులగణన తదుపరి ఏం చేయగలదు? 2029లో నరేంద్రమోదీని గద్దె దింపుతామన్న రేవంత్‌రెడ్డి అనవసర, అపరిపక్వ సవాలుకు అదే ప్రాతిపదిక. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందున్న ప్రత్యామ్నాయం ఒక్కటే. స్థానిక సంస్థల ఎన్నికలను ఇంకా వాయిదా వేయటం గ్రామసీమల్లో ప్రజాస్వామ్య పాలనకు, అభివృద్ధికి అవరోధం. బిఆర్ఎస్, బిజెపి జిత్తులమారితనాన్ని ఎండగడుతూ ఎన్నికలకు వెళ్లటమే ఉత్తమం. 42శాతం రిజర్వేషన్‌లకు చట్టబద్ధత వచ్చేవరకు ఎన్నికలు వాయిదా వేయాలనే వారు అవకాశవాదులు, ప్రజాస్వామ్య వ్యతిరేకులుగా ప్రజల ముందు నిలబడతారు. బిసిల విశ్వాసం చూ రగొనేందుకై కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల్లో 42శాతమే కాదు, అంత కుమించి బిసిలకు ఇచ్చి గెలిపించి పదవుల్లో కూర్చోబెట్టాలి. దీన్ని సవాలుగా తీసుకోవటం భవిష్యత్ రాజకీయ గమనానికి బాటవేస్తుంది. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం మున్సిపల్ చైర్మన్ పదవుల్లో 40శాతానికిపైగా మహిళలకు ఇచ్చిన రాజకీయ చాతుర్యం ఈ సందర్భంగా గుర్తుచేసుకోదగింది.

# కెసిఆర్‌పై పేలిన కాళేశ్వరం బాంబు




ఎస్.కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

కాళేశ్వరం కమిషన్ రిపోర్టు కెసిఆర్ పాలిట గరళమే. ఏ ప్రాజెక్టుతో ప్రపంచ ఖ్యాతి గడించినట్టు కెసిఆర్ భావించారో అదే ప్రాజెక్టు ఆయన ఖ్యాతిని పాతాళానికి తొక్కిపారేసేస్తున్నదంటే అతిశయోక్తి కాదని పరిశీలకులంటున్నారు.రాజకీయాల్లో గెలుపోటములు సంగతెలా ఉన్నా నాయకుడికి విశ్వసనీయత, నైతిక విలువలు అత్యంత ప్రధానమైనవి. 2001లో డిప్యూటీ స్పీకర్ పదవికి, నాటి అధికార పార్టీ టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేసిన కారణంగానే ప్రజల్లో కెసిఆర్‌కు విశ్వసనీయత లభించింది. 2014 నుంచి పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా పాలించిన కాలంలో జరిగిన పలు అవకతవకలలో కాళేశ్వరం ఒకటి. జస్టిస్ ఘోష్ కమిషన్ తమకు వ్యతిరేకంగా నివేదిక ఇవ్వనుందని, అది కాంగ్రెస్ పార్టీ కమిషన్ అని కెసిఆర్ తరఫున ఆయన పార్టీ నాయకులు గుప్పిస్తున్న ఆరోపణలు సాధారణ జనానికెక్కడం లేదు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరం రిపోర్టుపై కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య భీకర పోరాటం జరగనుంది. కాళేశ్వరం తెలంగాణ జీవనది అని వాదించేందుకు కెసిఆర్ పార్టీ రెడీ అవుతోంది. ఇదొక ఫ్రీ ప్లాన్డ్ పథకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారు. '7 బుర్జ్ ఖలీఫాలకు సరిపడా కాంక్రీటు, 15 ఈఫిల్ టవర్ల నిర్మాణానికి సరిపడా ఉక్కు, ప్రపంచంలో అతి పెద్దదైన గీజా పిరమిడ్ వంటి 6 పిరమిడ్ల పరిమాణంలో తవ్విన మట్టి, 72 గంటల్లో 25,584 ఘనపు మీటర్ల కాంక్రీటును పోసి గిన్నిస్ రికార్డ్ సృష్టించాం' అని మేడిగడ్డ బరాజ్ నిర్మాణ ఘనత గురించి దాని కాంట్రాక్టు సంస్థ ఎల్ అండ్ టీ అప్పట్లో చెప్పింది. ఈ ప్రాజెక్టులో గేట్ల బరువును ఆపే స్తంభాల వంటి నిర్మాణాలు (పీర్) ఒక్కొక్కటి 110 మీటర్ల పొడవు, 46 మీటర్ల వెడల్పు, 25 మీటర్ల ఎత్తున కాంక్రీటుతో నిర్మించారు. ఇంత భారీగా కట్టిన పీర్లలో ఒకటి 2023 అక్టోబర్‌లో కుంగింది. ఇక అక్కడి నుంచి కాళేశ్వరం అనే 'పనికి మాలిన' ప్రాజెక్టు కేవలం రాజకీయ నాయకులు, అధికారులకు 'డబ్బు యంత్రం'లా మారిపోయిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ, అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. 2023 డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి రూపంలో సునామీ వచ్చేదాక 'కెసిఆర్ కాళేశ్వరం కథలు' జనం వింటూనే ఉన్నారు. రైతు బంధు, దళితబంధు, కెసిఆర్ కిట్స్, షాదీముబారక్, వంటి అనేక సంక్షేమ పథకాలు తెలంగాణలో సుదీర్ఘ కాలం చెప్పుకోదగినవే ఉన్నాయి. ఏమి జరుగుతుందో గానీ లోపే జరగాల్సిన విధ్వంసం జరిగిపోయింది. కాళేశ్వరం భాగోతమంతా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో తేటతెల్లమయింది. 'నేను డిజైన్ చేయలేదు. నాకు ఇంజనీరింగ్ భాష రాదు. రాజకీయ నాయకులు స్ట్రాటజిస్టులే తప్ప డిజైన్ చేసేవాళ్లం కాదు. ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో మొత్తం పెట్టిన ప్రాజెక్టుల కెపాసిటీ 14 టిఎంసిలు. ఒక పంపు పోస్తే మరో పంపు అందుకోవాలి. కరెంటు పోతే గోవిందా. వాళ్లకు నీరిచ్చే ఉద్దేశం లేదు. కానీ, మేం నీళ్లు తీసుకోవాలి. 14 టిఎంసిలు కాదు. రీ డిజైన్ చేయాలని అధికారులకు చెప్పాం. డబల్ స్ట్రాటజీ బై కెసిఆర్ బై ది గవర్నమెంట్. నీళ్లు రావాలని స్ట్రాటజీ చెప్పిన. కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్‌ను పిలిపించాం. వ్యాప్కోస్ కన్సల్టెంట్‌గా సర్వే చేసింది. వారికి డబ్బులు పే చేశాం. తమ్మిడిహట్టి వద్ద తీసుకోవడం తప్పు అని సిడబ్ల్యుసి, వ్యాప్కోస్ రిపోర్ట్ ఇచ్చాయి. ఎక్కడ తీసుకోవాలంటే ప్రాణహిత తర్వాత తీసుకోవాలి. ప్రాణహిత గోదావరిలో కలిసిన తర్వాత తీసుకోవాలని మేడిగడ్డ వద్ద ప్లాను చేశాం. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్. ఈ క్రమంలో ప్రతి స్టేజిలో లక్షల ఎకరాల్లో నీళ్ల వస్తయ్.' అని కెసిఆర్ 2024 ఏప్రిల్‌లో ప్రముఖ న్యూస్ ఛానల్ లో మాట్లాడుతూ చెప్పారు.

దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని నాలుగేళ్లుగా కోడై కూస్తూనే ఉన్నది. కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ కుటుంబానికి ఏటిఎంలా మారింది. వేల కోట్ల అవినీతి జరిగింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా, జేపీ నడ్డా అనేక సార్లు ఆరోపణలు చేశారు. కాని బిజెపి ఈటల రాజేందర్ నుండి భిన్నంగా కమిషన్ ఎదుట వివరణ ఇచ్చారు. ప్రజల నుండి, రైతుల నుండి వచ్చిన ఒత్తిళ్ల మేరకే ప్రాజెక్టు అంచనాలను పెంచారని ఈటల వాంగ్మూలం ఇచ్చారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని మొత్తుకున్న బిజెపి నాయకులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడతారు? కాళేశ్వరం కెసిఆర్ కుటుంబానికి ఏటిఎంలా మారిందని పదేపదే ప్రచారం చేసిన ప్రధాని మోదీ, అమిత్ షా, నడ్డా ఇప్పుడేమంటారు? బిఆర్ఎస్‌తో బిజెపికి ఉన్న లోపాయికారి ఒప్పందం మేరకే కెసిఆర్‌ను కాపాడేందుకు ఈటలతో వివరణ ఇప్పించారా? బిజెపి నాయకత్వం సమాధానం చెప్పాలన్న డిమాండ్ వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిస్సంకోచంగా విధానపరమైన, ఆర్థిక పరమైన అవకతవకలు జరిగాయని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తేల్చింది. మేడిగడ్డ బరాజ్ కుంగడానికి, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కారణమని కమిషన్ నిర్ధారించింది.'పరిపాలన, ప్రణాళిక, సాంకేతిక, ఆర్థిక పరమైన అంశాలల్లో వ్యక్తిగత నిర్ణయాలు తోడు నాటి రాజకీయ నాయకత్వం ప్రభావం చూపింది. దీనివల్ల పెద్దఎత్తున ప్రజాధనం దుర్వినియోగమైంది' అని జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ప్రస్తావించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన, ప్రజాధనం దుర్వినియోగం ఆరోపణలపై జ్యుడిషియల్ విచారణ చేసిన సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఘోష్ నివేదికను ఆగస్టు 4న తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. మొత్తం 665 పేజీలతో కూడి నివేదికను జులై 31న జస్టిస్ పీసీ ఘోష్ ప్రభుత్వానికి సమర్పించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై కమిషన్ దాదాపు 16 నెలల పాటు అధ్యయనం చేసింది. తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ నిర్మాణం మార్చడం పూర్తిగా తప్పు అని కమిషన్ తేల్చింది. 'నివేదికపై రానున్న రోజుల్లో అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకున్నాక ప్రభుత్వం ముందుకు వెళుతుంది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.చట్టసభల్లో చర్చించాక భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని, కమిషన్ తన నివేదికలో చేసిన సూచనలను అమలు చేస్తామని సిఎం చెప్పారు.

మరోవైపు ఈ ప్రాజెక్టు విషయంలో ఎటువంటి తప్పూ జరగలేదని బీఆర్ఎస్ ప్రకటించింది.'కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యం లేదు.అన్ని అంశాలు డిపిఆర్‌లో ఉన్నాయి.11 కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయి. ఒక ప్రాజెక్టుకు కావాల్సిన అన్ని అనుమతులు వచ్చాయి. మరి కమిషన్ ఎవరిని తప్పుబడుతుంది? కేంద్రం, అనుమతులు ఇచ్చిన ఏజెన్సీలను కమిషన్ తప్పుబడుతుందా?' అని హరీశ్ రావు ప్రశ్నించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు,కమిషన్ వక్రీకరణలు,వాస్తవాలు అనే అంశంపై హరీష్ రావు ప్రజంటేషన్ ఇచ్చారు. అయితే ప్రాజెక్టుకు సంబంధించిన అనేక తప్పులను కమిషన్ గుర్తించింది.తీవ్రవిమర్శలు చేసింది. అనేక లోటుపాట్లను ఎత్తి చూపింది.



తీవ్రమైన ఆర్థిక అవకతవకలను, ప్రణాళిక లేకపోవడాన్ని, నిర్మాణంలో లోపాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ అసలు లేకపోవడాన్ని గుర్తించింది. కీలకమైన రాజకీయ నాయకులు, అధికారులు బాధ్యులని ఎత్తి చూపింది. ముఖ్యంగా అప్పటి ముఖ్యమంత్రి వ్యవస్థలను, ప్రొసీజర్లను పక్కన పెట్టి ప్రత్యక్షంగా ఎలా జోక్యం చేసుకుని,ప్రభుత్వ ఖజానాకు, బ్యారేజీల ప్రస్తుత స్థితికి కారకులయ్యారో తన నివేదికలో కమిషన్ వివరించింది. 'ప్రాణహిత చేవెళ్ళ సుజల స్రవంతిగా రూ. 38,500 కోట్ల అంచనా ఉండగా, కాళేశ్వరం ఖర్చు 2016 నాటికి రూ. 71,436 కోట్లకు పెరిగింది. తరువాత 2022 మార్చి నాటికి లక్షా 10 వేల 248 కోట్ల రూపాయలకు (1,10,248.48) పెరిగింది.ఈ మొత్తం ప్రాజెక్టు మితిమీరిన, బెరకులేని తీవ్రమైన ప్రొసీజరల్, ఆర్థిక పరమైన అవకతవకలతో నిండిపోయింది. వాప్కోస్ సంస్థకు ఇచ్చిన 6 కోట్ల 77 లక్షలు అధికారుల నుంచి వసూలు చేయాలి.మేడిగడ్డ బరాజ్ నిర్మాణంలో ఖర్చు పెట్టిన భారీ మొత్తాన్ని కుట్ర పూరితంగా స్వాహా చేయడంలో అధికార యంత్రాంగం, కాంట్రాక్టరు కలసి మెలసి పనిచేశార''ని నివేదిక వ్యాఖ్యానించింది.మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాధన దుర్వినియోగం చేసే సాధనంగా మిగిలింది. అంతేకాదు, పరిపాలన ప్రణాళిక,సాంకేతిక ముందుచూపు,ఆర్థిక క్రమశిక్షణ వంటి వైఫల్యం, వాటిలో అసవరంలేని వ్యక్తిగత నిర్ణయాలు,రాజకీయ జోక్యం ఉన్నట్టు తేలిపోయింది.

బిఆర్ఎస్ పార్టీ తమ ఘన విజయాల్లో ఒకటిగా చెప్పుకునే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ఈ మేడిగడ్డ బరాజ్ సరిగ్గా ఎన్నికల ముందు కుంగడంతో చర్చ మొదలైంది. కాళేశ్వరం ఒక అద్భుతమని, ప్రపంచంలోనే పెద్దదని బిఆర్ఎస్ చెప్పుకుంటు వచ్చింది.ఈ ఒక్క బరాజ్‌కే సుమారు రూ.1850 కోట్లు ఖర్చు అయింది. 16 టిఎంసిల నీరు ఇందులో నిల్వ ఉండే ఏర్పాటు ఉంది. 85 గేట్లు ఉంటాయి. రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టు పూర్తి చేసినట్టు నిర్మాణ సంస్థ ప్రకటించుకుంది. అదొక గొప్ప విషయంగా కూడా ప్రచారం చేశారు. ఎత్తిపోతలకు అయ్యే విద్యుత్తు చార్జీలు రూ.10,374.56 కోట్లు, నిర్వహణ ఖర్చులు రూ.272.70 కోట్లు కలిపి రూ. 10647.26 కోట్లు అవుతుందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. అయితే సుమారు లక్ష కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్ట్‌కు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణం రూ. 64.204.13 కోట్లుగా ఉన్నది.వడ్డీలు సకాలంలో చెల్లించకుండా వాయిదా వేయడంతో అదనంగా మరో రూ.19,556.4 కోట్ల వడ్డీ అసలులో కలిసింది. దీంతో అసలు రూ.87,369.89 కోట్లు అయింది. దీనికి వాయిదాలుగా ప్రతి ఏటా వడ్డీ, అసలు కింద రూ.10 వేల కోట్ల నుంచి 14 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని కాగ్ తెలిపింది. దీంతో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ ప్రభుత్వానికి భారంగా మారనున్నది. పైగా ఈ ప్రాజెక్ట్‌కు తెచ్చిన అప్పులు తీర్చడం కోసం కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని కాగ్ హెచ్చరించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను ఆనాటి సిఎం కెసిఆర్ 2019 జూన్ 21న ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర, ఎపి సిఎంలను ఆహ్వానించారు. అట్టహాసంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్ట్ బరాజ్‌లు అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నాయి. ఆర్‌సిసి వేసిన కోట్, సీసీ కర్టెన్ గోడలలో కొంత బాగం, దిగువ భాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాక్‌లు కొట్టుకు పోయాయి. దీనివల్ల మేడిగడ్డ బరాజ్‌కు రూ.83.83 కోట్లు, అన్నారం 65.32 కోట్లు, సుందిళ్ల బరాజ్‌కు రూ.31.24 కోట్లు మొత్తంగా రూ.180.39 కోట్ల నష్టం వాటిల్లింది. కేవలం డిజైన్ లోపం, లోపభూయిష్టంగా చేపట్టిన పనుల కారణంగానే నష్టం జరిగిందని కాగ్ భావించింది.

కాగా ఘోష్ కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో కెసిఆర్ 'వాంగ్మూలాన్ని' స్థూలంగా చెప్పాలంటే అధికారులు,సాంకేతిక నిపుణులే అన్నింటికీ బాధ్యులు.ఆయన ముఖ్యమంత్రిగా ఆ ప్రాజెక్టు నిర్మించాలని మాత్రమే పూనుకున్నారు. కానీ ఆయన వాంగ్మూలానికి,జరిగిన వాస్తవాలకు చాలా తేడా ఉన్నది. కెసిఆర్‌కు తెలియకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో చీమ కూడా కుట్టలేదు.అంతా తానే అయి 'పని పూర్తి చేశారు'. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కుడితిలో పడ్డ ఎలుకలా ఆయన పరిస్థితి మారిపోయింది.ఫోన్ ట్యాపింగ్,కాళేశ్వరం వంటి పలు కేసులు కెసిఆర్‌ను వెంటాడుతున్నవి.ఆయన, ఆయన పార్టీ పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయింది.అటు తన కూతురు ఎమ్మెల్సీ కవిత, పార్టీకి పోటీగా నడుపుతున్న 'సామాజిక తెలంగాణ' కార్యక్రమాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నవి.

# వలస పాలకుల గుండెల్లో దడ పుట్టించిన 'క్విట్ ఇండియా'

రెండవ ప్రపంచ యుద్ధం ఒకవైపు భారత స్వాతంత్ర్య పోరాటం మరో వైపు ఉన్నత స్థాయిలో జరుగుతున్న రోజులవి. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 08 ఆగస్టు 1942 రోజున బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ తీసుకున్న తీర్మానం ప్రకారం క్విట్ ఇండియా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడింది. ఆగస్టు ఉద్యమం లేదా ఆగస్టు క్రాంతి లేదా భారత్ ఛోడో ఆందోళన్ అనే పేర్లతో కూడా క్విట్ ఇండియా ఉద్యమాన్ని నినాదాలుగా పిలిచారు. క్విట్ ఇండియా అంటూ మహాత్మాగాంధీ బ్రిటీష్ పాలకుల గుండెలు అదిరే విధంగా గళమెత్తడమే కాకుండా స్వాతంత్ర్య సాధనకు డూ ఆర్ డై (సాధించు లేదా మరణించు) అంటూ సామాన్య ప్రజల్లో స్వాతంత్ర్య జ్వాలలు రగల్చగలిగారు. పట్టణాలు, పల్లెల ప్రజలు కూడా క్విట్ ఇండియా అంటూ అహింసాయుత బాటలో ముక్త కంఠంతో గొంతులు ఎత్తడంతో వలస పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తడం ప్రారంభమైంది. క్రిప్స్ మీషన్ వైఫల్యం, భారతీయుల్ని అమానవీయంగా చూడడం, ఈస్ట్ బెంగాల్ ప్రాంతంలో తీవ్ర అస్థిరత, దేశవ్యాప్తంగా ఆకలి పోరాటాలు, వలస పాలకులు పాలనపై అపనమ్మకం లాంటి పలు కారణాలు కూడా క్విట్ ఇండియా ఉద్యమానికి ఆజ్యం పోశాయి.

### వీర మరణమో లేదా స్వాతంత్ర్య సాధనో అంటూ సాగిన పోరు :

క్విట్ ఇండియా ఉద్యమానికి ప్రధాన నినాదంగా డూ ఆర్ డై అనే స్వాతంత్ర్య రెండు పదాల మంత్రం భారతదేశవ్యాప్తంగా వ్యాపించిన వేళ స్వాతంత్ర్య సమరయోధులతో పాటు ఇతర పెద్దలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం పోరాటానికి గళం కలిపి దేశ ఐక్యతను చాటడంతో తెల్లతోలు పాలకులు భయకంపితులి కావడం జరిగింది. ఈ పోరాటాన్ని అణచి వేయడానికి పోలీస్ బలగాలు రంగ ప్రవేశం చేసి పలువురు ప్రముఖ నాయకులను అరెస్టు చేయడం జరిగింది. పౌర సహాయనిరాకరణ, పౌరుల్లో ధైర్యం, ప్రజల త్యాగం, దేశ స్వాతంత్ర్య భావనలు, జాతీయ అంచర్జాతీయ గుర్తింపు పౌర సమాజ భాగస్వామ్యం ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశ సార్వభౌమాధికారం, దేశభక్తి, రేపటి యువతరం ప్రేరణ, పెద్ద ఎత్తున నిరసనలు జరగడానికి క్విట్ ఇండియా స్ఫూర్తి పని చేసింది. 1947లో స్వాతంత్ర్యం రావడానికి క్విట్ ఇండియా ఉద్యమ ఘట్టం ప్రధాన కారణంగా నిలిచింది. 08 ఆగస్టు రోజున పాటిస్తున్న క్విట్ ఇండియా ఉద్యమ దినంలో భాగంగా విద్యాలయాల్లో అవగాహనలు, రేపటి తరానికి ప్రేరణాత్మక కార్యక్రమాలు, క్విజ్‌పోస్టర్‌ఉపన్యాస పోటీలు, పోరాటానికి




సంబంధించిన సినిమాల ప్రదర్శనలు, చర్చలు, పోరులో అమరత్వ పొందిన వారికి నివాళులు అర్పించడం, సాంస్కృతిక పోటీలు, సామాజిక మాధ్యమ ప్రచారాలు, ప్రభుత్వ సంస్థల కార్యక్రమాలు లాంటివి నిర్వహించవచ్చు. వీర మరణమే లేదా స్వాతంత్ర్య సాధనో జరిగే వరకు ఈ పోరాటం ఆగదని బ్రిటీష్ పాలకులకు స్పష్టం చేయగలిగినా క్విట్ ఇండియా ఉద్యమం భారత దేశ స్వేచ్ఛ పోరులో ఒక ప్రధాన ఘట్టంగా నిలవడం జరిగింది.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత

# ఆరోగ్య కార్డులకు మోక్షమెప్పుడు?

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను పంపిణీ చేయాలి. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగులకు,పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు, జర్నలిస్టులకు జారీ చేసిన హెల్త్ కార్డులు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లలో ఎక్కడ పని చేయడం లేదు. అనారోగ్యానికి గురైనప్పుడు ఆసుపత్రులకు వెళ్లి హెల్త్ కార్డులు చూపిస్తే ఇవి దేనికీ పనికి రావని, డబ్బులు చెల్లించి రీయింబర్స్‌మెంట్ చేసుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఐదు లక్షలు, పది లక్షలు, ఇరవై లక్షలు ఇంకా అధిక మొత్తలలో ఎంత డబ్బు ఖర్చు పెట్టి వైద్యం చేపించిన ప్రభుత్వం మాత్రం రెండు లక్షల రూపాయల లోపే రీయింబర్స్‌మెంట్ కింద మంజూరు చేస్తున్నారు. మంజూరు అయిన డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీ ఉందని సంవత్సరాలు, సంవత్సరాలు గడిచినా రావడం లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన లక్షలకు, లక్షలు ఫీజులు కట్టాల్సి వస్తుంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులు లేకపోవడం వల్ల ఒంటి మీది బంగారాన్ని అమ్మడం, పర్సనల్ లోన్‌లు తీసుకోవడం,అధిక మొత్తాల్లో అప్పులు చేయడం వల్ల మానసిక క్షోభకు గురౌతున్నారు.

### హరీశ్‌రావు వాగ్ధానం హుళక్కి

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, గెజిటెడ్ అధికారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రిగా చేసిన హరిష్ రావు గారిని కలిసి నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు. పిఆర్‌సి కమిటీ రికమండేషన్ చేసినట్లు బేసిక్ పే నుంచి ఒక్క శాతం హెల్త్ స్కీం కింద ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని లేకపోతే రెండు శాతం బేసిక్ పే నుంచి ఇస్తామని అనగానే పూర్వ వైద్య శాఖ మంత్రి రేపే ప్రైవేట్ ఆసుపత్రులలో, స్పెషాలిటీ హాస్పటల్ లలో, సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ లలో హెల్త్ స్కీం కింద ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు నగదు రహిత వైద్యాన్ని అందిస్తామని అన్నారు. పూర్వ వైద్య శాఖ మంత్రి హరిష్ రావు గారు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. తెలంగాణ రాక ముందు జారీ చేసిన ఆరోగ్య కార్డులు అనారోగ్య కార్డులుగా మారాయి. అవే కార్డులు ముఖ్యమంత్రి ముఖ చిత్రం మారి వస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు ఫ్రెండ్లీ ప్రభుత్వం.. ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేయలేదు. ప్రస్తుత రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చి విద్యా, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదరం రాజ నరసింహ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర కేబినెట్ లోనూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య కా




ర్డులను జారీ చేస్తామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సంబర పడ్డారు.ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి వేతనం నుండి ఒక శాతం కార్పస్ ఫండ్ కింద ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. నగదు రహిత ఆరోగ్య కార్డుల వ్యవహారం మూడు అడుగుల ముందుకు ఆరు అడుగుల వెనుకకు అన్న విధంగా మారింది. అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు అదిగో నగదు రహిత ఆరోగ్య కార్డులు వస్తున్నాయి.ఇదిగో ఆరోగ్య కార్డులు వస్తున్నాయి అని ప్రతి సమావేశంలో అంటున్నారు కానీ అమలు కావడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదనను, ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం అంటూ అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తారనే ఆశాభావంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఉన్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
9290826988

# మ్యావ్... మ్యావ్...పిల్లి

నేడు ప్రపంచ పిల్లుల దినోత్సవం

పిల్లికి చెలగాటం.. ఎలుకకు ప్రాణసంకటం. పిల్లి కళ్ళు మూసుకొని పాలు తాగుతూ తనను ఎవరూ గమనించలేదనుకొనిందట. పొయ్యిలో నుండి పిల్లి లేవలేదు తదితర సామెతలను నిత్యజీవితంలో వాడుతుంటాము. బయలదేరే ముందు పిల్లి ఎదురైతే అపశకునంగా భావిస్తాము. ఇంతకు ఇప్పుడు ఈ పిల్లలు గోల ఎంటా అనుకుంటున్నారా... అదేనండి ఆగస్టు 8న ప్రపంచ పిల్లుల దినోత్సవం. పిల్లి లేదా మార్జాలం కార్నివోరా క్రమానికి చెందిన చిన్న క్షీరదము. దీని శాస్త్రీయ నామం ఫిలస్ కాటస్. దీనిని పెంపుడు పిల్లి అని కూడా అంటారు. వీనిని మానవులు పురాతన కాలం నుండి సుమారు 9,500 సంవత్సరాలుగా పెంచుకుంటున్నారు. పిల్లులు పాములు, తేళ్ళు, ఎలుకలు మొదలైన సుమారు 1,000 పైగా జాతుల జీవాలను వాటి ఆహారం కోసం వేటాడడంలో మనకు తోడుగా ఎంతో సహాయం చేస్తాయి. ఇవి చాలా సులభంగా మనం చెప్పిన వాటిని నేర్చుకుంటాయి. ఇవి మియావ్ మొదలైన వివిధ శబ్దాలతో ఇతర పిల్లులతో సంభాషిస్తాయి. అమెరికాలో 69 మిలియన్ పిల్లులు పెంపుడు జీవులుగా ఉన్నాయి. కుక్కల తర్వాత రెండవ స్థానంలో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇవి మొదటి స్థానంలో 600 మిలియన్ ఇండ్లలో పెంచుకోబడుతున్నాయి. తల్లి పిల్లి తన పిల్లలను తన తండ్రికి కనిపించకుండా అవి కొంచెం బాగా తిరగగలిగే వరకు ఒకే దగ్గర ఉండకుండా వేరు వేరు ప్రదేశాలు మారుతూ వాటికి రక్షణ కల్పిస్తాయి. పిల్లి పిల్లలు తమ తండ్రికి కనిపించాయంటే మెడ కొరికి చంపేస్తాయి. తల్లి పిల్లి వాటి పిల్లలను ఎప్పుడూ శుభ్రంగా ఉండేవిధంగా నాలుకతో వాటి శరీరాన్ని శుభ్రం చేస్తుంటాయి. అంతర్జాతీయ పిల్లి దినోత్సవాన్ని మొదటగా 2002లో కెనడాకు చెందిన అంతర్జాతీయ జంతు సంక్షేమ నిధి ప్రారంభించింది. ఈరోజు పిల్లిని రక్షించే మార్గాలు, పిలుల్ని దత్తత తీసుకోవడం మొదలైన అంశాలపై అవగాహన కల్పిస్తారు. పిల్లుల్ని మనదేశంలో పెంచుకోవడానికి పెద్దగా మొగ్గ చూపరు కానీ చాలా దేశాల్లో పిల్లిని ఎంతో ప్రేమగా పెంచుకుంటారు.

కొందరు పిల్లి ఎదురు వస్తే అపశకునంగా భావిస్తారు. వెళ్లిన పని



కాదని నమ్ముతారు. అందులోనూ నల్లపిల్లి ఎదురువస్తే ఇక ఆ పని జరిగినట్లే అని బలంగా నమ్ముతారు. అయితే ఈజిప్షియన్లు మాత్రం పిల్లుల్ని దేవుళ్లుగా భావించేవారట. వారి రాజవంశం కూలిపోయిన తరువాత పిల్లులు ప్రతి చోట ప్రాచుర్యం పొందాయి. గ్రీకులు, రోమన్లలో ధనవంతులు వద్ద పిల్లులు ఉండేవి. అయితే మధ్య యుగంలో ఐరోపాలో పిల్లులపై మూఢ నమ్మకాలు బయలుదేరాయి. 1348 నుంచి 1600 వరకు ప్లేగుకు ఎలుకలు, పిల్లులు కారణమని పిల్లుల్ని చంపడం మొదలుపెట్టారట. రెండు కానీ అంతకంటె ఎక్కువ గానీ తెల్లని పిల్లులు ఇంట్లోకి ప్రవేశిస్తే, ఆ ఇంటివారికి త్వరలో దరిద్రబాధలు, అనారోగ్యాలు, చిక్కులు సంప్రాప్తిస్తాయట పెంపుడు పిల్లి ఇల్లు వదిలిపోతే ఇంటిలోని అదృష్టం కూడా దానితోనే పోతుందట వెన్నెల్లో నల్లపిల్లి కనబడితే, ఆ ప్రాంతంలో ఏదో ఒక అంటువ్యాధి ప్రబలుతుందనడానికి సూచిక. (ఐరిష్ ప్రజల నమ్మకం) పిల్లిని మోసుకుని ఏరును దాటితే జీవితాంతం దురదృష్టం వెన్నంటి ఉంటుందట (ఫ్రెంచి వారి హెచ్చరిక) పిల్లి తన పాదాలను శరీరం కింద ముడుచుకొని నిద్రపోతే, అది వర్షం వస్తోందనడానికి సూచికట పిల్లి ఒకసారి తుమ్మితే వర్షం వస్తుందనీ, మూడుసార్లు తుమ్మితే ఆ గృహంలోని వారందరికీ జలుబు చేస్తుందనీ ఓ విశ్వాసం సింహద్వారం దగ్గర పిల్లి ముఖం శుభ్రం చేసుకుంటే, ఆ ఇంటికి మతాచార్యులు వస్తారని అమెరికన్ల విశ్వాసం.

పిల్లి మీద ఎన్ని వెటకారాలు, చిన్నచూపులు, ఈసడింపులు ఉన్నా, పిల్లల్ని రక్షించుకోవడంలో పిల్లి తరవాతే ఏ జంతువైనా. అందుకే మార్జాలకిశోర న్యాయం అనే జాతీయం పుట్టుకొచ్చింది. పిల్లి తను పెట్టిన పిల్లల్ని ఒక ఇంటి నుంచి మరొక ఇంటికి మార్చేటప్పుడు చాలా జాగ్రత్తగా నోట కరచుకొని తీసుకువెడుతుంది. పిల్లలకు ఎక్కడా కష్టం కలగకూడదనేది పిల్లి ఉద్దేశం. అంతేనా నవరత్నాలలో ఉండే వైడూర్యాన్ని క్యాట్స్ ఐ అంటే పిల్లి కన్ను అంటారు. పిల్లి కన్ను రత్నమైతే, పిల్లి కూడా రత్నమే కదా! పిల్లులు రోజుకు 13 నుంచి 16 గంటల పాటు నిద్రపోతాయి. ఎందుకంటే వాటి శరీర ఎదుగుదలకు అవసరమయ్యే హార్మోన్ నిద్రపోయినప్పుడే విడుదలవుతుంది.ఆడ పిల్లులు ఎక్కువగా కుడి చేతి వాటాన్ని, మగపిల్లులు ఎడమ చేతి వాటాన్ని కలిగివుంటాయి. పిల్లులు వంద రకాలుగా అరవగలవు.పిల్లుల ఒంటిమీద ఉండే బొచ్చు నీటిలో తడిస్తే... అంత త్వరగా ఆరదు. అందుకే పిల్లులు నీటిలోకి వెళ్లడానికి ఇష్టపడవు.పిల్లి గుండె నిమిషానికి 110 నుంచి 140 సార్లు కొట్టుకుంటుంది. వీటికి శుభ్రం చాలా ఎక్కువ. మెలకువగా ఉండేదే తక్కువ అంటే... ఆ సమయంలో ఎక్కువశాతం తమను తాము శుభ్రం చేసుకోవడానికే వినియోగిస్తాయి. భూకంపాలు, సునామీల వంటి ఉత్పాతాలను సంభవించడానికి పదిహేను నిమిషాల ముందే పసిగట్టేస్తాయి.వీటి నాలుక మీద ఉండే రుచి మొగ్గలకు తీపిని గుర్తించే శక్తి లేదు.ఇవి చీకట్లో కూడా స్పష్టంగా చూడగలవు. పుట్టినప్పుడు చాలా పిల్లుల కళ్లు నీలి రంగులోనే ఉంటాయి. కాలం గడిచేకొద్దీ అవి రంగు మారతాయి. మనుషుల్ని వేలిముద్రల ద్వారా గుర్తించినట్టు, పిల్లుల్ని ముక్కు ముద్రలతో గుర్తించవచ్చు. ఎందుకంటే ఏ రెండు పిల్లుల ముక్కూ ఒకలా ఉండదు.ఎంత ఎత్తుమీది నుంచి పడినా పిల్లి ముందు తన పాదాలనే ఆన్చుతుంది తప్ప పొరపాటున కూడా దాని తల నేలకు కొట్టుకోదు. వాటి శరీర నిర్మాణంలోని ప్రత్యేకత వల్ల అలా జరుగుతుంది. మనుషుల్లాగే పిల్లులకూ కలలు వస్తాయి. వారం రోజుల పిల్లగా ఉన్నప్పటి నుంచీ ఇవి కలలు కంటాయట.పిల్లుల ఘ్రాణశక్తి మనుషుల కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వీటి నోటిలోపల పైభాగంలో జాకబ్సన్స్ ఆర్గాన్ అనే ఒక అవయవం ఉంటుంది. ముక్కుతో పాటు ఇది కూడా వాసన చూసేందుకు ఉపయోగడపడుతుంది.

## పెబ్బేరు పిహెచ్‌సిలో కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చాలా కాలం తర్వాత వైద్యశాఖ కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాలు ప్రకారంగా పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 48 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా ఆప్తమా లిక్ ఆఫీసర్ రఘునందన్ , పెబ్బేరు మండలం పరిధిలోని కంటి పొరలు వ చ్చిన వారు , కంటి చూపు కనబడని వారు 26 మందిని గుర్తించి , వారికి వనపర్తి జిల్లాలో ఉన్న గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ కు పంపిస్తామని మండల వైద్యాధికారి డా.ప్రవళిక తెలిపారు. ఈకార్య క్రమంలో హెల్త్ సూపర్వైజర్ లీలమ్మ, స్వరూపరాణి, హెల్త్ అసిస్టెంట్ రా జశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ గౌడ్ , ఆశ కార్యకర్తలు పాల్గొన్నా రు.

## గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఫుడ్ ఇన్స్పెక్టర్ మౌనిక ఆకస్మిక తనిఖీ చేశారు. సామాగ్రి నాణ్యతను తనిఖీ చేశారు. వంట సిబ్బందిని అప్రాన్లు చేతి తొడుగులు ధరించినందుకు అభినందించారు. కూరగాయలను తనిఖీ చేశారు. ల్యాబ్ పరీక్ష కోసం ఆహార నమూనాలను సేకరించారు. సిబ్బందితో సంభాషించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన కఠినమైన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. మైనారిటీ గురుకుల పాఠశాల సొసైటీ ప్రధాన కార్యాలయం నుండి షీటీం విజిలెన్స్ అధికారి జమీర్‌తో కలిపి మైనారిటీ జూనియర్ కళాశాల మక్తల్ గర్ల్స్ 1 ని సందర్శించారు. వారు విద్యార్థులు సిబ్బందితో సంభాషించారు. పేద నేపథ్య విద్యార్థులకు వివిధ స్కాలర్ షిప్‌లను వివరించారు. అడ్మిషన్లు, విద్యార్థుల విద్యా పనితీరు గురించి ఆరా తీశారు. చివరగా పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

## మహిళలకు వడ్డీలేని రుణాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మహిళలు ఆర్థికంగా ఎత్తుకు ఎదిగేందుకు వడ్డీలేని రుణాలను ఐకెపిద్వారా అందిస్తున్నామని జిల్లాప్రాజెక్టు అధికారి భాషానాయక్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తిద్వారా వారి ఆర్థికాభివృద్ధికి వివిధ పథకాలు అందిస్తున్నామన్నారు. వడ్డీలేని రుణాలు 2025–26మార్చి నాటికి సంవత్సరానికి 830 సంఘాలకు గాను రూ.30కోట్ల50లక్షల వడ్డీలేని రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 49 సంఘాలకు రూ.3కోట్ల56లక్షలు ఇప్పటికే ఇప్పించామన్నారు. మిగిలిన మహిళా సంఘాలకు రూ.27కోట్ల రూపాయల ను వచ్చే 2025–26 ఆర్థిక సంవత్సరంలో పూర్తిగా ఇప్పిస్తామని తెలిపారు. అంతేకాకుండా దీనిలో భాగంగా మహిళలు సొంతంగా స్వయంగా చిరువ్యాపారాలు పెట్టుకొని లాభపడాలని తెలిపారు. 12సంవత్సరాలనుండి 18 సంవత్సరాలలోపు ఉన్నవారినికూడా మహిళా సంఘాలలో చేర్చుకొని వారివిద్య కోసం సహకారం లభిస్తుందని తెలిపారు. సంఘంలో సభ్యులై ఉన్నవారికి 270సభ్యులకు వ్యక్తిగత చిరువ్యాపార రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నర్వ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గురువారం నర్వ మండల పరిధిలోని ఉందెకోడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా పిడి శంకర్ , నర్వ మండల యంపిడిఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఎఈ, వినయ్, గ్రామపంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.కొండప్ప, సి.నాగప్ప గౌడ్, రామలింగం, బి.నరసింహ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైఆర్జికేర్ సంస్థ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు

**ప్రజాపక్షం/ కొత్తపల్లి :** మండల పరిధిలోని భూనిడ్ గ్రామంలో గురువారం రోజు రైతు వదిక దగ్గర వైఆర్జికేర్ ఆధ్వర్యంలో ఐహెచ్‌సి ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించారు.ఈ క్యాంపుకు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలకు రక్తపరీక్షలు,టీబి పరీక్షలు,ఎక్స్‌రే పరీక్షలు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు.ఈ క్యాంపులో మొత్తం 100 మందికి టెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో వైఆర్జికేర్ సంస్థ డిఆర్‌పి శ్రీకాంత్ రెడ్డి,జోనల్ సూపర్ వైజర్ కృష్ణ ,ఆశ వర్కర్లు,ఎన్జివొ సిబ్బంది డాక్టర్లు ఎఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి మొక్కల పంపిణీ



**ప్రజాపక్షం/ కృష్ణ :** రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి, ఆకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమం నేడు కృష్ణ మండలం హిందూపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఇంటిని తలపించేలా మైనారిటీ స్కూల్ నిలవాలి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ . ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించి సొంత ఇంటిని తలపించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం నారాయణపేట లోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ వంటగది, సరుకుల గదిని, విద్యార్థులు నిద్రించే గదులను తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన కామన్ డైట్ మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి విద్యార్థులను భోజనం ఎలా ఉంది స్నాక్స్ లో ఎం ఇస్తారు. తదితర ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ అధికారి రషీద్, ప్రిన్సిపాల్ ఖాజా మెహబూబ్ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రెవెన్యూ అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి గురువారం జిల్లా కేంద్రంలోని ఎం.వి.ఎస్ డిగ్రీ కాలేజీ దగ్గర గల ఎస్‌సి కాలేజ్ బాయ్స్ హాస్టల్ బిను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంట గది, డైనింగ్ హాల్, విద్యార్థులు గదులు, బాత్రూమ్‌లను పరిశీలించారు. మెనూ ప్రకారం అందించే భోజన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతను పరిశీలించారు. తర్వాత అదనపు కలెక్టర్ హాస్టల్‌లోని లైబ్రరీని సందర్శించి, అందులోని పుస్తకాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను విద్యార్థులు వినియోగించుకోవాలని. చదువు పై దృష్టి పెట్టి బాగా చదువుకొని జీవితంలో స్థిరపడి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు.



# జలసంద్రమైన జడ్చర్ల

**రోడ్ల పైకి వచ్చిన వర్షపు నీరు**

**నేతాజీ చౌరస్తా సిగ్నల్ గడ్డ ట్రాఫిక్ జామ్ ఇబ్బందుల్లో విద్యార్థులు**

**పట్టించుకొని పాలకులు, అధికారులు**



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణం మండల పరిధిలోని వివిధ గ్రామాలు జలమయంగా మారిపోయాయి. గురువారం నాడు సాయంత్రం కుండపోతుగా వర్షం మేగదాటిపై రావడంతో జడ్చర్ల పట్టణంలోని వివిధ ప్రాంతాలలో మురికి కాలువలు నుండి రోడ్లపై, నీరు ప్రవహించి ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించిపోయాయి. మరికొన్ని ప్రాంతాలలో రోడ్లపై నీరు ప్రవహిస్తున్నడంతో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. పట్టణంలో నేతాజీ చౌరస్తా నుంచి సిగ్నల్ గడ్డ వెళ్లే రహదారిపై నల్లకుంట నీవు వై గడ్డ ప్రాంతాల నుంచి వస్తున్న మురికి నీరు మొత్తం రోడ్లపై చేరుకోవడం తో కార్లు మునిగిపోయాయి. వనపర్తి, నాగర్‌కర్నూల్ వెళ్లే ఆర్టీసీ బస్సులు సైతం నీటి ఉధృతికి కదిలిన స్థితిలో రోడ్డుపైనే నిలిచిపోవడంతో పాఠశాలలు కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో విద్యార్థులు స్థితిలో కొట్టుమిట్టాడుతూ వర్షం దాకిడికి బయటికి వెళ్లలేక హోటళ్లు చుట్టుపక్కల ప్రాంతాల దుకాణాలకు వెళ్లి తలదాచుకున్నారు. అదే విధంగా పట్టణంలోని నల్లకుంట, రాజీవ్‌నాగర్ కాలనీ, సిగ్నల్ గడ్డ గౌరీ శంకర్ కాలనీ పాత బజార్ తెలుసందించాలని బస్టాండు పద్మావతి కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయం హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాలలో వర్షపు నీటికి మురికి రోడ్లపై ప్రవహించడంతో పాటు ఇళ్లల్లోకి నీరు చొరబడింది. ఇంత జరుగుతున్న పాలకవర్గం ఇతర అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక పర్యాయాలు ఇలాంటి సంఘటనలు ఎదురైనా తూతూ మంత్రంగా అప్పటికప్పుడు చర్యలు తీసుకుని నీటి ఉధృతిని ఆపిని తరచూ ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్న అధికారుల్లో ప్రజాప్రతినిధులలో ఎలాంటి రాకపోవడం దురదృష్టకరమని పట్టణ ప్రజలు బాధ వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని గంగాపూర్ నెక్కొండ చర్లపల్లి నర్సిల్లాబాద్ తంగేళ్లపల్లి మీ నెంబర్ అల్వంపల్లి తదితర ప్రాంతాలలో వర్షం వల్ల అనేక మంది తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరికొందరు పంటలు, మార్కెట్‌కు తెచ్చిన ధాన్యాలు కూరగాయాలు మార్కెట్‌లో కూరగాయలు వర్షపు నీటికి కొట్టుకొనిపోయాయి. వర్షాల వర్షాలు తగిడివల్ల అనేక మంది తీవ్రంగా నష్టపోయినట్టు పట్టణంలో కామ గ్రామీణ ప్రాంతాలలో చేసి జరుగుతుంది తమను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని అనేకమంది డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాజీవ్ నగర్ కాలనీలో అనేక ఇల్లు నిలబడ్డమాయ్యయి దాంతో పలువురు పక్కనే ఉన్న పాఠశాలలకు వెళ్లి తలదాచుకున్నారు. మరికొన్ని ప్రాంతాలలో వర్షానిరి మొత్తం తడిసిపోవడంతో విద్యుత్ షాక్ ఏర్పడినట్టు సమాచారం ఉంది.

## ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతర పోరాటాలు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** గ్రామాలు పట్టణాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం నాడు జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా స్థాయి మహాసభలు ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా నేతలు బృంగి బాలకిషన్, పరమేశ్వర్ గౌడ్, బాగీ కృష్ణయ్య, తదితరులు మాట్లాడుతూ ఈ నెల 5,6 తేదీలలో జడ్చర్ల పట్టణంలో గౌడ ఫంక్షన్ హాల్ నందు జరిగిన మహబూబ్‌నగర్ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా 23వ మహాసభలను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. అనంతరం మహాసభల్లో ప్రజా సమస్యలపై తీర్మానాలు ఆమోదించడం జరిగింది. మొదటి తీర్మానంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించాలని రెండవది పాలమూరు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా అగ్రికల్చర్ ఆ కోర్సులను ప్రవేశపెట్టాలని మూడవది మాచర్ల టు గుంటూరు రైల్వే లైన్ వెంటనే కేంద్రంతో ఒప్పించి నిర్మాణం చేపట్టాలని, నాల్గవ తీర్మానంగా ఈ ప్రాంతంలో పరిశ్రమల్లో పనిచేస్తున్నటువంటి అన్ని రంగాలలో కార్మికులకు పని గంటలు పెంచే 282 జీవోను వెంటనే ఉపసంహరించాలని నాలుగు తీర్మానాల్ని ఆమోదించడం జరిగింది.

## విద్యుదాఘాతానికి రైతు బలి

**ప్రజాపక్షం / అమరచింత :** 15 రోజుల క్రితం పొలంలో విద్యుత్ పోల్ విరిగి పడినా, దాని వైర్లను తొలగించకపోవడంతో విద్యుత్ ఘాతం సంభవించి ఓ నిండు ప్రాణం బలైన ఘటన గురువారం వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని మస్తీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామ శివారులోని ఓ రైతు పత్తి పొలంలో కలుపు మొక్కలను తొలగించేందుకు గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో తిరుపతయ్య (50) అనే కూలి రైతు దున్నెందుకు వెల్లాడు. పొలంలో విరిగి పడి ఉన్న విద్యుత్ పోల్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గత 15 రోజులుగా విద్యుత్ స్తంభం విరిగిపడిందని విద్యుత్ శాఖ అధికారులను తొలగించాలని విన్నపించిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన రైతు కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారంతో పాటు విద్యుత్ ఎఇ సంబంధిత లైన్మెన్‌ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి ఆత్మకూర్ ఎస్ఐ నరేందర్ , ట్రైనింగ్ ఎస్ఐ హిమబిందు, ఏఎస్ఐ రాములు ట్రాన్స్కో ఎస్ఐ మదన్‌తో పాటు పలువురు ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి డిపార్ట్మెంట్ తరపున ఐదు లక్షలు, అధికారుల నుంచి మరో ఐదు లక్షలు బాధిత కుటుంబానికి ఇప్పించడంతో పాటు మృతికి కారణమైన లైన్మెన్‌ను సస్పెండ్ చేసి చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో గ్రామస్తులు తమ ఆందోళన విరమించారు. కాగా మృతుడికి భార్య కూతురు కుమారుడు ఉన్నారు. అమరచింత ఇంచార్జీ ఎస్ఐ హిమబిందు, హెడ్ కానిస్టేబుల్ రాములు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



# ఎంఆర్‌పికి మించి అమ్మకాలు చేస్తే చర్యలు

**జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్**



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఎరువుల విక్రయాలలో సరైనపత్రాలు అందుబాటులో లేనందున అధికారులపై జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల్లో ఎరువుల బస్తాల్ని ఎమ్మార్పీ ధరల కన్న అధికధరలకు అమ్మితే, రిజిస్టర్‌లో నమోదు వ్యత్యాసాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈతనిఖీలో ఎరువుల దుకాణాలవద్ద రాసిపెట్టిన నిల్వలు, షాపు, గోదాములో ఉన్న నిల్వలను పరిశీలించారు. రిజిస్టర్లలో నమోదు చేసిన ఎరువుల విక్రయ వివరాలు, నిబంధనల ప్రకారం ఉండకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. రైతుల వివరాలు రిజిస్టర్లలో సక్రమంగా లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సరైనపత్రాలు ఎందుకు అందుబాటులో ఉంచలేదని అధికారులను ప్రశ్నించారు. పత్రాలులేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కల్వకుర్తి వ్యవసాయ సహకార సంఘానికి 405 మెట్రిక్ టన్నుల యూరియాను అందించడం జరిగిందని, ఇప్పటివరకు 395మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేసినట్లు రిజిస్టర్‌లో నమోదు చేశారని, ఒక్కొ రైతుకు సరఫరాకన్న ఎక్కువ యూరియాను అదించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల బస్తాలను ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువగా అమ్మితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ధరలను పర్యవేక్షించాలని తరుచూ ఆకస్మిక తనిఖీలుచేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.డిఎపి, యూరియా, జిప్సంవంటి ఎరువుల నిల్వల పరిస్థితిని పరిశీలించారు. అమ్మిన ప్రతిబస్తా పూర్తివివరాలు రిజిస్టర్లలో నమోదుచేయాలని ఆదేశించారు. కలెక్టర్‌వెంట వ్యవసాయ సహకారసంఘం సిఇఓ వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

**అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**వంగూర్ :** ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమికవైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించివెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటి సమస్యలు అప్పుడే తీర్చాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ చిన్నఓబులేసు, కల్వకుర్తి ఆర్‌డిఓ జనార్దన్‌రెడ్డి, డిపిఓ శ్రీరాములు, పంచాయతీరాజ్ ఈఈ విజయ్, మిషన్‌భగీరథ ఈఈ సుధాకర్‌సింగ్, జిల్లాస్థాయి మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానిగుణంగా చేనేత డిజైన్‌లు రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మారుతున్న కాలాని అనుగుణంగా చేనేత కార్మికులు చేనేత ఉత్పత్తులు డిజైన్‌లు రూపొందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా గద్వాల, నారాయణపేట, అమరచింత, కొత్తకోటలు చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి గాంచినట్లు ఆమె తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కంబళ్లను, షాల్స్‌ను తయారు చేస్తున్నారని జిల్లాను కూడా చేనేత ఉత్పత్తులలో ప్రముఖంగా నిలిపేలా కొత్త డిజైన్‌లతో చేనేత వస్త్రాలు తయారు చేయాలని సూచించారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ధరించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ చేనేత వృత్తిని ప్రతి ఒక్కరూ ప్రోత్సాహించాలని, చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని ఆయన అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితారెడ్డి మాట్లాడుతూ రెడ్డి చేనేత వస్త్రాలను ధరించాలని, నేత కార్మికులకు ప్రోత్సాహం అందించాలని అన్నారు.16 మంది సీనియర్ చేనేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అందజేశారు. ఈ సమావేశంలో నేతన్న పొదుపు, భద్రత కింద 11,48,800 రూపాయలు చెక్కును చేనేత సంఘాలకు అందజేశారు.

## గువ్వలబాల్‌రాజు రాజీనామాతో వేడేక్కిన అచ్చంపేట రాజకీయాలు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వలబాల్ రాజు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడంతో నియోజకవర్గంలో రాజకీయ ఉద్ధృతి నివురుగప్పిన నిప్పులా మారింది. రాజీనామా చేసిన రెండు రోజుల్లోనే పోటాపోటీ సభలు, సమావేశాలు నిర్వహించుకున్నారు. గురువారం పట్టణానికి వచ్చిన గువ్వల బాల్‌రాజు తన నివాసంలో అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు పార్టీ ద్వారా పార్టీలో కొందరి ద్వారా జరిగిన అన్యాయం గురించి కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన సతీమణి అమల కంటతడి పెట్టి తమని కొంతమంది పూర్తిగా అన్యాయం చేసి వెనక నుంచి గోతులు తవ్వి తమ ఓటమికి కారకులయ్యారని ఏడుస్తూ చెప్పింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే గువ్వలబాల్‌రాజు తాను అంబేద్కర్‌వాది, సెక్యులర్‌వాది, నిజాయితీపరుడిని అని అయినా గుళ్లు, గోపురాలుకూడా నిర్మించానని, ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేశానని తెలియజేశారు. తనవెంట ఉన్నవారే తనకు అన్యాయం చేశారన్నారు. అదేవిధంగా ప్రస్తుతం తనవెంట ఉన్నవారికి కంటికిరెప్పలా చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా బిఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు అదే సమయంలో స్థానిక ఫంక్షన్ హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఎవరిని అడగకుండా ఎవరితో మాట్లాడకుండా తన సొంత నిర్ణయం తీసుకున్నందుకు గువ్వల బాల్‌రాజుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయన వెంట మేము ఉంటామని భ్రమపడ్డారని తాము ఉండమని బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ చేసిన అభివృద్ధియే తమకు కావాలని, పార్టీ అధిష్ఠానం ఎవరిని పంపించిన వారికి సహకరిస్తామని తెలిపారు. గతంలో గువ్వలబాల్‌రాజు ఒంటెద్దు పోకడగా ఉంటూ కార్యకర్తలపై చేసిన దమనకాండను వారు గుర్తించారు. అతను కార్యకర్తలపై దాడిచేయడంతోపాటు ఎవరిని ఎదగకుండాచేశాడని ఆరోపించారు. ఈవిషయంపై టిఆర్ఎస్ పార్టీ అధిష్ఠానానికి సమాచారం పంపించామని తెలిపారు. ఏదిఏమైన ఇరువురిమధ్య ఉద్రిక్తత వాతావరణంలో రాజకీయం నడుస్తోంది.

## గురుకుల విద్యార్థినికి ఉత్తమ పురస్కారం

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థిని పల్లెపాగ సౌమ్యకు ఉత్తమ పురస్కారం లభించింది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కొత్తకోట గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని స్యా బుధవారం చేనేత కార్మిక అంశాలపై మాట్లాడారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆమెను గురువారం అభినందించి పాఠశాల ఉపాధ్యాయురాలు , అధికారులతో కలిసి పురస్కారం అందజేశారు. గత కలెక్టర్ తేజస్ నందలాల్ , పవార్ చేతుల మీదుగా కూడా పురస్కారం అందుకున్న పల్లెపాగ సౌమ్యను పలువురు కొనియాడుతున్నారు.

## ఫిషరీస్ కాలేజ్ సమస్యలు పరిష్కరిస్తాం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండలంలోని ఫిషరీస్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా నూతన బాధ్యతలు తీసుకున్న మత్స్య కళాశాల ప్రిన్సిపల్ సకారంని మర్యాదపూర్వకంగా కలిసి కాలేజీ సమస్యలు పలు సమస్యలు చర్చించారు. కాలేజీ సమస్యలు ఎమ్మెల్యే మెఘారెడ్డి దృష్టికి తీసుకుపోయి స మస్య పరిష్కరిస్తామని కాలేజీ ప్రిన్సిపల్‌కి తెలిపారు. ఈ సందర్భంగా కళాశా ల ప్రిన్సిపల్ మాట్లాడు తూ ఎన్‌హెచ్ రోడ్డు 44 నుండి కాలేజీ వరకు రోడ్డు చా లా ఇబ్బందిగా ఉంది. త్వరగా చేయవాల్సిందిగా కోరడమైంది. ఈ విషయం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోయి కాంట్రాక్టర్‌ను త్వరగా రోడ్డు వేయడానికి కృషి చేస్తామని ప్రిన్సిపల్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసులు గౌడ్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రామన్ గౌడ్, యుగంధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మాజీ డైరెక్టర్ రాము లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/ మాగనూర్ :** డ్రైనేజీ నిర్మాణం పనులను ప్రారంభించిన నాయకులు మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు గురువారం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన పది లక్షల రూపాయలతో సైడ్ డ్రైనేజి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ కింద పది లక్షల రూపాయలను సాంక్షన్ చేయించినటువంటి మంత్రి వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మహిళా లబ్ధిదారులకు ఎంపిడిఒ శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఒ రాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రోసీడింగ్ కాపీలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లు లేని పేదవారికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని ఇందిరమ్మ ఇంటి కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో 50 మందిని ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులుగా గుర్తించటం జరిగిందని, ప్రస్తుతం 42 మంది మహిళా లబ్దిదారులకు ప్రోసీడింగ్ కాపీలను అందజేసినట్లు తెలిపారు. 8 మంది లబ్దిదారులకు తొందరలోనే ప్రోసీడింగ్ కాపీలను ఇస్తామని , 50 మందికే పరిమితం కాకుండా విడతల వారిగా ఇండ్లు లేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లను, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజా ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రవీందర్ రెడ్డి, కావలి మహేష్ , ఎత్తం వెంకటేష్ , పెద్ద రాముడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు ఎత్తం కృష్ణయ్య, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నక్క విష తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెడితే చర్యలు



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** రాబోయే పండుగల సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేశాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ రాబోయే గణేష్ ఉత్సవాలు మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా జిల్లా ప్రజలు కులమతాలకు అతీతంగా తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమాలు అయిన ఫేసుబుక్, ట్విట్టర్ ఇన్స్టాగ్రామ్, వాట్స ప్ గ్రూపులలో ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న తమకు తెలియని వీడియోలు, ఫోటోలు పోస్టులు చేసిన, వాటి ని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూప్ అడ్మిన్‌ని బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడుతాయి అని తెలిపారు. కావున ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే పట్టుకుని అట్టి వారిపై కేసులు నమో దు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు నిరంతరం 24X7 పరిశీలిస్తుంటారని తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు చేసిన, ఫార్వర్డ్ చేసిన జాగ్రత్తగా గమనించి చేయాలని ఎస్‌పి సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో నారాయణపేట పోలీసు కంట్రోల్ రూమ్ 87126703 99 కి లేదా డయల్ 100 కి సమాచారమే వాళ్లని తెలిపారు.

## ఇంటింటికి మొక్కల పంపిణీ

**ప్రజాపక్షం / కొత్తకోట :** ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టిన కొత్తకోట మున్సిపల్ కమిషనర్ సైదయ్య, కొత్తకోట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతులపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వార్డు రిసెప్షినిట్స్ మదనపురం లక్ష్మ య్య, కదిరే సాయిలు యాదవ్ , సాయిరాం, వెంకటేష్ , చిన్న రాములు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొని ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడం జరిగింది. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రతి ఒక్కరు కూడా ఇంటి ఆవరణలో , ఇంటి బయట మొక్కలు తప్పనిసరిగా నాటుకోవాలని, మొక్కలు జీవకోటికి మూలాధారమని కొత్తకోట మాజీ సర్పంచ్ అరుణ శ్రీనివాస్ తెలియజేశారు.

## తల్లిదండ్రుల శ్రమను గుర్తించి బాగా చదువుకోవాలి

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు తల్లిదండ్రుల శ్రమను చూసి బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని పినిస్ డెలిగేట్, కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావులు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎస్ కళాశాల బాయ్స్ క్యాంపస్‌లో జరిగిన ప్రెషర్స్‌డే లో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి జీవితం ఇంటర్మీడియట్ చాలా కీలకమని ఈ దశలోనే వారి జీవితానికి పునాది ఏర్పడుతుందని అన్నారు. కుటుంబంలో ఒక్కరు ఉన్నత స్థాయిలో ఉంటే ఆ కుటుంబంలో మూడు తరాల వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థిరపడతారని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ వద్దే రాజేష్‌కుమార్, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేగ శ్రీధర్, కంభంపాటి శ్రీనివాస్, పిడతల శ్రీనివాస్, అకాడమిక్ అడ్వైజర్ మైసం రామయ్య, ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

## ప్రమాదాలు నివారించడానికే తనిఖీలు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రసాయనిక, ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికను సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో ఫ్యాక్టరీలు, రసాయనిక పరిశ్రమల్లో భద్రతపై ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 30వ తేదీన సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సంభవించిన అతిపెద్ద విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాక్టరీలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమలు, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. సూర్యాపేట జిల్లాలో పరిశ్రమల కార్మిక, కాలుష్య నియంత్రణ మండలి తదితర సంబంధిత శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 14వ తేదీలోగా నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల మేనేజర్ టి సాయిరాం, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పటిష్టంగా ఆహార భద్రతచట్టం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ సూర్యాపేట కలెక్టరేట్ :** ఆహార భద్రత చట్టాన్ని సూర్యాపేట జిల్లాలో పటిష్టముగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం జిల్లాలో ఫుడ్ కమిషన్ పర్యటన సందర్భముగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి సమీక్షించారు. జిల్లాలో ఆరోగ్యం, స్కూల్స్, హాస్టల్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఇక్కడ ఆహారభద్రత చట్టాన్ని అమలు చేయడంపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. పేదరికం పోవాలంటే చదువు ముఖ్యమని అన్నారు. రేషన్ దుకాణాలలో డీలర్స్ వేయింగ్ మిషన్లలో ఇబ్బందులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అంగన్‌వాడీ కేంద్రాలలో గుడ్లు, పాలు, ఆట వస్తువులు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ హాస్టల్, అంగన్‌వాడీ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో పూర్తిస్థాయి ఆహారభద్రత చట్టాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతి, డిఆర్‌డిఓ పిడి అప్పారావు, సంక్షేమ శాఖ అధికారులు దయానందరాణి, శంకర్ నాయక్, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా డిజైన్లు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత డిజైన్లు రూపొందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని రాయగిరి క్రాస్ నుండి జిల్లా కలెక్టరు కార్యాలయం వరకు చేనేత కార్మికుల ర్యాలీని, జిల్లా కలెక్టరు హనుమంత రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఏడి హ్యాండ్లూమ్ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన గావించారు. చేనేత కళను కాపాడు తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ సుందరీమణులు పోచంపల్లి సందర్శించినపుడు, వారు మన వస్త్రాన్ని ధరించడం వల్ల మార్కెట్ పెరిగిందని తెలిపారు. నేతన్న భీమాకు చనిపోయిన నెలరోజుల్లోనే రూ.5 లక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, చేనేత సహకార సంఘం ప్రెసిడెంట్ జల్లి రాములు, కార్మిక సంఘ నాయకులు లక్ష్మి నరసయ్య, చేనేత సహకార సంఘ అధ్యక్షులు సుధాకర్, చేనేత సహకార సంఘం ప్రెసిడెంట్ సుధాకర్ సుదర్శన్, డెవలప్మెంట్ ఆఫీసర్ రాజేశ్వర్ రెడ్డి, అసిస్టెంట్ డెవలప్మెంట్ ఆఫీసర్ సత్యనారాయణ, చేనేత శాఖ అధికారులు పాల్గొన్నారు.


## కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా, పట్టణంలో రెండు రోజుల పాటు ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడింది. ఆగష్టు 6 నుంచి 7 వరకు ఎస్ఎల్‌బీసీ నుండి డీవీకే రోడ్, క్లాక్ టవర్, బస్టాండ్, మిర్యాలగూడ రోడ్డు కలెక్టరేట్ వరకు ఉన్న 60కి పైగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్రూట్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం దుకాణాలు, టీ స్టాల్స్, బేకరీలతో సహా వివిధ ఆహార వ్యాపార కేంద్రాలను ఆహార భద్రతా నిబంధనల మేరకు తనిఖీ చేశారు.యాదాద్రి జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆదేశాల మేరకు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ ఎన్ శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ద్వారా ఆహార భద్రతా డ్రైవ్‌లో సిబ్బంది పాల్గొన్నారు. ఈ తనిఖీల్లో పాలు, టీ పొడి, కారం, పసుపు, మసాలాలు, వంట నూనె, బిర్యానీ, స్వీట్స్, బేకరీ ఆహార పదార్థాలలో నిషిద్ధ రంగులు వాడకుండా, కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో రంగులు వాడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీచేయడం జరిగింది, అనుమానాస్పద పదార్థాలపై ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనంతో తక్షణ పరీక్షలు నిర్వహించారు. తనిఖీలో టెక్నీషియన్ ఎం. వెంకటపతి,(నమూనా సహాయకుడు ఎం. రమేష్,ఎ. మహేష్ లు ఉన్నారు.

## భూభారతి చట్టం రైతులకు గొప్ప వరం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు భూభారతి చట్టం గొప్ప వరమని భూభారతి చట్టం రూపకర్త, రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమీషన్ సభ్యుడు ఎం.సునీల్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రైతులు తమ పని తాము చేసుకోవడం కాదని, చట్టాల గురించి తెలుసుకోవాలని, సాగురంగంలో చట్టాల పాత్ర పెరుగుతుందని, చట్టాలు వినియోగించుకుంటే ఏరువాక సాఫీగా సాగుతుందని ఆయన అన్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు లీవ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు ఏమైనా సమస్యలు ఏర్పడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, వ్యవసాయాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# అందుబాటు ధరలో ఇసుక

మిర్యాలగూడలో సాండ్ బజార్ ప్రారంభం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇసుక అక్రమ దందాను అరికట్టి అందుబాటు ధరలో కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉంచేందుకు సాండ్ బజార్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని చింతపల్లి ఎక్స్ రోడ్డు వద్ద తెలంగాణ రాష్ట్ర మైనింగ్‌శాఖ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను గురువారం రాష్ట్ర మైనింగ్‌శాఖ ఎండి, వైస్ ఛైర్మన్ భవేష్‌మిశ్రా, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లతో కలిసి ప్రారంభించారు. చింతపల్లి ఎక్స్‌రోడ్డులోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో అందరికి అందుబాటులో కావాల్సినంత ఇసుక లభ్యమయ్యేలా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే హైద్రాబాద్ తరువాత మొట్టమొదటి సారిగా మిర్యాలగూడలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ దందా అరికట్టడంతోపాటు సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుకను ఉంచేందుకు సాండ్ బజారను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. టన్నుకు రూ.1250 చొప్పున కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇంకా తక్కువ ధరకే ఇసుక అందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తక్కువ ధరకు ఇసుకతోపాటు స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో మాట్లాడి బస్తాకు రూ.50 చొప్పున తగ్గింపు ధరలో అందించనున్నట్లు తెలిపారు. ఇటుకలు కూడా మార్కెట్ రేట్ కంటే ఒక రూపాయి తక్కువకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ హరిబాబు, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, మైనింగ్ ఏడీ జాకోబ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మా భూమిని మాకు ఇప్పించండి

మంత్రి చెప్పినా స్పందించరా?

కలెక్టరేట్ ఎదుట రైతు కుటుంబం కంటతడి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మా భూమిని మాకు ఇప్పించండని ఓ రైతు కుటుంబం అధికారులను వేడుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తమ గోడు చెప్పినా అధికారులు స్పందించకపోవడంపై తమకు న్యాయం చేయాలంటూ గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట రైతు కుటుంబం కంటతడి పెడుతూ ఆందోళనకు దిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆత్మకూర్ ఎస్ మండలంలోని కోటపహాడ్ గ్రామంలో 209, 210 సర్వే నంబర్లలో పదేండ్ల క్రితం 830 గుంటల భూమిని తాము కొనుగోలు చేసి మూడెకరాల చొప్పున పట్టాలు చేసుకున్నామని బాధిత రైతు గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఆయన భార్య సులోచన, కుమారుడు హరీష్‌లు మీడియాకు తెలిపారు. గత ఏనిమిదేండ్లుగా ఖబ్జాలో ఉండి సాగు చేసుకున్నామని, గత రెండు సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కొందరు పెద్దలు ఎలాంటి ఆధారాలు లేకుండా భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ భూమిలో 30 గుంటల వరకు దున్నుకున్నారని దీనిపై తాము వారిని ప్రశ్నిస్తే దాడి చేశారని, ఇదే విషయం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం తమ భూమిలోకి వెళ్ళేందుకు దారిలేదంటూ అడ్డుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. ఇదే విషయము జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు, జిల్లా ఎస్‌పికు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా ఎవరూ స్పందించలేదని ఇప్పటికైనా మా భూమిని మాకు చెందేలా చర్యలు తీసుకొని బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని వేడుకున్నారు.

# రూ. 10వేల వేతనం అమలు చేయాలని ధర్నా

ఎంఇఒకు ఎఐటియుసి వినతి




**ప్రజాపక్షం/డిండి:** ఎఐటియుసి రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై గురువారం డిండి ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఎంఇఒకు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వంట కార్మికులు గత 22 సంవత్సరాల నుండి విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్నారని, వారి జీవితాలు మాత్రం నెలల తరబడి ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అన్నట్లుగానే ఉందని ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించే విషయంలో నత్తనడకగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. వంట బకాయిలు 4, 5 నెలల బిల్లులు, జీతాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ హామీలో భాగంగా రూ. 10వేల వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని, కోడిగుడ్లను, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి విద్యార్థికి తరగతితో సంబంధం లేకుండా రోజుకు 25 రూపాయలు చెల్లించాలని, ప్రతి నెల 5వ తేది వరకు జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత, అధికారుల, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షులు లింగమయ్య, సహాయ కార్యదర్శి జవహర్‌లాల్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మయ్య, అలివేలు, తబిత, ఎల్లమ్మ, వెంకటమ్మ, పద్మ, జంగమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి పట్టుబడిన ఇరిగేషన్ డిఇ



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న డిఈ శ్రీకాంత్ నాయుడు అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకెళితే జోగులాంబ గద్వాల జిల్లాలోని అల్లంపూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఆర్డీఎస్ ఇరిగేషన్ శాఖ డిఇ శ్రీకాంత్‌నాయుడు బాధ్యతలు నిర్వహించేవాడు. గురువారం కాంటాక్టు నుంచి రూ. 11000 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులకు పట్టుబడినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. కాంట్రాక్టర్ మెజర్మెంట్ రికార్డు నమోదు కోసం అదనంగా సొమ్ము అడిగినట్లు సమాచారం వినిపిస్తుంది.

## చేనేత సహకార సంఘాల బలోపేతానికి కృషి

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలో చేనేత వస్త్రాలను వినియోగించేలా జీవో జారీ చేసి విధిగా అమలుపరిచే బాధ్యత ఇరు ప్రభుత్వాలు తీసుకోవాలని బిజెపి మాజీ కేంద్ర మంత్రి సీనియర్ నాయకులు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభిప్రాయపడ్డారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లిని సందర్శించి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. సహకార సంఘంలో చేనేత వస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత రంగానికి కార్మికుల సంక్షేమం జీవనోపాధి కోసం బాపూజీ చేసిన త్యాగాన్ని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ స్మారక భవనం నిర్మించి చేనేత పరిశ్రమ పటిష్టం చేసి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు వస్తేనే బాపూజీకి నిజమైన నివాళిగా చేనేత దినోత్సవ ఆశయం నెరవేరుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోముల గణేష్, బిజెపి రాష్ట్ర నాయకులు కర్ణాటి ధనుంజయ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, మాజీ ఎమ్మెల్యే పొన్నాల శ్రీరాములు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు భారత లవ కుమార్ పాల్గొన్నారు.

## బిసిలకు న్యాయం బిజెపితోనే సాధ్యం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బీసీలకు న్యాయం జరిగేది బిజెపితోనే అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అన్నారు. భువనగిరిలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి గెలుస్తుందని, బీసీ రిజర్వేషన్‌లకు మేము వ్యతిరేకం కాదన్నారు. మూసీ ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డి మాటలు కేవలం ప్రగల్భాలు మాత్రమేనని ఆయన ఆరోపించారు. భువనగిరి ప్రజలు బీజేపీ పార్టీని ఆదరిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడి ప్రాంతంలో బీజేపీకి భారీగా సీట్లు వస్తాయనే సంకేతాలు స్పష్టంగా ఉన్నాయన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ రాష్ట్రంలో యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసుల్లో ఏ ఒక రాజకీయ నాయకుడిని అరెస్ట్ చేయరని చెప్పారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాశం బాస్కర్, దాసరి మల్లేశం పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

అధికారులకు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈ సంవత్సరపు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ముఖ్య అతిథి సందేశానికి ఆయా శాఖలు వారి ప్రగతికి సంబంధించిన నివేదికలను తక్షణమే ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలన్నారు. గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం వేడుకలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని చెప్పారు. ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు మొదలవుతాయని, ఎప్పటిలాగే ముఖ్య అతిథి జాతీయ పతాకావిష్కరణ, వందన స్వీకరణ, సందేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, స్టాల్స్ తదితరాలు ఉంటాయని తెలిపారు .స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆయా శాఖలు వారి అభివృద్ధిని తెలిపే విధంగా శకటాలు,స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా జాతీయ సమైక్యత, దేశభక్తిని పెంపొందించే విధంగా పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే అతిథులు, ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన తాగునీరు ,టెంట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తదితర ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు నిర్వహించాలని ఆదేశించారు అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జి డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం తుంగతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి, ఐపి రిజిస్ట్రేషన్ ఛాంబర్‌ను పరిశీలించి ఎన్ని రిజిస్ట్రేషన్లు అయ్యాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్, ఎక్స్‌రే రూములను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కంటి పరీక్ష చేయు పరికరాలను చూసి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సెల్యులైటిస్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బండ రామారాం గ్రామానికి చెందిన 35 సంవత్సరాల రమేష్‌ను, వెంపటి గ్రామానికి చెందిన 36 సంవత్సరాల వెంకన్నను పరామర్శించి వారికి అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో పరికరాల కొరత ఉందని వైద్యులు చెప్పగా తప్పక మంజూరి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అలాగే కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలను కూడా తనిఖీ చేసి వాటర్‌ప్లాంట్, డైనింగ్ రూమ్, కిచన్ రూమ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. ఖాన్ అకాడమీ ద్వారా బయోసైన్స్‌పై ఆన్‌లైన్ పాఠాలను పరిశీలించి 10వ తరగతి విద్యార్థులకు హిందీ, తెలుగు చదివించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి లక్ష్యానికి అనుగుణంగా విద్యలో రాణించాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు.

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తడకమల్ల రాములమ్మ మూడు సంవత్సరాల క్రితం మరణించగా ఆమె భర్త వెంకన్న ఇటీవల మరణించడంతో వారి ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన పెద్ద కుమార్తె ఉమకు ఇష్టమైన బిఎస్‌సి కోర్సు చెప్పిస్తామని, చిన్న కూతురు శ్రీజను కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించడంతోపాటు ఇందిరమ్మ ఇల్లును ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ దయానంద్, ఎంపిడిఓ శశికుమార్, డిటిహెచ్ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉపేందర్, దీప్తి, గౌతమ్, సూపరింటెండెంట్ నిర్మలకుమార్ పాల్గొన్నారు.

## దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భూభారతి అమలులో భాగంగా రెవిన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం అయన నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్లోని తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు .రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు, డీటీలు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## 11న తెలంగాణ పెన్షనర్ల మహా ధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ల సమన్వయ సమితి పిలుపు మేరకు హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద 11వ తేదీ సోమవారం తెలంగాణ పెన్షనర్ల మహా ధర్నా నిర్వహించబడుతుందని , జిల్లాలోని పెన్షనర్లు అందరూ పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా శాఖ పిలుపునిచ్చింది.గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు నూకల జగదీశ్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెండవ పీఆర్సీని 30 ఫిట్మెంట్ తో అమలుపరచాలని, పెండింగ్ లో ఉన్న 5 డి.ఏ లను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రూ.398 వేతనంతో పనిచేసి రిటైర్ అయిన వారికి నోషనల్ ఇంక్రిమెంటు మంజూరీ చేసి పెన్షనరీ బెనిఫిట్స్ కు అనుమతించాలన్నారు. ఏప్రిల్ 2024 నుండి రిటైర్ అయిన పెన్షనర్లకు పెన్షనరీ బెనిఫిట్స్ ను వాయిదా పద్ధతిలో కాకుండా ఏక మొత్తంలో చెల్లించాలని, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నగదు రహిత హెల్త్ స్కీమును విధి విధానాలతో ఏర్పాటు చేసి వెంటనే అమలు పరచాలని ,ఒకటవ పేకమిషన్ ప్రకటించినట్లుగా 20 సంవత్సరాలకు పూర్తి పెన్షన్ ఇవ్వాలని,సివిపి మినహాయింపులను 15సంవత్సరాలకు బదులుగా 11 సంవత్సరాల మూడు నెలలకు తగ్గించాలని, పెన్షనర్లందరికీ ఆర్టీసీ బస్సుల్లో 50 రాయితీ ఇవ్వాలని, మెడికల్ రీయింబర్స్మెంట్ బకాయిలను, జిపిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని , పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెన్షనర్ల డైరెక్టరేట్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కుకుడాల గోవర్ధన్, జిల్లా కోశాధికారి యండి.అబ్దుల్ ఖాదర్, రాష్ట్ర కమిటి సభ్యులు శ్రీమతి వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, డివిజన్ కార్యదర్శి బిక్షమయ్య పాల్గొన్నారు.

# క్రీడ

## ఎప్పటికీ ఎల్లో జెర్సీలోనే ఆడుతా



చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ ఎంఎస్ ధోనీ ఆ జట్టుతోనే భవిష్యత్తులో కొనసాగనున్నాడు. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్‌లో అతను ఆ క్లారిటీ ఇచ్చాడు. 2008 నుంచి ఐపిఎల్‌లో చెన్నై టీమ్‌తోనే ధోనీ ఆడుతున్నాడు. అతని సారథ్యంలో ఆ జట్టు ఐదుసార్లు టైటిల్ కూడా నెగ్గింది. అయితే గత కొన్ని సీజన్ల నుంచి సీఎస్కే జట్టు సరిగా పర్ఫార్మ్ చేయడం లేదు. దీంతో ధోనీ కెప్టెన్సీ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. చివరి సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ .. సీఎస్కే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ధోనీ కెరీర్ ముగిసిందని అన్న అనుమానాలకు అతనే తెర దింపాడు.

## సచిన్, కోహ్లీ అవుతావా? అని ఎగతాళి చేశారు : హర్షిత్ రాణా



క్రికెటర్ అవుతానంటే.. సచిన్, కోహ్లీ అవుతావా? అని తన బంధువులు, స్నేహితులు, చుట్టు పక్కల వాళ్లు ఎగతాళి చేశారని టీమిండియా యువ పేసర్ హర్షిత్ రాణా తెలిపాడు. వీడి గురించి ఎక్కువ ఊహించుకుంటున్నావని, టైమ్ వృథా చేసుకుంటున్నావని తన తండ్రిని నిరుత్సాహపరిచే ప్రయత్నం చేశారని హర్షిత్ రాణా గుర్తు చేసుకున్నాడు. తాను టీమిండియాకు ఆడిన తర్వాత అందరూ మాట మార్చారని చెప్పాడు. కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని తన డ్రీమ్ కొనియాడారని, అది తనకు వింతంగా అనిపించిందని తెలిపాడు. తనకు కూడా ఫోన్లు చేశారని, కానీ తాను ఎత్తలేదని పేర్కొన్నాడు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న హర్షిత్ రాణా.. చిన్నప్పుడు తన చుట్టు ఉన్నవారు డిస్కరేజ్ చేస్తూ అన్న మాటలను గుర్తు చేసుకున్నాడు. 'మనకు ఒక్కసారిగా పేరు, ప్రఖ్యాతలు, గుర్తింపు రాగానే.. అప్పటి వరకు దూరంగా ఉన్న వ్యక్తులంతా దగ్గరవుతారు. చిన్నప్పుడు నేను క్రికెటర్ అవుతానంటే నవ్విన నా సొంత బంధువులు, మా బంధువులు.. అనవసరంగా వాడి కోసం కష్టపడుతున్నావా అని మా నాన్నను నిరుత్సాహపరిచే ప్రయత్నం చేసిన వాళ్లు ఎంతో మంది ఉన్నారు. వీడి వల్ల ఏం కాదు. క్రికెట్ ఆడిన ప్రతోడు సచిన్, కోహ్లీ అవుతాడా? అని హేళన చేశారు. వాళ్లే ఇప్పుడు మా నాన్నకు ఫోన్ చేసి నీ కష్టానికి ఫలితం దక్కిందంటూ పొగడటం వింతగా అనిపిస్తుంది. వాళ్లు నాకు కూడా ఫోన్లు చేస్తారు. కానీ నేను అస్సలు ఎత్తను. ఇదే నా ఆటిట్యూడ్ కాదు. గతంలో వాళ్లు నన్ను చాలా హేళన చేశారు. అలాంటి వాళ్లతో మాట్లాడాల్సిన అవసరం లేదని నా అభిప్రాయం.' అని హర్షిత్ రాణా ఆవేదన వ్యక్తం చేశాడు.

## గిల్ చేతికి దేశవాళీ జట్టు పగ్గాలు..



సీనియర్లు లేకుండా ఇంగ్లాండ్ గడ్డపై టెస్టు సిరీస్ సమం చేసిన శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా సూపర్ మార్కులు కొట్టేశాడు. నాయకుడిగా ముందుండి నడిపిస్తూ.. తనకిచ్చిన స్క్వాడ్‌ను సమర్థంగా ఉపయోగించుకుని 'మిస్టర్ పర్ఫెక్ట్' అనిపించుకున్నాడు. అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీని పంచుకున్న ఉత్సాహంతో స్వదేశం వచ్చిన గిల్‌కు మళ్లీ కెప్టెన్ బాధ్యతలు అందుకున్నాడు. దేశవాళీ సీజన్‌లో అతడు నార్త్ జోన్ సారథిగా ఎంపికయ్యాడు. దులీప్ ట్రోఫీ కోసం గురువారం సెలెక్టర్లు గిల్ నాయకత్వంలో 15 మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. ఆగస్టు నెలాఖర్లో దులీప్ ట్రోఫీ ప్రారంభం కానుంది. జోన్ల ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గిల్ కెప్టెన్సీలో నార్త్ జోన్ టైటిల్ వేటకు సిద్ధమవుతోంది. సెలెక్టర్లు ఎంపిక చేసిన స్క్వాడ్‌లో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలతో పేస్ దళం పటిష్టంగా ఉంది. ఒకవేళ ఈ గిల్ ఆసియా కప్ ఆడాల్సి వస్తే శుభం రొహిల్లా నార్త్ జోన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని సెలెక్టర్లు తెలిపారు.

**నార్త్ జోన్ స్క్వాడ్ :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), శుభం ఖజురియా, అంకిత్ కుమార్ (వైస్ కెప్టెన్), ఆయుష్ బదోని, యశ్ ధుల్, అంకిత్ కల్సి, నిశాంత్ సింధు, సాహిల్ లోత్రా, మయాంక్ దగర్, యుధ్వీర్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, అన్షుల్ కంబోజ్, ఆకిబ్ నబీ, కన్హయ్య వధావన్ (వికెట్ కీపర్).

**రీప్లేస్‌మెంట్స్ :** ఒకవేళ గిల్, అర్ష్‌దీప్, హర్షిత్‌లు ఆసియాకప్ స్క్వాడ్‌కు ఎంపికైతే వీళ్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు ముగ్గురిని ఎంపిక చేశారు సెలెక్టర్లు. శుభం రొహిల్లా (గిల్), గుర్నూర్ (అర్ష్‌దీప్ సింగ్), అనుజ్ థక్రాల్ (హర్షిత్ రానా).

**స్టాండ్ బై :** శుభం అరోరా, జస్కరన్‌వీర్ సింగ్, రవి చౌహాన్, అబిద్ ముస్తాక్, నిసుంక్ బిర్లా, ఉమర్ నజీర్, దివేశ్ శర్మ.

ఇంగ్లాండ్ పర్యటనతో టెస్టు కెప్టెన్‌గా పగ్గాలు అందుకున్న గిల్ అంచనాలకు మించి రాణించాడు. సీనియర్ల గైర్హాజరీలో కుర్రాళ్లను కలుపుకొని జట్టు ప్రదర్శన మాత్రం ఇనుమడించేలా తగ్గకుండా చూసుకున్నాడు. లీడ్స్‌లో ఓటమితో సిరీస్ ఆరంభించినా చెక్కుచెదరని గిల్.. బర్మింగ్‌హామ్‌లో రికార్డు విజయంతో సిరీస్ సమం చేసింది గిల్ సేన. ఆ మ్యాచ్‌లో రెండు శతకాలతో చెలరేగాడు గిల్. అనంతరం లార్డ్స్‌లో అనూహ్యంగా పోరాడినా 21 పరుగుల తేడాతో ఓడిపోయింది భారత్. ఇక మాంచెస్టర్‌లో సున్నాకే రెండు వికెట్లు పడి న వేళ కెప్టెన్ గిల్ ఓపెనర్ కెఎల్ రాహుల్‌తో పాటు క్రీజులో పాతుకుపోయాడు. విరోచిత సుందర్, జడ్డూల శతకాలతో డ్రాగా ముగించిన టెస్టు. నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో టీమిండియా యశస్వీ సెంచరీ, సిరాజ్ సూపర్ స్పెల్ కారణంగా అద్భుత విజయంతో సిరీస్ సమం చేసింది. ఎన్నో అనుమానాల నడుమ జట్టును గొప్పగా నడిపించిన గిల్ బ్యాట్‌తో 754 రన్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ పట్టేశాడు.

## ఫోకస్ — స్పోర్ట్స్


## తెర వెనుక ఎవరు?

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్ డ్రా (2–2)గా ముగియడం భారత క్రికెట్ అభిమానులకు ఊరటనిచ్చి ఉండవచ్చు. అత్యంత కీలకమైన చివరి టెస్టులో టీమిండియా ఆరు పరుగుల తేడాతో గెలిచి, పరువు నిలబెట్టుకున్న వైనం అందరినీ ఆకట్టుకుంటున్నది. అదే సమయంలో ఈ టెస్టు సిరీస్ పేరు మార్చడంపై క్రికెట్ వర్గాల్లో చర్చ కొనసాగుతున్నది. పటౌడీ (మన్సూర్ అలీఖాన్ పటౌడీ) పేరుమీద ఉన్న ఈ ట్రోఫీకి ఆండర్సన్–తెండూల్కర్ ట్రోఫీగా పేరు ఖరారు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పేరు మార్పు వెనుక ఎవరున్నారనే ప్రశ్న తెరపైకిరాగా, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) అధ్యక్షుడు జై షా పేరు ప్రధానంగా వినిపిస్తున్నది. గత ఏడాది డిసెంబర్ ఒకటిన ఐసిసి అధ్యక్ష పదవిని చేపట్టినప్పుడు అతని వయసు 36 సంవత్సరాలు. ఐసిసికి అత్యంత పిన్న వయస్కుడైన అధ్యక్షుడిగా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. మన దేశం నుంచి ఇంతకు ముందు జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పావర్, శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ పదవిని నిర్వహించగా, ఇప్పుడు జై షా వారి అడుగుజాడల్లో నడుస్తున్నాడు. ప్రపంచంలోనే అత్యధిక ఆదాయ వనరులున్న భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ప్రధాన కార్యదర్శిగా 2022లో ఎన్నికైన అతను 2025 వరకూ ఈ పదవిలో కొనసాగుతాడు. అదే సమయంలో ఐసిసి అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యాడు. దీనితో జోడు పదవులు అనుభవిస్తున్నాడు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడైన కారణంగానే జై షాకు ఇన్ని అవకాశాలు వస్తున్నాయని, లేకపోతే అతనికి క్రికెట్‌లో ఎలాంటి పదవి దక్కేది కాదన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. క్రికెట్‌తో ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేని ఒక వ్యక్తి ఏకంగా ప్రపంచ క్రికెట్‌ను శాసించడం విచిత్రం. కరడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్నందున, పటౌడీ ట్రోఫీ పేరును మార్చడానికి ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ (ఇసిబి)పై ఒత్తిడి తెచ్చి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి అటు ఇంగ్లాండ్.. ఇటు భారత్‌లో క్రికెట్ రంగానికి ఇద్దరు పటౌడీలు తమ వంతు సేవలు అందించారు. నవాబ్ మహ్మద్ ఇఫ్తికర్ అలీ ఖాన్ పటౌడీ (సీనియర్ పటౌడీ) 1910 మార్చి 16న జన్మించాడు. 1932 నుంచి 1946 మధ్యలో టెస్టు క్రికెట్ ఆడాడు. 1932–1934 మధ్య ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు. తాను ఆడిన మూడు టెస్టుల్లోనూ ఇంగ్లాండ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత టీమ్ ఇండియా తరపున మూడు టెస్టులు ఆడాడు. ఆ సమయంలో కూడా భారత జట్టుకు కెప్టెన్‌గానే ఉన్నాడు. అయితే 41 ఏళ్ల చిన్న వయసులోనే ఇఫ్తికర్ అలీ ఖాన్ పటౌడీ చనిపోయాడు. ఇండియా, ఇంగ్లాండ్ జట్లకు టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించిన ఏకైక క్రికెటర్ అతని పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. సీనియర్ పటౌడీ ఏకైక కుమారుడు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ తండ్రి వారసత్వాన్ని స్వీకరించాడు. 'టైగర్ పటౌడీ' అని అభిమానులు అతనిని ముద్దుగా పిలుచుకుంటారు. భారత జట్టు తరపున 1961 నుంచి 1975 వరకు క్రికెట్ ఆడాడు. ససెక్స్, ఢిల్లీ, హైదరాబాద్ జట్ల తరపున డొమెస్టిక్ క్రికెట్‌నూ పాల్గొన్నాడు. కెరీర్‌లో 46 టెస్టులు, 310 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన పటౌడీ.. ఒక అద్భుతమైన బ్యాట్స్‌మన్ మాత్రమేకాదు... గొప్ప కెప్టెన్‌గా కూడా పేరు పొందాడు. టెస్టుల్లో 6 సెంచరీలు, 16 హాఫ్ సెంచరీలు చేశాడు. 203 అతడి అత్యధిక టెస్టు పరుగులు. టెస్టుల్లో టైగర్ పటౌడీ బ్యాటింగ్ యావరేజ్ 88గా ఉందంటే.. ఏ రేంజ్‌లో ఆడేవాడో అర్థం చేసుకోవచ్చు. కేవలం 21 ఏళ్లకే భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన టైగర్ పటౌడీ.. ఆ కాలంలోనే బెస్ట్ ఫీల్డర్‌గా.. వన్ ఆఫ్ ది గ్రేటెస్ట్‌గా గుర్తింపు పొందాడు. టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు పొందిన ఏకైక క్రికెటర్ అతనే. తండ్రీకొడుకులు ఇద్దరు భారత క్రికెట్‌కు గొప్ప సేవ అందించారు కాబట్టి 'పటౌడీ' పేరు ఇంగ్లాండ్, భారత్ టెస్టు సిరీస్‌కు సరైనదనే భావం చాలా మందిలో ఉంది. కానీ, ఇసిబి హఠాత్తుగా పేరు మార్చేడం చర్చకు తావిస్తున్నది.




## ర్యాంకింగ్స్‌కు కీలకం 'సిన్సినాటి' ఓపెన్

పురుషుల విభాగంలో అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ (ఎటిపి), మహిళల విభాగంలో ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యుటిఎ) ప్రకటించే ప్రపంచ ర్యాంకింగ్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. టెన్నిస్ ర్యాకెట్ పట్టిన ప్రతి ఒక్కరూ కనీసం 'టాప్ 100'లోనైనా చోటు సంపాదించాలని కోరుకుంటారు. కాగా, వివిధ టోర్నీల్లో సంపాదించిన పాయింట్ల ఆధారంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌ను నిర్ధారిస్తారు. ర్యాంకింగ్స్‌కు అవసరమైన పాయింట్ల కోసం జరిగే టోర్నీల్లో 'సిన్సినాటి ఓపెన్' అత్యంత కీలకమైనది. అమెరికాలో యుఎస్ ఓపెన్ (1881) తర్వాత అత్యంత పురాతనమైన టెన్నిస్ టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన సిన్సినాటి ఓపెన్ 1899లో మొదలైంది. అధికారికంగా పురుషుల విభాగంలో 'వెస్టర్న్ ఓపెన్', మహిళల విభాగంలో 'సదరన్ ఓపెన్' ఈ టోర్నీకి పిలుస్తారు. కానీ, ప్రపంచ వ్యాప్తంగా టెన్నిస్ అభిమానులకు ఇది 'సిన్సినాటి ఓపెన్'గానే సుపరిచితం. ఇప్పటికీ ఆ పేరుతోనే ఎక్కువ మంది ఈ టోర్నీని ప్రస్తావిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా టోర్నమెంట్ అభిమానులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. గురువారం (ఆగస్టు 7) నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్ 18వ తేదీతో ముగుస్తుంది. సిన్సినాటి నగరానికి అత్యంత సమీపంలోని లిడ్నెర్ ఫ్యామిలీ టెన్నిస్ సెంటర్ (మాసన్, ఒహియో)లో టోర్నమెంట్‌ను నిర్వహిస్తారు. చాలా మంది క్రీడాకారులు దీనిని యుఎస్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్‌కు ప్రాక్టీస్ సెషన్‌గా కూడా భావిస్తారు. యుఎస్ ఓపెన్‌కు ముందు జరిగే సిన్సినాటి ఓపెన్‌లో భాగంగా, పురుషులు, మహిళలు ఒకే వేదికపై పోటీపడడం విశేషం. ఈ విధంగా ఒకే కోర్టుపై పురుషులు, మహిళల మ్యాచ్‌లను నిర్వహించే విధానం మరే ఇతర టెన్నిస్ టోర్నమెంట్‌లోనూ లేదు. గత ఏడాది పురుషుల సింగిల్స్‌లో జానిక్ సిన్నెర్, మహిళల సింగిల్స్‌లో అరినా సబలెన్కా విజేతలుగా నిలిచారు.



# అయోధ్య లేని లోటు పేదవర్గాలకు నష్టం

### తుదిశ్వాస వరకు వీడని పోరాటతత్వం
### ప్రజా పోరాటాలే అయోధ్యకు నివాళి
### సంతాప సభలో చాడ, కూనంనేని, ఎమ్మెల్యే తెల్లం, సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** పేదలు, బడు గు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎర్రజెండా ఎత్తిన బొల్లోజు అయోధ్యలేనిలోటు పేదవర్గాలు, కార్మికులకు, ప్రజలకు తీరనినష్టమని సిపిఐ జాతీ య కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నా రు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య సంతాప సభ మణుగూరు మండలపరిధిలోని రామానుజవరం గ్రామంలో గురువారం జరిగిం ది. ఈ సందర్భంగా చాడా మాట్లాడుతూ తాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న రోజుల్లో చేపట్టిన ప్రజాపోరుయాత్ర సమయంలో ఈప్రాంత సమస్యలపై ఆయోధ్య వివరించారని చెప్పారు. పోడురైతులు పడుతున్న పలు సమస్యలను ప్రత్యక్షంగా చూపించారని, సమస్యల పట్ల ఆయనకున్న అవగాహన, వాటిని పరిష్కరించటానికి ఆయన చేసిన కృషి ప ట్టదల ఎంతో క్రమశిక్ష ణతో కూడుకున్నదన్నారు.





### ప్రాణహాని ఉన్నా..భయపడని ధీశాలి కూనంనేని

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కార్యదీక్ష, క్రమ శిక్షణ, నిబద్ధత గలిగిన నేత అయోధ్య అన్నారు. 40 ఏళ్లపాటు ఈ ప్రాంతంలో ఉద్యమాన్ని నిర్మిస్తూ ఎన్నో ఆటుపోట్లను సైతం తట్టుకున్నారని, ఆఖరికి నక్సలైట్లతో ప్రాణహాని ఉందని తెలిసినప్పటికీ జాగ్రత్తలు తీసుకుంటూనే పార్టీ నిర్మాణం లో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఒక దశలో ఈ ప్రాంత నక్సలైట్ పార్టీ అయోధ్యను అడవుల్లోకి తీసుకెళ్లి చంపుతామని బెదిరించారని గుర్తుచేశారు. సిపిఐ వల్ల ఈప్రాంతంలో అనేక గ్రామాలు వెలుస్తుండటంతో జనసంచారం పెరిగి అడవులు తగ్గిపోతున్నాయని, తద్వారా నక్సలైటు ఉద్యమానికి చోటువచ్చే ప్రమాదం ఉందని, ఇక్కడి నుండి వెళ్లిపోవాలంటూ తుపాకీ తలపై పెట్టినప్పటికీ జంకు లేకుండా చావనన్నా చస్తాను కానీ, ఎర్రజెండాను విడిచి వెళ్లే ప్రసక్తే లేదని తెగేసి చెప్పిన ధీశాలి అయోధ్య అని అన్నారు. బూర్గంపాడు నియోజకవర్గం ఉన్నరోజుల నుండి నేటి పినపాక నియోజకవర్గంగా రూపాంతరం చెందిన నాటి వరకు ఆయన పార్టీ కోసం చేసిన కృషి మరువలేదని, ఆ నాటి రోజుల్లో సిపిఐ ఎమ్మెల్యేలను గెలిపించడంలో కీలక భూమిక పోషించారని కూనంనేని కొనియాడారు. అయోధ్య మృతి చెందారనే విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. మారుమూల ప్రాంతం నుండి రాష్ట్రస్థాయికి ఎదిగిన నేత అయో ధ్య అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతీఒక్కరూ పాటుపడాలన్నారు. సిపిఐ జిల్లా మహాసభలు అశ్వారావుపేటలో జరిగిన సమయంలో అయోధ్య మాట్లాడిన తీరు అందరిని ఆలోచింపజేసిందన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ సిపిఐలో మంచినేతగా గుర్తింపు ఉన్న అయోధ్య లేకపోవడంతో ఆ పార్టీ పోరాటాలకు నష్టమే అన్నారు. ఈప్రాంతంలో ఆయన చేసిన అనేక పోరాటాలు పలు సందర్భాల్లో చర్చకు వస్తుంటాయన్నారు. బిఆర్‌ఎస్ పినపాక మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ పినపాక ప్రాంతంలో ఉద్యమాల నేత మృతి చెందడం బాధాకరమన్నారు. 40 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీనే నమ్ముకుని కడదాకా ఆదే పార్టీలో ఉండి నిబద్ధత గల నేతగా గుర్తింపు పొందారన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ అయోధ్య ఈ ప్రాంత సింగరేణి సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించారని, ఆయనలేని లోటు సింగరేణి ఓబి కార్మికులకు తీరనిదన్నారు. జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాట పటిమను గుర్తు చేశా రు. రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిస సతీష్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలివేన శంకర్, డిహెచ్‌పిఎస్ ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిర్నాకి నవీన్, బిఆర్‌ఎస్ మాజీ జెడ్పిటిసి పోశం నర్సింహారావు, టిడిపి నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, వట్టం నారాయణ, సిపిఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, మిర్యాల రంగయ్య, మున్నా లక్ష్మి కుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, రావులపల్లి రవి, ఎస్‌డి సలీం, కమటం వెంకటేశ్వరరావు, కిలిమి ఎల్లారెడ్డి, జక్కుల రాజాబాబు, వై.రాంగోపాల్, జంగం మోహన్‌రావు, వీశం శెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమల్లి సాయిబాబు, సుధాకర్, శ్రీనివాస్, రత్నకుమారి, రాంబాబు, విజయలక్ష్మి, పద్మ, వీరభద్రం, సిద్దెల హుస్సేన్ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** గ్రామాలు పట్టణాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం నాడు జడ్చర్ల పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జిల్లా స్థాయి మహాసభలు ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా నేతలు బృంగి బాలకిషన్ , పరమేశ్వర్ గౌడ్, బాగీ కృష్ణయ్య, తదితరులు మాట్లాడుతూ ఈ నెల 5,6 తేదీలలో జడ్చర్ల పట్టణంలో గౌడ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహబూబ్‌నగర్ సిపిఐ జిల్లా 23వ మహాసభలను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. అనంతరం మహాసభల్లో ప్రజా సమస్యలపై తీర్మానాలు ఆమోదించడం జరిగింది. మొదటి తీర్మానంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించాలని రెండవది పాలమూరు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా అగ్రికల్చర్ ఆ కోర్సులను ప్రవేశపెట్టాలని మూడవది మాచర్ల టు గుంటూరు రైల్వే లైన్ వెంటనే కేంద్రంతో ఒప్పించి నిర్మాణం చేపట్టాలని, నాల్గవ తీర్మానంగా ఈ ప్రాంతంలో పరిశ్రమల్లో పనిచేస్తున్నటువంటి అన్ని రంగాలలో కార్మికులకు పని గంటలు పెంచే 282 జీవోను వెంటనే ఉపసంహరించాలని నాలుగు తీర్మానాల్ని ఆమోదించడం జరిగిందని తెలిపారు.



## సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహా





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని లక్ష్మ ణాచారి భవనంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్‌తో కలిసి బాల్‌నర్సింహా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లావాసి అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి నాగర్‌కర్నూల్ జిల్లాకు రూ.5వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి జిల్లాను అభివృద్ధి చేయాలని, అదే విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన ఖనిజ సంపద ఉంది కాబట్టి నల్లమలప్రాంతంలో సిమెంటు పరిశ్రమ, పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. జిన్నుకుంటలో దశాబ్దాలుగా ఆచరణకు నోచుకొని లెదర్‌పరిశ్రమను ప్రారంభించాలని, పాలెంలోని ఇండస్ట్రియల్ అభివృద్ధిచేసి జిల్లాను ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్రసమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, బండిలక్ష్మి పతి, శివశంకర్, పట్టణ కార్యదర్శి గోపిచారి, శివకృష్ణ, కొత్త శేఖర్ పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాదంపై పెల్లుబికిన నిరసన

### ఖమ్మంలో పాలస్తీనా సంఘీభావ ర్యాలీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** సామ్రాజ్యవాదాన్ని ఖమ్మం ప్రజలు గొంతెత్తి నిరసించారు. మానవత్వం మరిచి మహిళలు, వృద్ధులు, పసిపిల్లలపై చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. గురువారం ఖమ్మంలో రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నేతృత్వంలో భారీప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదాన్ని కాంక్షిస్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై అమానవీయ దాడులు చేస్తున్న తీరును నిరసిస్తూ వేలాదిమంది ర్యాలీలో పాల్గొన్నారు. సేవ్ గాజా సేవ్ పాలస్తీనా అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈసందర్భంగా వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, మేధావి సంఘాల నేతలు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల మూలంగా పాలస్తీనా ప్రజ లు నీరు, ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదనవ్యక్తం చేశా రు. ఇప్పటికే గాజాలో 20 లక్షల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని గడుపుతుండగా వేలాదిమంది ప్రజలు మరణించారని అక్కడి ప్రజలకు ఆహారాన్ని అందించకుండా ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఆరోపించారు. ఒక పక్క దాడులు మరో పక్క ఆకలి కేకలతో ప్రజలు అల్లాడిపోతున్నారని సామ్రాజ్యవాద కాంక్షతోనే ఇటువంటి అమానవీయ ఘటన చోటు చేసుకుంటుందని వారు తెలిపారు. గాజాకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూగగనతలంపై ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు, బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.గడ్డం లక్ష్మ ణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవిమారుత్, భాస్కర్, మువ్వా శ్రీనివాస్, ఐవి రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, ఎంఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్, కిషన్ నాయక్, పెన్న నర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రసేన్, న్యాయవాదులు తిరుమలరావు, ఓరుగంటి శేషగిరిరావు, సుగుణారావు, పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఆకుతోట ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.





# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం:ఎమ్మెల్యే మర్రి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పేద ప్రజలు తమకు అవసరమైన వైద్యానికి సిఎం రిలీఫ్ పండ్ ద్వారా ఆర్థిక సాయం చేకూరుతుందని, అవసరమైన వారు తమను సంప్రదించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కోరారు. ఈ పథకం పేదలకు ఓ వరమన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాల్వ రజితకు రూ.24వేలు, పాశం బాలమ్మకు రూ.16,500, సారికకు రూ.31వేలు, రవీందర్‌కు రూ. 28,500, ఎండి రఫీకు రూ.36వేలు చెక్కులను ఆయన అందచేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల సునిత, రాము యాదవ్, బైరెడ్డి రాజశేఖరరెడ్డి,వాసు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరగా భూభారతి దరఖాస్తులు పరిష్కరించాలి
### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ఏవైనా సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొని రావాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. అపరిష్కృతంగా ఇంకా ఎన్ని దరఖాస్తులున్నాయని ప్రశ్నిస్తూ జాప్యా నికి కారణాలేమిటని గురువారం కీసర, ఘట్‌కేసర్ తహసీల్దార్లను ఆయన అడిగి తెల్సుకొన్నారు. ఏవైనా సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉంటే వెంటనే సరిదిద్దుకొని ధరఖాస్తులను మాత్రం సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు వచ్చిన ధరఖాస్తుల్లో ఎన్ని పరిష్కారమయ్యాయంటూ వాటిని పరిశీలించారు.



## టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** పరిపాలనాపరమైన అనుమతుల కోసం సంబంధిత కార్యదర్శులతో మాట్లాడి త్వరితగతంగా పూర్తయ్యే ఏర్పాట్లు చేస్తామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు.గురువారం ఆల్వాల్‌లో నిర్మితమవుతున్న వేయి పడకల టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణానికి ఎంత సమయం పడుతుందని ప్రశ్నించగా 7 అంతస్తులతో కొనసాగుతున్న నిర్మాణం పూర్తి స్థాయిలో డిసెంబరు చివరి వారానికి పూర్తవుతుందని సంబంధిత ఇంజనీరింగ్ విభాగ అధికారులు బదులిచ్చారు. భారీ వైద్య పరికరాలు అమర్చేందుకు అనుగుణంగా నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.



## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
### కార్పొరేటర్ బన్నాల గీత

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. గురువారం జిహెచ్‌ఎంసి ఉప్పల్ సర్కిల్ ఏఈ రాధికతో కల్సి చిలుకానగర్ ప్రధాన రహదారిలో రూ 17 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బాక్స్ కల్వర్టు పనులను పర్యవేక్షించారు. జాప్యం లేకుండా పనులు పూర్తి కావాలని, లేని పక్షంలో ఈ రహదారిలో నిత్యం సంచరించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలోబిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ప్రవీణ్,కొండలరెడ్డి, జగన్, నారాయణరెడ్డి, షఫీ, బాలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతిభతో పలువురికి ఉపాధి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విద్యావంతులైన యువతీయువకులు తమ ప్రతిభతో స్టార్టప్ సంస్థలను స్థాపించటం ద్వారా స్వయం ఉపాధితో పాటు మరి కొంత మందికి ఉద్యోగావకాశాలు ఇవ్వగలిగే స్థాయికి ఎదుగుతారని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వరరెడ్డి అన్నారు. గురువారం జరిగిన సంస్థ 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణితో కల్సి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్న సంస్థగా స్థాపించి పలువురికి ఉపాధి కల్పిస్తున్న వ్యవస్థాపకులు, సిఈఓ తన్నీరు శ్రీహరి కృషి అభినందనీయమన్నారు. తమ విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్, మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ విఠల్ నాయక్, లోకసత్తా రాష్ట్ర అధ్యక్షుడు శివరామకృష్ణ, కాంగ్రెస్ శ్రేణులు అంజిరెడ్డి, పవన్‌కుమార్,మల్లారెడ్డి, బాబురావు, నాగరాజు, శ్రీధర్‌రెడ్డి సంతోష్, సత్యనారాయణ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

## చెల్లించని వేతనాలు ఇవ్వాలంటూ ఏఐటీయుసి ధర్నా
### 10 రోజుల్లో ఇస్తామంటూ అధికారుల రాతపూర్వక హామీ




**ప్రజాపక్షం/కాప్రా:**నాచారంలోని ఇఎస్‌ఐ ఆస్పత్రిలో గత నాలుగు నెలలుగా చెల్లించని వేతనాలు వెంటనే చెల్లించాలన్న డిమాండ్‌తో ఏఐటీయసి ఆధ్వర్యంలో కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ వేతనాలు వెంటనే చెల్లించాలంటూ గత నెల 30న ఆస్పత్రి అధికారులకు వినతిపత్రం సమర్పించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసారు.

ఆస్పత్రిలో నిత్యం వందలాది రోగులు ఓపి, ఇన్‌పేషంట్లకు వైద్యం అందించటంలో ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న టెక్నిషియన్లు, వార్డు బాయ్స్, పారిశుధ్య కార్మికులు,సెక్యూరిటి గార్డు ల వంటి అనేక మంది ఉద్యోగులు తమ నెలసరి వేతనాలతో కుటుంబాలను పోషించుకోవల్సి వస్తుందన్న విషయాన్ని ఆస్పత్రి యాజమాన్యం మరచినట్లు వ్యవహరిస్తోందన్నారు. కార్మిక చట్టం ప్రకారం సరైన వేతనాలు ఇవ్వక పోగా అరకొరగా ఇచ్చే వేతనాలను సైతం నెలల తరబడి ఇవ్వక పోతే ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలవుతున్నారన్నారు. ఆస్పత్రిలో పని చేసే వివిధ విభాగాలకు చెందిన కంట్రాక్టు ఉద్యోగులు రెండు గంటల పాటు పనులు నిలిపేసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వేణుకుమార్, రాష్ట్ర నాయకులు ధనరామ్,ఆస్పత్రి కంట్రాక్టు కార్మికులు క్రాంతి, భాస్సర్, పద్మ, నిరంకారి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**10 రోజుల్లో వేతనాలిస్తామంటూ రాతపూర్వక హామీ**

ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో కంట్రాక్టు కార్మికుల వేతనాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందునే సమయానికి జీతాలు చెల్లించలేక పోయామని, మరో 10రోజుల్లో వేతనాలు చెల్లిస్తామంటూ ధర్నా చేస్తున్న ఏఐటీయుసి ప్రతినిధులకు ఆస్పత్రి అధికారులు రాతపూర్వక హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు.




## కామ్రేడ్ అయోధ్య మరణం పార్టీకి తీరని లోటు
### వివిఎస్ బోస్

**ప్రజాపక్షం/కాప్రా :** కామ్రెడ్ అయోధ్య మరణం పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్ అన్నారు. సూర్యాపేటలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య చిత్రపటానికి గురువారం ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డిభవన్‌లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా నాలుగున్నర దశాబ్దాలకు పైగా అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించటంలో కామ్రెడ్ అయోధ్య విశేష కృషి చేసారన్నారు. మణుగూరు ప్రాంతంలోఆదివాసుల హక్కుల కోసం, పోడు భూముల పట్టాల కోసం సాగిన పోరాటంలో ఆయన కృషి గణనీయమన్నారు. జిల్లా పరిషత్ సభ్యుడిగా ప్రజాసమస్యలను లేవనెత్తి పరిష్కార దిశగా ఎనలేని కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, నేతలు సాయి, ప్రతాప్, అక్బర్, విజయ్,రాము, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ సేవా సంస్థ అవగాహన కార్యక్రమంలో రచ్చ
### అధికారులకు లేని విలువ ఓ సాధారణమైన వ్యక్తికి ఎందుకిచ్చినట్లు? మాకు తెలియకుండానే ఆ వ్యక్తి కూర్చున్నాడు అని సమాధానం చెప్పిన ఉపాధ్యాయులు..!!




**ప్రజాపక్షం/నవాబుపేట్ :** గురువారం నవాబ్ పేట మండల కేంద్రం లోని మోడల్ స్కూల్లో ఇన్చార్జి ప్రిన్సిపల్ విజయ్ కుమార్ సమక్షంలో న్యాయ సేవా సంస్థ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కానీ అక్కడ ఓ సంఘటన చోటుచేసుకుంది. వచ్చిన ముఖ్య అతిథుల, ఉపాధ్యాయులతో పాటుగా స్టేజి పైనే దర్జాగా కేవలం పాఠశాలకు, పిల్లలకు ఏలాంటి సంబంధం లేని పాఠశాలలో జేసీబీతో శుభ్రం చేయించిన వ్యక్తి కుర్చిలో కూర్చోవడం చర్చనీయంగా మారింది.కేవలం పాఠశాలలో జెసిబి పెట్టి పిచ్చి మొక్కలు తొలగిస్తే స్టేజి పైనే అధికార కార్యక్రమంలో కూర్చి వేసి కూర్చో పెడతారా అని ఆయా పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు. జ్ఞానవంతులైన ఉపాధ్యాయులే ఇలా చేయడం పై మండల ప్రజలు మండిపడ్డారు. కనీసం మండల విద్యాధికారికే సమాచారం లేకుండా కార్యక్రమం నిర్వహించారు. సరే కేవలం రెండు సార్లు పాఠశాల ఆవరణలో జెసిపి పెట్టి పిచ్చి మొక్కలు తొలగించినంత మాత్రాన ఓ సాధారణ వ్యక్తికి వేదిక మీదనే దర్జాగా కూర్చిలో కూర్చోవడం ఎంతవరకు సమంజసమని చర్చించుకుంటున్నారు. సుమారు పది రోజుల క్రితం పాఠశాలలో సమస్యలు తెలుసుకోవడానికి కొందరు వ్యక్తులుతో పాటు మీడియా వాళ్ళు వెళ్తే మీకు ఎవరు చెప్పారు మీకు అనుమతి ఉందా అంటూ ప్రశ్నించిన అధ్యాపకులుకు నేడు అధికారి కానీ సాధారణ వ్యక్తి వెళ్లి వేదిక మీదనే కూర్చుంటే ఎందుకు ప్రశ్నించలేదని బీజేపీ నాయకులు మండిపడుతున్నారు. అప్పుడు ప్రశ్నించడం తెలిసిన ఉపాధ్యాయులకు నేడు వేదిక మీద కూర్చున్న వ్యక్తిని పక్కన కూర్చోండని చెప్పడానికి రాలేదా అంటూ విమర్శలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అసలు వ్యక్తిని ఉపాధ్యాయులు వేదిక మీద కూర్చోబెట్టడంలో ఆంతర్యం ఏమిటని మండల ప్రజలు చర్చించుకుంటున్నట్లు తెలుస్తుంది.

**మాకు తెలియకుండానే కూర్చున్నారు**

ఇంచార్జ్ ప్రిన్సిపల్ సమక్షంలో ప్రభుత్వ మోడల్ స్కూల్లో న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓ సాధారణ (అనధికార) వ్యక్తి పాఠశాలల్లో పిచ్చి మొక్కలు తొలగించారని ఆ వ్యక్తిని స్టేజి మీదే కుర్చీలో ఉపాధ్యాయులతో పాటు కూర్చోవడం పై వివిధ పార్టీల నాయుకులు,మండల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇదేంటని ఉపాధ్యాయులను వివరణ కోరితే మాకు తెలియకుండానే స్టేజి మీద ఆ వ్యక్తి కూర్చున్నాడని చెప్పుకోరావడం విడ్డురంగా ఉందని ఏదేవా చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే అంశాలను న్యాయసేవ వారు అవగహన చేస్తే ఈ కార్యక్రమానికి స్థానిక మండల విద్యాధికారి కూడ సమాచారం ఇవ్వకపోవడం పై విమర్శలు వస్తున్నాయి. దీనిపై స్థాయి అధికారులు చర్యలు చేసుకుంటారా లేదా అనేది కూడా వేచి చూడాలి.





## ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి
### కమిషనర్ జ్యోతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట పురపాలక ప్రజలు ఇంటి, వాణిజ్య పన్నులను సకాలంలో చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌కు చెందిన దాసరి గోపాల్‌రెడ్డి రూ . 2,92,156 పన్నులనథ మున్సిపల్ బిల్ కలెక్టర్ రాంరెడ్డికి చెల్లించారు.

## 14న కరీంనగర్‌లో 'బిసి గర్జన సభ'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ తరపున ఈ నెల 14న కరీంనగర్ లో 'బిసి గర్జన సభ' నిర్వహించనున్నట్టు బిఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల విషయంలో అఖిలపక్షాన్ని న్యూఢిల్లీకి తీసుకెళ్తే కాంగ్రెస్ మోసం బయటపడుతుందని భావించి ఎవరినీ తీసుకెళ్లలేదని మధుసూదనాచారి ఆరోపించారు. ప్రభుత్వం తరపున న్యూఢిల్లీలో ధర్నా చేపట్టేందుకు వెళ్తున్నామని తలసాని శ్రీనివాస్ యాదవ్ లేదా తనకు ఏమైనా చెప్పారా అని ప్రశ్నించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశంపై జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాకు సోనియా గాంధీ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,మల్లిఖార్జున ఖర్గే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్లు పెంచితే 50శాతం లోబడి ఉండాలనే సుప్రీంకోర్టు తీర్పును నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ అమలు చేశారన్నారు. అప్పటి తమిళనాడు సిఎంగా జయలలిత ప్రధాన మంత్రిని,అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి రిజర్వేషన్లు సాధించారని గుర్తు చేశారు.

## ఉద్యోగుల వివరాలు ఇవ్వకపోవడంపై.. బిసి కమిషన్ అసంతృప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వివిధ శాఖలలో పనిచేస్తున్న బిసి ఉద్యోగుల సమాచారాన్ని ఇవ్వడంలో కొన్ని ప్రభుత్వ విభాగాలు సమర్పించకపోవడంపై బిసి కమిషన్ అసంతృప్తిని వ్యక్తం చేసింది. దీనిపై ఈ నెల 25న వివిధ ప్రభుత్వ శాఖల కార్యదర్శులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని కమిషన్ సమావేశం నిర్ణయించింది. తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమావేశం గురువారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో జరిగింది. కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, మెంబర్ సెక్రటరీ బాలా మాయా దేవి పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వివరాల సేకరణపై కమిషన్ సుదీర్ఘంగా చర్చించింది. డిఎన్‌టిలకు సర్టిఫికెట్లు కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల కోసం నిర్వహిస్తున్న సీడ్ పథకానికి దరఖాస్తు చేసుకునేవారికి డిఎన్‌టి సర్టిఫికెట్లు ఇచ్చే విధానంపై కమిషన్ త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. గ్రామ అభివృద్ధి కమిటీల (పంచాయతీ) పనితీరు, బిసి కులాలపై వాటి ప్రభావంపై ప్రత్యేక కమిటీతో అధ్యయనం చేయించాలని కమిషన్ నిర్ణయించింది. ఈ విషయమై కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయనుంది. అంతేకాకుండా, రాష్ట్రంలో జరిగిన కులగణన వివరాలను తమకు అందుబాటులో ఉంచాలని కోరనుంది. రాష్ట్రంలో మతం, కులం ఆధారంగా కాకుండా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి మాత్రమే ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు బిసి కమిషన్ స్పష్టం చేసింది. బిసిఈ గ్రూప్‌లో కూడా ముస్లింలలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు ఉంటాయని కమిషన్ స్పష్టం చేసింది.

## సోషల్ మీడియాలో భార్య నగ్నఫోటోలు పెట్టిన భర్త

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త అత్యంత నీచానికి పాల్పడ్డాడు. భార్య అసభ్యకర ఫోటోలను ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశాడు. సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ కు చెందిన భీంరాజ్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమించి మూడు నెలల క్రితం ఆర్య సమాజ్ లో వివాహం చేసుకున్నాడు. మద్యానికి బానిసైన భీంరాజ్ ఇటీవల భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ కారణంగా రోజూ ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు.భార్యకు సంబంధించిన ప్రైవేట్ ఫొటోలను ఇన్‌స్టాలో అప్ లోడ్ చేసి అసభ్యకరంగా కామెంట్లు పెట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు పుట్టింటికి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసింది.

ఫినాయిల్ తాగడంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భీంరాజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



## ఈవిఎం గోదాంను.. తనిఖీ చేసిన ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నగరంలోని ప్రధాన ఈవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)ల గోదాంను గురువారం తనిఖీ చేశారు. చుడి బజార్‌లో ఉన్న ఈ గోదాంలో భద్రతా ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా, గోదాంలో భద్రపరిచిన ఈవిఎంల నిల్వ స్థితి, స్టాక్ రిజిస్టర్లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. నిఘా కెమెరాల (సిసిటివి) పనితీరు, గోదాం మొత్తం భద్రతపై కూడా ఆరా తీశారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా భద్రతను పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన అక్కడి సిబ్బందిని ఆదేశించారు.



## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం
### అంగన్‌వాడి సూపర్‌వైజర్ నాగమణి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తల్లి పాలే బిడ్డలకు శ్రేష్టమని, పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలనే తాగించాలని అంగన్‌వాడి సూపర్ వైజర్ నాగమణి అన్నారు. గురువారం శామీర్‌పేట సెక్టార్‌లోని మూడుచింతలపల్లి మున్సిపల్ అద్రాస్‌పల్లిలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి సూపర్ వైజర్ నాగమణి మాట్లాడుతూ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణిలకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. తల్లి పాలను బిడ్డలకు తాగించడం వలన వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లి పాలను తాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు లలిత, బాలమణి, గర్భిణి స్త్రీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆత్మవిశ్వాసం ప్రశంసనీయం
### ఓయు ప్రొఫెసర్ జి.విజయ చరణ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయు)లో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో విద్యార్థులు చూపించిన ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అభినందనీయమని ఓయు హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సిడిసి) డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ చరణ్ అన్నారు.

సి.ఎఫ్.ఆర్.డి భవనంలో గురువారం యుజి, పిజి విద్యార్థుల కోసం అగ్రతాస్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో హెచ్‌సిడిసి ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ విజయ చరణ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు మంచి కంపెనీలలో ప్లేస్‌మెంట్, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామని తెలిపారు.

డిజిటల్ యుగంలో ఉద్యోగ విజయానికి అవసరమైన నైపుణ్యాలు, అనుభవాలతో విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు. సరైన శిక్షణ పొందడం ద్వారా కంపెనీలో చేరిన తర్వాత స్థిరమైన పనితీరును ప్రదర్శించి, విజయవంతమైన కెరీర్‌ను ఎలా నిర్మించుకోవాలో ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రతాస్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ అధికారులు, ఓయు విద్యార్థులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## నేరాలను అదుపు చేయడానికి సిసి కెమెరాలు దోహదం

ఇబ్రహింపట్నం ఏసిపి కెవిపి రాజు

**ప్రజాపక్షం/యాచారం :** నేరాలను అదుపు చేయడానికి సిసి కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని ఇబ్రహింపట్నం ఎసిపి కేవిపి రాజు అన్నారు.గురువారం మండల పరిధిలోని తక్కళ్ళపల్లి గ్రామంలో ఎస్అర్ హచరిస్ సహకారంతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను అయన ప్రారంభించారు. యువకులు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి, గ్రామ మాజీ ఎంపిటిసి గడల మాధవి మల్లేశ్, గ్రామ మాజీ సర్పంచ్ సంతోష, మాజీ ఉప సర్పంచ్ పగడాల శ్రీశైలం,పంచాయతీ కార్యదర్శి గోపాల్,కోరే జగదీష్‌రావు,రామాచారి,దోర్నాల జనార్థన్‌రావు,పడకంటి నితిన్,సుమన్‌రెడ్డి,బుచ్చయ్య, తులసి ఎస్ఐ మధుకుమార్ పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట మహాసభలను విజయవంతం చేయాలి : రామస్వామి



**ప్రజాపక్షం/షాబాద్ :** సిపిఐ రాష్ట్ర నాల్గవ మహా సభలను విజయవంతం చేయాలని పార్టీ చేవెళ్ల నియెజకవర్గ ఇంచార్జ్ రామస్వామి అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో సిపిఐ రాష్ట్ర నాల్గవ మహా సభల వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్, మక్బూల్, సిపిఐ కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, నాయకులు కృష్ణ గౌడ్, వడ్ల మంజుల ఉన్నారు.

## యువతకు నైపుణ్యం ముఖ్యం

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



**ప్రజాపక్షం/హయత్ న గర్:** నేటి యువత కు ఉపాధి కల్పనలో నైపుణ్యం చాలా ముఖ్యం అని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే డి.సుదీర్‌రెడ్డి అన్నారు. బుధవారం దివ్యంగులకు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల యువత ట్రైన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఉపాధి కల్పన శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో అమిషా ప్రభు, సత్యం చారి, ప్రతిక్, సురేష్ పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు


కార్పొరేటర్ సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీ, గణేష్ నగర్ కాలనీల్లో సిసి రోడ్డు నిర్మాణ కొరకు జిహెచ్ఎంసి నుంచి రూ.కోటి 88లక్షలు నిధులు మంజూరైనట్లు హస్తినాపురం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కొరకు తను నిరంతరం కృషి కృషి చేస్తున్నామన్నారు.

## రేషన్ కార్డుల మంజూరులో దళారీ వ్యవస్థను అరికట్టాలి

కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంలో రేషన్ కార్డుల మంజూరు పూర్తిగా దళారుల చేతుల్లోకి వెళ్లిందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ ఆరోపించారు. గురువారం ఏసిఎస్ఓ అధికారి పుల్లయ్యతో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం చేతులెత్తేసినట్లే కనిపిస్తుందని, ప్రత్యేకించి ఓ వర్గానికి మాత్రమే రెడ్ కార్పెట్ వేసినట్లు, మరొక వర్గం అసలైన లబ్దిదారులు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఫుడ్ సెఫ్టీ అధికారులు డివిజన్‌లో ఎన్ని ధరఖాస్తులు వచ్చాయో, ఎన్ని తిరస్కరించబడ్డాయో తెలిపే విధంగా లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు చొరువ తీసుకుని దళారీ వ్యవస్థను కట్టడి చేసి అసలైన లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరారు.

## చేనేతను కాపాడుదాం.. చేనేత కార్మికులను ప్రోత్సహిద్దాం

సిఆర్ ఫౌండేషన్ అడ్వైజర్ ఉష




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి;** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళ సంక్షేమ కేంద్రం తరుపున వస్త్ర ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ అడ్వైజర్ ఉష, చేనేత నిపుణులు శ్రీమతి ముళ్ళపూడి సుధారాణిలు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత పరిశ్రమ ఉపాధి అని సిఆర్ ఫౌండేషన్ బెరర్ పిజె చంద్రశేఖర్ తెలిపారు. చేనేత వస్త్రాలపై జిఎస్టి తొలగించాలని డాక్టర్ ప్రతిభ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ ఆఫిస్ బెరర్ పిజె చంద్రశేఖర్, ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ కల్పన జోషభట్ల, వంకా లక్ష్మి, అరుట్ల మమత, లలిత, డాక్టర్ బివి విజయలక్ష్మి, డాక్టర్ రజని, డాక్టర్ అరుణ, మంజరి, మెహర్, డాక్టర్ ప్రతిభ, ఫాతిమా, విజయ నర్సింగ్, జ్యోత్స్న పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని లాల్ బహుదూర్‌శాస్త్రి తనయుడిని కలిసిన ఉప్పల



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్‌శాస్త్రి తనయుడు ఏఐసిసి మాజీ ప్రధాన కార్యధర్శి, మాజీ కేంద్రమంత్రి అనిల్ శాస్త్రీని టిపిసిసి సభ్యుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త ఢిల్లీలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

# వరదల నివారణకు మాస్టర్ ప్లాన్

వరదల సమస్య శాశ్వత పరిష్కారానికి సంకల్పించిన ప్రభుత్వం
రూపకల్పనకు బల్దియాకు బాధ్యత అప్పగించిన సర్కార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగరంలో వరదల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. వర్షాల సమయంలో వరదలతో నగరం అల్లాడుతోంది. చిరు జల్లులకే నగరం చిగురుటాకులా వణికిపోతోంది. భారీ వర్షం పడితే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరదలు, నీటి నిల్వ సమస్య నగర కీర్తికి ఒక మచ్చగా మారుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం సంకల్పించింది. వరద నియంత్రణ కోసం 'స్మార్ట్ వాటర్ మాస్టర్ ప్లాన్' సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిహెచ్ఎంసికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు అర్హత కలిగిన కన్సల్టెంట్లను ఎంపిక చేయడానికి టెండర్లు పిలవాలని ప్రభుత్వం జిహెచ్ఎంసిని ఆదేశించింది. ఈ కొత్త ప్రణాళికతో హైదరాబాద్‌లోని వరదల సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు అంటున్నారు.

మాస్టర్ ప్లాన్ లక్ష్యాలు..

– నగరంలో వరదలను నివారించడానికి దీర్ఘకాలిక పరిష్కారాలను ఈ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తుంది.
– నగరంలోని చెరువుల పరిరక్షణకు, వాటి పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెడుతుంది.
– మూసీ నది, హుస్సేన్ సాగర్ కారణంగా సంభవించే వరదలను నియంత్రించడానికి మార్గాలను అన్వేషిస్తుంది.
– వర్షపు నీటి కాలువల్లో ఇతర వ్యర్థ జలాలు కలవకుండా చర్యలు తీసుకుంటుంది.
– వర్షపు నీటిని సరైన పద్ధతిలో సేకరించి, వినియోగించుకునేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తుంది.

## హెచ్ సిటీ, ఎస్ఎన్‌డిపి ప్రాజెక్టుల పనులు వేగవంతం

అధికారులను ఆదేశించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి పరిధిలో జరుగుతున్న హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్ సిటీ ), స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ( ఎస్ఎన్‌డిపి ) ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పురోగతిపై గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. హెచ్ సిటీ, ఎస్ఎన్‌డిపి ఫేజ్II పనుల పురోగతి, భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్, క్షేత్ర స్థాయి సమస్యలపై ఇంజనీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ల ద్వారా కమిషనర్‌కు వివరించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ఖర్చులను, ఎదురవుతున్న సవాళ్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు, వారంలో ఒకరోజు జోనల్ పరిధిలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సంబంధిత జోనల్ కమిషనర్ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. హెచ్ సిటీ, ఎస్ఎన్‌డిపి ప్రాజెక్టుల డిజైన్‌లను జిహెచ్ఎంసి అంతర్గత డిజైన్ టీమ్‌తోనే పూర్తి చేసుకోవాలని, ప్రైవేట్ కన్సల్టెంట్‌లపై ఆధారపడటం తగ్గించాలని సూచించారు. ఐఐటి, ఎన్ఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి వచ్చిన అర్హులైన ఇంజనీర్లను గుర్తించి, డిజైన్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ అడ్మిన్‌ను ఆదేశించారు. డిజైన్ టీమ్ బలోపేతానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, లేక్స్, ఎస్ఎన్‌డిపి చీఫ్ ఇంజనీర్ జ్యోతిర్మయి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పివి.రావు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షపాతం నమోదు

అత్యధికంగా శేరిలింగంపల్లిలో 12.3 సెంటిమీటర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి నగర వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 12.3 సెంటిమీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఖైరతాబాద్‌లో 11.13, సరూర్‌నగర్‌లో 10.6, ఉప్పల్‌లో 9.5, షేక్‌పేట్‌లో 9, ఉప్పల్ న్యూ నాగోల్‌లో 8, బండ్లగూడలో 8, దిల్‌సుఖ్‌నగర్‌లో 8.2, లింగోజిగూడలో 7.6, మలక్‌పేట్ ఆస్మాన్‌గఢ్‌లో 7.6, ఉప్పల్ రామాంతపూర్‌లో 7.5, నాగోల్‌లో 7.4 బాలానగర్‌లో 7, జూబ్లీహిల్స్‌లో 6.9 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది.

## హిమాయత్ సాగర్ గేట్ల ఎత్తివేత

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు హిమాయత్‌సాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌కు భారీస్థాయిలో వరద నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నీరు చేరింది. దీంతో గురువారం రాత్రి 10 గంటలకు రిజర్వాయర్ 1 గేటు ఒక అడుగు మేర అధికారులు ఎత్తారు. ఈ నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

## అంబేడ్కర్ జయంతి ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ పోటీ విజేతలకు హెచ్ఎండిఏ సత్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) నిర్వహించిన ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ పోటీ విజేతలకు గురువారం సత్కారం జరిగింది. ఈ పోటీలో డాక్టర్ అంబేడ్కర్ విలువలు, ఆశయాలపై సృజనాత్మక కళాఖండాలను రూపొందించాలని హెచ్ఎండిఏ విద్యార్థులను ప్రోత్సహించింది. తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, సాధికారత వంటి అంశాలపై తమ ఆలోచనలతో కూడిన కళా ప్రతిపాదనలను సమర్పించారు. వీటిలో ఐదు ఉత్తమ ఎంట్రీలను హెచ్ఎండిఏ ఎంపిక చేసింది. సత్కార కార్యక్రమంలో హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. విజేతల కళాఖండాలను అంబేడ్కర్ మ్యూజియం, విగ్రహం వద్ద శాశ్వత ఇన్‌స్టాలేషన్లుగా ఏర్పాటు చేయనున్నారు. ఇది డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతిబింబించడమే కాకుండా మ్యూజియం సందర్శకులకు మరింత ప్రేరణను ఇస్తుంది. పౌర భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, యువతను భాగస్వాములను చేయడం పట్ల హెచ్ఎండిఏకి ఉన్న నిబద్ధతను ఈ కార్యక్రమం తెలియజేస్తుంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వాలని హెచ్ఎండిఏ లక్ష్యంగా పెట్టుకుందని అధికారులు వివరించారు.

## భగత్‌సింగ్ నగర్‌లో.. ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన హైడ్రా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం, గాజుల రామారం లోని భగత్ సింగ్ నగర్‌లో ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. 2 వేల గజాలకు పైగా ఉన్న స్థలం చుట్టూ గురువారం కంచె వేసి హైడ్రా పరిరక్షించింది. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు, ఇతర ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమి కబ్జాకు గురౌతోందని భగత్‌సింగ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి పరిరక్షణ సమితి ఫిర్యాదు మేరకు హైడ్రా పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. ప్రజావసరాలకు ప్రభుత్వం కేటాయించిన భూమిగా నిర్ధారించుకుంది. 2021లోనే స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు రూ. 26.8 లక్షలు జిహెచ్ఎంసి నిధులు మంజూరు చేసింది. కొంతమేర ప్రహరీ నిర్మాణాన్ని కూడా చేపట్టింది. పనులు పూర్తి కాకపోవడంతో కబ్జాలకు తెరదీసినట్టయ్యింది. ఇదే విషయాన్ని హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో వెంటనే కబ్జాలకు తెరదించుతూ చుట్టూ కంచె వేసింది.





## పరిసరాలను కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో సెంటర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సలహాదారు డైన డిప్యూటీ రేంజ్ అధికారి మహమ్మద్ రఫీఉద్దీన్ ఆధ్వర్యంలో పాఠశాలలో 250 మెడిసినల్ చెట్ల మొక్కలను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఆఫ్ ఆర్‌ఓ కసనా నాయక్‌లతో కలిసి విద్యార్థులు పాఠశాల అవరణలో మొక్కలను గురువారం నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎవి దినేష్, శంకరయ్య గౌడ్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి


ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని, పారిశుద్ధ్య సిబ్బంది తల్లిదండ్రులతో సమానమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కొనియాడారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధీలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భరత్ నగర్ డివిజన్ల పరిధీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు , సిబ్బందికి శేరిలింగంపల్లి జోనల్ కార్యలయంలో పిపిఇ కిట్లను అందజేసే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరెకపూడీ గాంధీ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బొర్ఖడే, సర్కిల్ డిసి శశిరేఖ, కార్పొరేటర్లు గంగాధార్ రెడ్డి, అధికారులు ఎయంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డిలు హాజరై పారిశుద్ధ్య కార్మికులకు పిపిఈ కిట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు పారిశుద్ధ్య కార్మికులు మన పరిసర ప్రాంతాలను , కాలనీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ కాలనీలలో ప్రశాంత వాతవరణం కోరకు నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు. పిపిఈ కిట్లలో రెయిన్ కోర్ట్, టోపి మాస్కులు, శానిటైజర్లు, కొబ్బరి నూనె, సబ్బులు, షూస్, హాండ్ గ్లౌస్‌లు వంటి 11 రకాల వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, మంత్రిప్రగడ సత్యనారయణ, రంగస్వామి, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తీర్చమన్నందుకు కిడ్నాప్, హత్యాయత్నం

రోడ్డు ప్రమాదంతో బయటపడిన ఘటన - ముగ్గురు అరెస్ట్



**ప్రజాపక్షం/శంషాబాద్ :** అప్పు తిరిగి ఇచ్చేదిలేదని ప్రశ్నించిందన్న కోపంతో ఓ మహిళను కిడ్నాప్ చేసి హత్య చేయాలని యత్నించిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో వెలుగులోకి వచ్చింది. మారుతి ఎర్టిగా వాహనంలో ఆమెను బలవంతంగా తీసుకెళ్తుండగా జరిగిన ప్రమాదంతో ఈ దుర్మార్గపు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం ... చేవెళ్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన పద్మజ, బుచ్చయ్య దంపతులు అదే గ్రామానికి చెందిన కమ్మెట విజయ్ గౌడ్‌కు రూ.4 లక్షలు అప్పుగా ఇచ్చారు. డబ్బు తిరిగి ఇవ్వలేకపోయిన విజయ్ గౌడ్ పద్మజపై పగపట్టి ఆమెను హత్య చేసేందుకు కుట్రపన్నాడు. ఈనేపథ్యంలో... ఆగస్టు 5వ తేదీ శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో ఉన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భర్తకు బట్టలు తీసుకెళ్లేందుకు పద్మజ వెళ్లారు. భర్తకు పండ్లు తెచ్చేందుకు ఆసుపత్రి బయటకు వచ్చిన సమయంలో విజయ్ గౌడ్, అతడి మిత్రులు వెంకటేష్, సాయి కలిసి కారులో వచ్చి ఆమెను బలవంతంగా కారులోకి ఎక్కించారు. కారు నడుపుతూ విజయ్ గౌడ్, దారిలో పద్మజను బెదిరించారు. ఆమె పారిపోవడానికి ప్రయత్నించగా, ముగ్గురు కలిసి దాడికి పాల్పడ్డారు. అంతలోనే శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్వాల్‌గూడ సమీపంలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో... బీఎండబ్ల్యూ వాహనాన్ని ఢీకొనడంతో కారు లోపలే గందరగోళం నెలకొంది. ఈప్రమాదంలో పద్మజకు గాయాలయ్యాయి. వెంటనే ఎయిర్‌పోర్ట్ పోలీసులు వచ్చి బాధితులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. పూర్తి విచారణ కొనసాగుతోంది.

## ప్రపంచ స్థాయి టెక్నాలజీ కేంద్రంగా హైదరాబాద్ : జయేష్ రంజన్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హైదరాబాద్ ప్రపంచ స్థాయి టెక్నాలజీ కేంద్రంగా ఎదగడమే కాకుండా స్థానిక ఆవిష్కర్తలకు కూడా అద్భుత వేదికగా మారిందని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. "హైదరాబాద్ ను గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చిన ప్రయాణం కృత్రిమ మేధస్సు(ఎఐ) పాత్ర" అనే అంశంపై సినీ దర్శకుడు దోనూరు జయభరత్ రెడ్డి తెలంగాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో చర్చించారు. టి హబ్‌లో జరిగిన ఈ సమావేశంలో హైదరాబాద్‌లో స్టార్టప్‌లు, టెక్నాలజీ రంగం,కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యాపారాలు ఎలా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి అనే విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ "ఎఐ ద్వారా ఆరోగ్యం, పాలన,సృజనాత్మక రంగాల వరకు విస్తరించే అభివృద్ధి సాధించాలనేది మా లక్ష్యం"అన్నారు. సినీ దర్శకుడు జయభరత్ రెడ్డి మాట్లాడుతూ "హైదరాబాద్ ఒక టెక్ సిటీ మాత్రమే కాదు, సాంస్కృతికంగా సృజనాత్మకతతో నిండి ఉన్న నగరం అని వివరించారు.

# రీల్

## మలయాళ సంస్కృతి 'ఓనమ్' గొప్పతనాన్ని తెలిపే పాట






కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కె ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. 'కె ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేటర్లలో రిలీజ్ కాబోతోంది. 'కె ర్యాంప్' సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. ఈ నెల 9వ తేదీన 'ఓనమ్' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పాట కోసం ఎనర్జిటిక్ ట్యూన్ కంపోజ్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్. కేరళ పండుగ ఓనమ్ నేపథ్యంగా సాగే ఈ పాటను మలయాళ ట్రెడిషన్ చూపించేలా కలర్ ఫుల్ గా రూపొందించారు. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.

## నిర్మాతల మధ్య విబేధాలు లేవు

### సి.కళ్యాణ్ వివరణ ఛాంబర్‌లో చిన్న నిర్మాతల భేటీ



తెలుగు సినిమా పరిశ్రమలో గత నాలుగు రోజులుగు కార్మికుల సమ్మె జరుగుతున్న నేపథ్యంలో రోజుకొక తరహాలో చర్చలు విఫలం అవుతూనే ఉన్నాయి. నిర్మతలు కొంత మంది చిరంజీవి దగ్గరికి వెళ్లి తమ సమస్యలు చెప్పుకోగా, మరికొంతమంది నిర్మాతలు బాల కృష్ణ దగ్గరికి వెళ్లి మొర పెట్టుకున్నారు. దీంతో నిర్మతల మధ్య సయోధ్య లేదు, నిర్మాతల మధ్య అభిప్రాయం బేధాలు వచ్చాయని ఫిల్ నగర్ లో చర్చ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నిర్మాత సి కళ్యాణ్ మీడియా అడిగిన ఓ ప్రశాంకు సమాధానం చెబుతో వివరణ ఇచ్చారు. '' నిర్మాతల మధ్య ఎలాంటి అభిప్రాయబేధాలు లేవు. చిరంజీవిని కలిశాం. అలాగే బాలకృష్ణను కలిసాం. ఇద్దరికీ తమ సమస్యలు చెప్పాం. అగ్రహీరోల దృష్టికి కూడా నిర్మాతల సమస్యలు తీసుకువెళ్లాలని ఉద్దేశ్యంతోనే కలిశాం తప్ప ఇందులో భిప్రాయబేధాలు ఏమి లేవు'' మని పేర్కొన్నారు. చిన్న నిర్మాతల సమస్యలు కూడా చర్చించామని అన్నారు. చిన్న నిర్మాతలు థియేటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదికి 300 సినిమాలు విడుదల అయితే అందులో 200 సినిమాలు చిన్న నిర్మతలవే. చిన్న సినిమా లేకపోతే పరిశ్రమ లేదు, కార్మికులు లేరు. చిన్న సినిమాలకు 25 శాతం తగ్గుతామని గతంలో చెప్పారు కానీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. పెద్ద సినిమాల నిర్మాతలు ఇష్టమొచ్చినట్టు వేతనాలు పెంచేసి , పెంచిన వేతనాలను చిన్న సినిమా నిర్మాతలపై రుద్దవద్దని వేడుకుంటున్నామని కళ్యాణ్ , నట్టి కుమార్, చదలవాడ శ్రీనివాస్ రావు, ప్రతాని రామకృష్ణ గౌడ సాయి వెంకట్ ఫిలిం ఛాంబర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. చిన్న సినిమా నిర్మించాలంటే తక్కువలో తక్కువ నాలుగు కోట్లు ఖర్చు అవుతోందని చెప్పారు. సమ్మెతో సంబంధం లేకుండా కార్మికులు చిన్న సినిమాలకు పని చేసుకోవచ్చని అన్నారు.. పని లేక అనేక మంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, అలనాటి వారికీ పని కల్పించాల్సిన బాధ్యత ఇండస్ట్రీపై ఉందని వారన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నామని వారు తెలిపారు.

## ఫిల్మ్ ఛాంబర్‌లో కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్

సినిమా కార్మికుల సమ్మె పంచాయతీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం వద్దకు చేరింది. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఎఫ్ డీ సి చైర్మన్ దిల్ రాజు సారధ్యంలో ఫిలిం ఛాంబర్ కో ఆర్డినేషన్ కమిటీ భేటీ జరిగింది. ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ తో పాటు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్ కూడా ఈ సమావేశానికి హాజరైయ్యారు. ఈ కో ఆరినేషన్ కమిటీకి వీర శంకర్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. పలువురు నిర్మాతల మండలి సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. 30 శాతం వేతనాలు ఇవ్వాల్సిందేనని కార్మికుల పక్షాన ఫెడరేషన్ వాదన చేసినట్టు సమాచారం. 30 శాతం పెంపుకు నిర్మాతలు ససేమిరా అంగీకరించకపోవడంతో మధ్యస్థంగా 20శాతం మేర వేతనాలు పెంచే ప్రతిపాదన కూడా ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక పక్క ప్రభుత్వం, మరోపక్క చిరంజీవి, బాలకృష్ణ కూడా రంగంలో దిగిన నేపథ్యంలో త్వరలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అందరూ భావిస్తున్నారు.

## అనుష్క ఘాటీ ట్రైలర్ రిలీజ్




అరుంధతి సినిమా తరువాత అంతటి ఫరెవర్ ఫుల్ లేడి ఓరియంటేడ్ లో అనుష్క నటిస్తున్న సినిమా 'ఘాటీ . క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లముడి ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. యువి క్రియేషన్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.బ్రిటిష్ రాజ్ కాలంలో ప్రమాదకరమైన కనుమలలో చారిత్రాత్మకంగా రోడ్లు నిర్మించిన ఘాటి సమాజ ప్రపంచాన్ని పరిచయం చేసే పవర్ ఫుల్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఇప్పుడు, వారు కొండల్లో డ్రగ్స్ మోసే పనుల్లో చిక్కుకుపోయారు.ఈ కఠినమైన పరిస్థితులు చిక్కుకున్న ప్రేమికుల జంటగా అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు కనిపించారు. అనుష్క పాత్ర అవినీతి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతుంది. తప్పు చేస్తున్నామనే గ్రహించి, ఈ చెడు వ్యవస్థకి ఎదురు నిలవడానికి రెడీ అవుతుంది. తన వాళ్లని ఈ ప్రమాదకర వ్యాపారం నుంచి బయటకు లాగడానికి ప్రయత్నిస్తుంది.ట్రైలర్ లో అనుష్కను మునుపెప్పుడూ చూడని వైల్డ్ అవాతర్ లో కనిపించారు. ఒక బలహీన మహిళ నుంచి క్రిమినల్, అక్కడి నుంచి లెజెండ్‌గా మారే ఆమె పాత్ర ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. ఆమె అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో పాత్రకి ప్రాణం పోస్తుంది. విక్రమ్ ప్రభు పర్ఫార్మెన్స్ స్ట్రాంగ్ గా వుంది . చైతన్య రావు, రవీంద్రన్ విజయ్ విలన్ పాత్రల్లో ఆకట్టుకున్నారు. జగపతి బాబు పాత్ర మరింత క్యురియాసిటీ పెంచింది. దర్శకుడు క్రిష్ జాగర్లముడి ఒక ప్రత్యేకమైన, బోల్డ్ కథను తెరపైకి తెచ్చారు. ఎమోషన్, యాక్షన్ తో కథ అద్భుతంగా నడిపించారు. సినిమాటోగ్రాఫర్ మనోజ్ రెడ్డి కటసాని తీసిన విజువల్స్ చూస్తే… ఆ ఘాట్లు మన ముందుకొచ్చినట్టు ఫీలింగ్ కలుగుతోంది. మ్యూజిక్ డైరెక్టర్ నాగవెల్లి విద్యాసాగర్ ఇచ్చిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ సీన్స్ ని ఎలివేట్ చేసింది.ఆర్ట్ డైరెక్టర్ తోట తరణి సెట్స్ వండర్ ఫుల్. సాయి, మాధవ్ బుర్రా రాసిన డైలాగులు అందరికీ కనెక్ట్ అవుతున్నాయి. ఎడిటర్స్ చాణక్య రెడ్డి తూరుపు, వెంకట్ ఎన్. స్వామి ఇంటెన్స్ అండ్ షార్ప్ గా కట్ చేశారు. యాక్షన్ మాస్టర్ రామ్ కృష్ణ ప్లాన్ చేసిన ఫైట్ సీన్స్ చాలా బాగా వచ్చాయని దర్శకుడు క్రిష్ చెప్పారు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ సినిమాను సెప్టెంబర్ 5న థియేటర్స్ లో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు.

## 'లిటిల్ హార్ట్స్' నుంచి 'రాజాగాడికి' సాంగ్ లాంఛ్

'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ రోల్స్ లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు చేస్తున్నారు. . ఈ చిత్రం నుంచి రాజాగాడికి పాటను నిర్మాత బన్నీ వాసు లాంఛ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్' సినిమాను మేము రిలీజ్ చేస్తే బాగుంటుంది అని మా దగ్గరకు వచ్చిన సాయి మార్తండ ఆదిత్యకు థ్యాంక్స్ చెబుతున్నా. వాళ్లు నా మీద నమ్మకం పెట్టుకున్నారు. ప్రేక్షకుల్ని బాగా నవ్వించే మూవీస్ చేయాలని నేను కోరుకుంటాను.సెప్టెంబర్ 12న థియేటర్స్ లో విడుదల చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి , హీరోయిన్ శివానీ నాగరం, డైరెక్టర్ సాయి మార్తండ హీరో మౌళి తనూజ్, ప్రొడ్యూసర్ ఆదిత్య హాసన్ , ఈటీవీ విన్ బిజినెస్ హెడ సాయికృష్ణ, ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి పాల్గొన్నారు.



## మేఘం వర్షించదా' పాట ఆవిష్కరణ



విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రీలీజైన టీజర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా ఫస్ట్ సింగిల్ 'మేఘం వర్షించదా ' అనే పాటను రిలీజ్ చేశారు. విఘ్నేష్ బాస్కరన్ బ్యూటీఫుల్ లవ్ సాంగ్ గా కంపోజ్ చేశారు. విక్రాంత్ రుద్ర రాసిన సాహిత్యం మనసుని హత్తుకునేలా వుంది. కపిల్ కపిలన్, మీరా ప్రకాష్ , సుజిత్ శ్రీధర్ తమ మ్యాజికల్ వాయిస్ తో కట్టిపడేశారు. ఈ సాంగ్ లో విజయరామరాజు, సిజా రోజ్ కెమిస్ట్రీ లవ్లీగా వుంది. అద్భుతమైన స్పోర్ట్స్ డ్రామాతో పాటు హార్ట్ టచ్చింగ్ లవ్ స్టోరీతో అర్జున్ చక్రవర్తి అలరించబోతుందని ఈ సాంగ్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రంలో హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు, ఈ చిత్రానికి జగదీష్ చీకాటి డీవోపీ, ప్రదీప్ నందన్ ఎడిటర్ , సుమిత్ పటేల్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఈడే కృష్ణ చైతన్య వ్యవహరించారు. సంగీతం: విఘ్నేష్ బాస్కరన్ సంగీతం అందించారు.

## జన నేతకు ఘన వీడ్కోలు

(మొదటి పేజీ తరువాయి)

అటు నుండి నేరుగా మణుగూరు సిపిఐ కార్యాలాయానికి తరలించిన విషయం విదితమే. ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్ధం ఉంచి అక్కడి నుంచి రాత్రి 10గంటలకు అయోధ్య స్వగ్రామమైన రామానుజవరంకు తీసుకువచ్చారు. గురువారం అశ్రునయాల నుడమ బరువెక్కిన గుండెలు, కన్నీటిధారల మధ్య అంత్యక్రియలు జరిగాయి.

**జనసంద్రమైన రామానుజవరం :** అయోధ్య స్వగ్రామమైన రామానుజవరం జనసంద్రమైంది. తన అభిమాన నాయకున్ని చివరి చూపు చూసేందుకు వేలాదిగా జనం తరలివచ్చారు. రాష్ట్రంతోపాటు జిల్లా నలు మూలల నుండే కాకుండా ఆయనకు సుపరిచితులుసైతం అయోధ్యను కడసారి చూసేందుకు బారులు తీరారు. ప్రధానంగా పినపాక నియోజవర్గవ్యాప్తంగా పల్లెలు అయోధ్యకు అంతిమ వీడ్కోలు తెలిపాయి. తాము ఇప్పుడు ఆయా గ్రామాల్లో ఉంటున్నామంటే సిపిఐ పోరాటాల ఫలితమే అని గుర్తు చేసుకుంటూ పార్థివ దేహాన్ని చూసి బోరున విలపించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మృత దేహాన్ని చూసి సిపిఐ నేతలతో పాటు పలువురు కంటతడిపెట్టారు. ప్రధానంగా సిపిఐ నేతలు చాడా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, సాబీర్ పాషాలు వారితో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూ ఒక్క సారిగా భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు. సిపిఐ నేత బొల్లోజు అయోధ్య అంతిమ యాత్ర వేలాది మందితో సాగింది. సుమారు నాలుగు కిలోమీటర్ల దారిపొడవునా జనం కన్నీటి నిరాజనాలు అర్పించారు. అంతిమయాత్రలో అయోధ్య చిత్రపటానికి యువత పాలాభిషేకం చేశారు. డప్పు వాయిద్యాలు, ఎర్రజెండాలు, విప్లవగీతాలు, జన జోహార్లతో అంతిమయాత్ర రహదారి మార్మోగింది. ఏటూరునాగారం, మణుగూరు ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు 40 ఏళ్లపాటు అనేక నిర్బంధాలను ఎదుర్కొని, అనేక ఆటుపోట్ల నడుమ ఈ ప్రాంతంలో బలమైన ఉద్యమాన్ని నిర్మించిన సిపిఐ నిబద్ధత గల నేత బొల్లోజు అయోధ్య లేడని నిజాన్ని ఇక్కడి జనం నమ్మలేకుండా ఉన్నారు.

**పలువురి నివాళి:** భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు, ఆంధ్రప్రదేశ్ సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మునీర్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, టిడిపి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, సిపిఐ అనుబంధ మహిళా సంఘం, ఏఐటియూసి అనుబంధ సంఘాలైన హామాలీ, బొగ్గుముఠా సంఘం, సింగరేణి లారీ యూనియన్ నాయకులు, గిరిజన సంఘాలతో పాటు పలువురు ఘన నివాళ్లర్పించారు.

## వేతనాలు పెంచాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)


మాట్లాడారు. తెలుగు సినిమా కార్మికులు తమకు వేతనాలు పెంచాలంటే ముంబాయి నుంచి సిసీ కార్మికులను తీసుకువచ్చి పని చేయించుకుంటామని సినీ నిర్మాతలు బెదిరింపులకు పాల్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇక్కడి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే సిపిఐ ప్రత్యేక్షంగా ఉద్యమంలో పాల్గొన్నడంతో పాటు ఎంత వరకైనా ముందుకెళ్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో తెలుగ సినిమా రంగంలో రాష్ట్రంలో కేవలం 10 కుటుంబాలు , థియేటర్లు 4 కుటుంబాల చేతుల్లో ఉన్నాయని వారే మొత్తం ఆడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం సందేశాత్మక చిత్రాలకు మాత్రమే ప్రొత్సహం అందించాలని డిమాండ్ చేశారు. వందల కోట్లతో సమాజాన్ని చెడు మార్గం పట్టించేలా తీస్తున్న చిత్రాలకు ఏలాంటి పరిస్థితుల్లో రాయితీలు ఇవ్వరాదని, టికెట్ల పెంపునకు అనుతులు ఇవ్వరాదని సూచించారు. పెద్ద పెద్ద నిర్మాతలు, హీరోలను పిలిచి మాట్లాడే ముఖ్యమంత్రి సినిమా కార్మికులను పిలిచి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.ప్రభుత్వానికి పక్షపాతం సరికాదని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకూండా చూడాలని కోరారు.

**చిరంజీవి నైతికతకే వదలి వేస్తున్నా : నారాయణ**

గతంలో తాను సినీ నటుడు చిరంజీవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను అప్పుడే ఉపసంహరించుకుని, అందుకు క్షమాపణ కూడా చెప్పానని, దీంతో ఆ అంశం ముగిసిపోయిందని, కానీ చిరంజీవి మళ్లీ ఆ ప్రస్తావనను తీసుకురావడం, ఆ వీడియోలను వైరల్ చేయడం సరికాదని నారాయణ అన్నారు. ఈ అంశాన్ని చిరంజీవి నైతికతకు, విజ్ఞతకే వదిలి వేస్తున్నాని నారాయణ పేర్కొన్నారు.

# వచ్చేవారం ట్రంప్-పుతిన్ ముఖాముఖీ!

### ఉక్రేన్ సమస్యపైనే ప్రధాన చర్చ



**మాస్కో:** రష్యా–అమెరికా దేశాధ్యక్షులు పుతిన్–ట్రంప్ మధ్య వచ్చేవారం ముఖాముఖీ సమావేశం జరిగే అవకాశం ఉంది. వీలైతే తాను వచ్చేవారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో ట్రంప్‌ను కలిసేవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో క్రెమ్లిన్‌లో గురువారం సమావేశం అనంతరం ట్రంప్‌తో సమావేశం గురించి పుతిన్ ప్రకటన చేశారు. ఐతే వైట్‌హౌస్ దీనిపై వెంటనే స్పందించలేదు.ఉక్రేన్‌లో మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ట్రంప్ ప్రభుత్వం పుతిన్‌పై తీవ్ర ఒత్తిడిచేస్తున్నది. కాల్పుల విరమణ ఒప్పందానికి విధించిన 10–12 రోజుల గడువు తేదీ ఆగస్టు 8వ తేదీ (శుక్రవారం)తో ముగుస్తున్న తరుణంలో పుతిన్ పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు. పుతిన్ విదేశీ వ్యవహారాల సలహాదారుడు యూరీ ఉషకోవ్ మాస్కోలో అంతకుముందు మాట్లాడుతూ, పుతిన్–ట్రంప్ మధ్య శిఖరాగ్ర సదస్సు వీలైతే వచ్చేవారం జరుగుతుందని, వీరిద్దరి సమావేశ వేదికను సూత్రప్రాయంగా ఇంకా నిర్ధారించాల్సి ఉందన్నారు. ఈ శిఖరాగ్ర సదస్సులో ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా పాల్గొనే అవకాశాలను ఆయన తోసిపుచ్చారు. ఉక్రేన్ విషయం చర్చించేందుకు విట్‌కాఫ్ మాస్కో వెళ్ళి బుధవారం మూడు గంటలపాటు పుతిన్‌తో సమావేశం జరిపారు. ఐతే ట్రంప్,జెలెన్స్కీ,పుతిన్ మధ్య త్రైపాక్షిక సమావేశం జరగాలని విట్‌కాఫ్ ప్రతిపాదించారు. ఈ విషయంలో తుది నిర్ణయం తమదేనని,త్రైపాక్షిక సమావేశానికి అవకాశమే లేదని యూరి ఉషకోవ్ అన్నారు. ట్రంప్‌తో సమావేశమయ్యేంకు పుతిన్ అంగీకరించారని చెప్పారు. స్టీవ్ విట్‌కాఫ్ ఇంతకు ముందు ఐదుసార్లు మాస్కోలో పర్యటించి పుతిన్‌తో, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరిపినాగానీ ఎలాంటి ఫలితం రాలేదు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో చర్చకు తాను సిద్ధంగా ఉన్నాననీ, కానీ అందుకు తగిన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని కూడా పుతిన్ చెప్పారు. జెలెన్స్కీతో చర్చలకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని చెప్పారు. చర్చలు జరపాలంటేత తగిన పరిస్థితులను సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. విచారకరమైన విషయం ఏమిటంటే, తమ మధ్య చర్చలు జరగడానికి ఇంకా చాలా సమయం ఉందని, అందుకుతగ్గ పరిస్థితులు ప్రస్తుతం లేవన్నారు. జెలెన్స్కీతో చర్చలపట్ల తనకు వ్యతిరేకత ఏమీ లేదని ఇప్పటికే తాను పలుసార్లు చెప్పానన్నారు. అదేవిధంగా క్రెమ్లిన్ వర్గాలు కూడా ఒక ప్రకటన చేస్తూ, ఒక స్పష్టమైన ఎజెండా లేకుండా రెండు దేశాల నాయకులమధ్యా ముఖాముఖీ సమావేశం సాధ్యంకాదని తెలిపింది. ఉక్రేన్‌కు నాటో, అమెరికా ఆయుధాలు సరఫరా చేయడాన్ని పుతిన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఒకవైపు ఆయుధాలు సరఫరా చేస్తూ మరోవైపు కాల్పుల విరమణ ఒప్పంద ప్రక్రియను, దౌత్య చర్యలను ముందుకు తీసుకురావడం హాస్యాస్పదమని రష్యన్ వర్గాలు ఇప్పటికే విమర్శించాయి. అంతర్జాతీయ జలాల్లో రష్యాకు సమీపంలో రెండు అణు జలాంతర్గాములను అమెరికా మోహరించడంతో ఈవారంలో రష్యా–అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. విట్‌కాఫ్ మాస్కో పర్యటన తర్వాత ఉద్రిక్తత కొంత తటస్థస్థాయికి చేరుకుంది.

**నిజమైన పరిష్కారం రావాలి:జెలెన్స్కీ**

ట్రంప్–పుతిన్ మధ్య ముఖాముఖీ సమావేశం త్వరలో జరుగుతుందని వచ్చిన వార్తలపట్ల ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ హర్షం ప్రకటించారు. ఎక్స్ వేదికగా గురువారంనాడు పోస్టింగ్ పెడుతూ, ఈ నాయకులిద్దరి సమావేశం ద్వారా ఉక్రేన్‌కు నిజమైన పరిష్కారం లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఐపిఎస్ హోదానా?

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం హోంమంత్రిత్వ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) అనుమతి తప్పనిసరి. అయితే ప్రభాకర్‌రావు నియామకం విషయంలో ఇలాంటి అనుమతులు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకోనట్లు సమాచారం. కనీసం ఆ మేరకు ప్రతిపాదనలు కూడా కేంద్రానికి పంపలేదని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభాకర్‌రావు నియామకం విషయంలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ఉత్తర్వులు జారీ చేసిందంటున్నారు. ప్రభాకర్‌రావును తిరిగి అదే పోస్టులో నియమించాలని నాటి హోం శాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఫార్సు చేయగా, ఆ సిఫార్సులపై అప్పటి సిఎం చంద్రశేఖర్‌రావు స్వయంగా సంతకం చేసినట్లు తెలిసింది. ఆ తరువాతనే ఎస్ఐబి ఐజిగా ప్రభాకరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2001 బ్యాచ్‌కు చెందిన తెలంగాణ క్యాడర్ ఐపిఎస్ అధికారి ప్రభాకర్‌రావు 2020 జూన్ 30వ తేదీన పదవీ విరమణ చేశారు. అదే రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను తిరిగి అదే స్థానంలో నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇలా రెండు సార్లు కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రభాకర్‌రావు 2023 డిసెంబర్ వరకు అదే పదవిలో ఉన్నారు. ఈ ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా బిఆర్ఎస్ ప్రభుత్వం ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌లోని 16(1), (5) నిబంధనలను ఉల్లంఘించిందని న్యాయ, ఐపిఎస్ వర్గాలు, కేంద్ర హోంశాఖ వర్గాలు అంటున్నాయి.

**కేసుల నమోదుకు సిట్ కసరత్తు:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ1 నిందితుడిగా ఉన్న మాజీ ఎస్ఐబి ఐజి, ఐపిఎస్ అధికారి టి.ప్రభాకర్‌రావు నియామకంపై సిట్ దర్యాప్తు అధికారులకు అనేక అనుమానాలు ఉన్నట్లు సమాచారం. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావుకు తిరిగి ఐపిఎస్ హోదా కల్పిస్తూ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం జారీచేసిన జిఒ పూర్తిగా నేరపూరితమైన చర్యగా భావిస్తున్నారు. ప్రభాకర్‌రావును తిరిగి నియమించాలనే సిఫార్సులపై సంతకం పెట్టిన కెసిఆర్‌తో పాటు సిఫార్సు చేసిన అధికారులపై కేసులు నమోదు చేసేందుకు సిట్ అధికారులు సిద్దమవుతున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని కోర్టుకు తెలియజేసిన తరువాత తదుపరి చర్యలకు అనుగుణంగా సిట్ అధికారులు నడుచుకునే అవకాశం ఉందని పోలీసు వర్గాల కథనం.

**ఐజి సంతకం దుర్వినియోగం:** ఫోన్ ట్యాపింగ్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలంటే టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం ఐజి స్థాయి అధికారి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అయితే, ఎస్ఐబి ఐజిగా రిటైరైన తరువాత మళ్ళీ నియమితులైన ప్రభాకర్‌రావుకు కేంద్ర హోంశాఖ నిబంధనల ప్రకారం ఐపిఎస్ హోదా ఉండదు. అయినప్పటికీ ఫలానా నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ చేయాలని ఐజి స్థాయిలో ప్రభాకర్‌రావు సంతకం చేసి, ఫోన్ ట్యాపింగ్ కమిటికీ సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఇలా ప్రభాకర్‌రావు ఐజిగా సంతకం చేయడం కూడా సిట్ అధికారులు నేరంగా పరిగణిస్తున్నారు. నిజానికి ఆ అధికారాలు ప్రభాకర్‌రావుకు ఉండవని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఐపిఎస్ అధికారి పదవీ విరమణ పొందితే మాజీ ఐపిఎస్ అధికారిగా, సామాన్య వ్యక్తిగా పరిగణిస్తారు. అలాంటిది ఐజిగా సంతకం ఎలా చేశారని సిట్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని కూడా కోర్టులో సవాల్ చేసే అవకాశాలు ఉన్నాయి.

**పెనం మీది నుంచి పొయ్యిలోకి:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ సతమతమవుతుండగా ఎస్ఐబి ఐజిగా ప్రభాకర్‌రావును నియమిస్తూ జారీచేసిన జీఓ కెసిఆర్‌కు కొత్త తల నొప్పులను తీసుకువస్తోందని భావిస్తున్నారు. ఇప్పటికే బిఆర్ఎస్ నేతలు గొర్రెల స్కామ్, ఈకార్ రేస్, భూదాన్ భూముల స్కామ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ స్కామ్, విద్యుత్ కొనుగోలు స్కామ్, ఫోన్ ట్యాపింగ్ తదితర కేసులలో తలలు పట్టుకుంటున్నారు. ఇదే సమయంలో ప్రభాకర్‌రావు నియామక జీఓ వెలుగు చూడడంతో బిఆర్ఎస్ అగ్ర నాయకుల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలోకి నెట్టినట్లు అయ్యిందని రాజకీయ నాయకులు అంటున్నారు.

# వైరా మున్సిపాలిటీలో దారిమళ్లిన జనరల్ ఫండ్

### ఖమ్మం యాక్సెస్ బ్యాంకులో నగదు డ్రా చేసిన అకౌంటెంట్

### ప్రత్యేకాధికారికి తెలియకుండానే ఇతరుల ఖాతాలో నిధులు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైరా మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ నిధులకు రెక్కలొచ్చాయి. ప్రజా ఉపయోగ పనులకు ఖర్చు చేయాల్సిన డబ్బు ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లో జమ అయింది. లక్షలాది రూపాయలు దారి మళ్లడంతో మున్సిపాలిటీ సిబ్బంది అవినీతి బాగోతం మరోసారి బయటపడింది. అదనపు కలెక్టర్ శ్రీజ వైరా మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా ఉండగా రూ.80లక్షల నిధులను దారి మళ్లించారంటే సిబ్బంది చేతివాటం ఏ స్థాయిలో ఉందో అవగతమవుతుంది. ఈ మొత్తం వ్యవహారం వెనక అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు మున్సిపల్ అకౌంటెంట్ ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. వివరాల్లోకి వెళితే… వైరా మున్సిపాలిటీకి రెండున్నర కోట్ల రూపాయలు జనరల్ ఫండ్ జమ అయింది. ఈ నిధుల నుండి అకౌంటెంట్‌గా విధులు నిర్వహించిన వ్యక్తి ఖాతాకు రూ.80లక్షలు దారి మళ్లించారు. అక్కడి నుంచి ఇతరుల ఖాతాల్లోకి కొంత సొమ్ము బదలాయించినట్లు సమాచారం. అకౌంటెంట్ ఖమ్మంలో ఉన్న యాక్సెస్ బ్యాంకు నుంచి వ్యక్తి గత చెక్ ద్వారా డబ్బులు డ్రా చేసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. అతని వద్ద నుంచి నలుగురు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఖాతాల్లోకి వెళ్లినట్లు తెలుస్తుంది. వైరా మున్సిపాలిటీలో నిధుల మళ్లింపు వ్యవహారంతో మున్సిపాలిటీలో జరుగుతున్న మరో అవినీతి బాగోతం బయటపడింది. మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను దారి మళ్లించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైరా పంచాయతీగా ఉన్నప్పుడు అనుమతుల పేరుతో కోట్ల రూపాయల అక్రమ వసూళ్లు జరిగాయి. మున్సిపాలిటీగా మారిన తర్వాత సైతం వైరాలో అవినీతి చీడ వదలడం లేదు. అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన నిధులు వ్యక్తుల ఖాతాల్లోకి ఎలా దారి మళ్లాయన్న ప్రశ్నకు కమిషనర్ వద్ద సమాధానం లేదు. సిన్సియర్ అధికారిగా పేరు ఉన్న అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉన్న వైరా మున్సిపాలిటీలోనే నిధులు దారి మళ్లడం చర్చకు దారి తీస్తుంది. ప్రత్యేకాధికారికి ఏ మాత్రం అనుమానం రాని రీతిలో నిధుల దారి మళ్లింపు జరిగినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపితే వీటితో పాటు వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న మొత్తం అవినీతి గుట్టు రట్టవుతుంది.

## 10న బాల్‌బాడ్మింటన్ సెలక్షన్

**హైదరాబాద్:** హైదరాబాద్ బాల్ బాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో సెలక్షన్ ట్రయల్స్ జరగనున్నాయి. వనస్థలిపురం (ఎన్‌జిఒస్ కాలనీ)లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ గ్రౌండ్స్‌లో ఈనెల 10వ తేదీ, ఆదివారం ఉ: 8.30 గంటలకు ట్రయల్స్ ప్రారంభమవుతాయని అసోసియేషన్ అధ్యక్షుడు టి. మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో విజేతలైన వారికి, ఈనెల 23, 24 తేదీల్లో, ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో జరిగే అంతర్‌జిల్లా సీనియర్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ సెలక్షన్ ట్రయల్స్‌ను ఔత్సాహిక బాల్ బాడ్మింటన్ క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. ఇతరత్రా వివరాలకు 9490682199 లేదా 9440344853 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com